


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తిరుపతి

: fb.com/vaartha Digital

Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

23-3-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 50 పేజీలు: 10+4 వెల: 8.00


ట్రంప్ 'గోల్డ్‌కార్డ్'కు భలే గిరాకీ

వ్యోమగామి సునీతకు ఓవర్‌టైం జీతం ఇస్తా: ట్రంప్


5లో

# దళిత, బహుజన సంక్షేమమే లక్ష్యం

## అన్ని ఉపకులాలకు న్యాయం చేసేందుకే వర్గీకరణ

## ఎస్సీలపై దాడులను సహించను

## బుడగ జంగాలను ఎస్సీలలో చేర్చే తీర్మానాన్ని కేంద్రానికి పంపుతాం: సీఎం చంద్రబాబు



**విజయవాడ,మార్చి22,ప్రభాతవార్తప్రతినిధి:** దళిత,బహుజన వర్గాల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు.దళిత వర్గాలకు పరిపూర్ణ న్యాయం చేసే దిశలోనే తాము నిర్ణయాలు తీసుకున్నామన్నారు.వీటి వెనుక అత్యంత అధ్యయనం,భవిష్యత్తు దార్మికీనకత ఉందన్నారు. సీఎంవో కార్యాలయం,'ఎక్స్'సామాజిక వేదికగా ఆయన పలు అంశాలను ప్రజలతో సీఎం చంద్రబాబు నాయుడు పంచుకున్నారు. ఈ క్రమంలోఎస్సీ వర్గీకరణపై ఎన్నికల సమయంలో చెప్పినట్లుగానే ఆ మాటను నిలబెట్టుకున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఎస్సీ ఉపకులాల్లో సమన్యాయం కోసం సుప్రీం కోర్టు తీర్పు మేరకు వర్గీకరణ చేశామని తెలిపారు. 1995లో తాను మొదట ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు సుధీర్ఘ కాలం పాటు సాగిన వర్గీకరణ అంశం మళ్లీ తన హయాంలోనే సాకారం చేయడం సంతృప్తిని ఇచ్చిందని అన్నారు. ఎస్సీ వర్గీకరణపై శాసనసభలో గురువారం సీఎం ప్రసంగించారు. 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన రాష్ట్రం యూనిట్ గా అమలు చేయాలని నిర్ణయించామని, 2026 జనాభా గణన తర్వాత వర్గీకరణను జిల్లా యూనిట్‌గా అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తామని వివరించారు. బడుగు, బలహీన వర్గాలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా పైకి తీసుకువచ్చేందుకు ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. బుడగ జంగాలను కూడా ఎస్సీల్లో చేర్చాలని అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని కేంద్రానికి పంపుతామని సీఎం చంద్రబాబు తెలిపారు. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ల దాటినా అసమానతలపై పోరాడాల్సి రావడం బాధాకరం. నేటికీ కొందరు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారు. మాదిగలకు అన్యాయం జరిగిందని, మాదిగ పేరు చెప్పేందుకు కూడా కొందరు వెనకాడుతున్నారనే ఉద్దేశంతో మాదిగ దండోరా అనే ఆర్గనైజేషన్ పెట్టి మందకృష్ణ పెద్ద ఉద్యమం చేశారు. నేను వారి సమస్యలను ప్రత్యక్షంగా చూశాను. వారు డిమాండ్లు సమంజసమని భావించి 10.09.1996లో జస్టిస్ రామచంద్రరావు కమిషన్ వేశామన్నారు.ఈ కమిషన్ రాష్ట్రమంతా తిరిగి అధ్యయనం చేసి 28.05- 1997న నివేదిక ఇచ్చింది. సమాజంలో అసమానతలు తొలగి, పేదరికం లేని సమాజం లక్ష్యంగా 1997, జూన్ 6న ఎస్సీ రిజర్వేషన్లను ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరిస్తూ ఉత్వర్వులు ఇచ్చాం. నవంబర్ 30, 1999న నాటి రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ ఆమోదంతో వర్గీకరణ అమల్లోకి వచ్చింది. దీంతో మాదిగలు, ఉప కులాలకు 22 వేలకు పైగా ఉద్యోగాలు వచ్చాయి. అయితే వర్గీకరణ అంశం కోర్టుకు వెళ్లడంతో వర్గీకరణ చేసే అధికారం ఒక్క పార్లమెంటుకే ఉందని 2004, నవబంర్ 5న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ క్రమంలో నాటి కేంద్ర ప్రభుత్వం వేసిన ఉషా మెహ్రా కమిషన్ వర్గీకరణ అమలైన 2000-2004 మధ్య మంచి ఫలితాలు వచ్చాయని స్పష్టం చేసింది.ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణకు అనుకూలంగా గతేడాది ఆగస్టులో సుప్రీం తీర్పు ఇచ్చింది. జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యులతో కూడి ధర్మాసనం తీర్పును వెలువరించింది.దాదాపు 30 ఏళ్ల క్రితం >>2

# విద్యావ్యవస్థలో కీలక సంస్కరణలు



## ఇక ప్రతి శనివారం 'నో బ్యాగ్‌డే' కచ్చితంగా అమలు

## ప్రభుత్వ స్కూళ్లలో యేటా వార్షికోత్సవాల నిర్వహణ

## 9,10 విద్యార్థులకు ఎఐ, కోడింగ్ వంటి స్పెషల్ కోర్సులు

**విజయవాడ,మార్చి22,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో విద్యావ్యవస్థలో కీలక మార్పులను తీసుకుని వస్తామని ఏపీ విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ఇటీవల అసెంబ్లీలో ప్రకటించారు.ఈ నేపథ్యంలోవచ్చే 2025-26 విద్యా సంవత్సరం నుంచి విద్యావ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చేందుకు ఏపీ ప్రభుత్వం కార్యచరణ రూపొందిస్తుంది.ప్రతి ఏటా ఇక పభుత్వ స్కూళ్లలో వార్షికోత్సవాలు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. జనవరి 27వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించడంతో పాటు చదువులో ముందున్న వారికి బహుమతులు అందిస్తారు. ఈ మార్పుల గురించి ఇప్పటికే ఉపాధ్యాయ సంఘాల నాయకులతో అధికారులు చర్చించారు. ఎకడమిక్ క్యాలెండర్‌ను సైతం సిద్ధం చేశారు. 9, 10 తరగతుల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కోడిం గ్ వంటి స్పెషల్ కోర్సులు నిర్వహిస్తారు. ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు సహకారంతో నైతికత, రాజ్యాంగ విలువలు, లింగ సమానత్వం వంటి వాటిపై విద్యార్థులకు బోధించనున్నారు. 6వ తరగతి విద్యార్థులకు వేసవి సెలవుల తర్వాత కొన్నిరోజులు బ్రిడ్జి కోర్సు ఏర్పాటు చేస్తారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రతి శనివారం నో బ్యాగ్ డ్డే. ఆ రోజు విద్యార్థులు బ్యాగ్‌లు తీసుకువెళ్లాల్సిన అవసరం లేదు. 9వ తరగతి విద్యార్థులకు మార్చి 15 నాటికి వార్షిక పరీక్షలు పూర్తి చేసి, ఆ వెంటనే పదో తరగతి సిలబస్‌కు సంబంధించి బ్రిడ్జి కోర్సు ప్రారంభిస్తారు. పదో తరగతి సిలబస్‌ను నవంబరు నెలాఖరు నాటికి పూర్తి చేసి డిసెంబరు 5వ తేదీ నుంచి 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తారు. ప్రీఫైనల్ ఫిబ్రవరి 9 నుంచి 19, గ్రాండ్ టెస్ట్ మార్చి 2 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తారు. పబ్లిక్ పరీక్షలను మార్చి 16 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు ఉంటాయి. ప్రస్తుతం జరుగుతున్న పదో తరగతి పరీక్షలు పూర్తయ్యే నాటికి ఒకే యాప్‌ను అందు బాటులోకి తీసుకొస్తారు. విద్యాశక్తి కార్యక్రమం పేరిట విద్యార్థులకు హైబ్రిడ్ లెర్నింగ్ నిర్వహిస్తారు. వెను కబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేస్తారు. దీని కోసం ఐఐటీ మద్రాస్‌తో విద్యాశాఖ ఒప్పందం చేసుకుంది. ఫార్మెటివ్1, 2, 3, 4 పరీక్షలు ఆగస్టు 4 నుంచి 7, అక్టోబరు 13 నుంచి 16, >>2

# లోక్‌సభ సీట్లు పెంచొద్దు

## రాష్ట్రాల్లో అంతర్గత డీలిమిటేషన్ చేపట్టాలి

## మరో 25యేళ్లు మార్పులు చేయొద్దు..

## చెన్నై అఖిలపక్ష సదస్సులో తెలంగాణ సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి22:** లోక్‌సభ సీట్లు పెంచవద్దని, రాష్ట్రాల్లో అంతర్గత డీలిమిటేషన్ చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నామని అన్నారు. శనివారం చెన్నైలో డీలిమిటేషన్‌పై డీఎంకే నేతృత్వంలో తమిళనాడు సీఎం స్టాలిన్ అధ్యక్షతన పార్టీలకతీతంగా అఖిల పక్ష భేటీ జరిగింది. ఈ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ జనాభా ఆధారంగా చేపట్టే డీలిమిటేషన్‌ను దక్షిణాది రాష్ట్రాలు అంగీ కరించవని స్పష్టం చేశారు. తెలంగాణలో వేగవం తమైన ఆర్థిక అభివృద్ధి సాధించామని సీఎం రేవంత్ తెలిపారు. జీఎస్‌డీపీ, తలసరి ఆదాయం లోనూ వృద్ధి సాధించామన్నారు. మౌలిక సౌక ర్యాల కల్పన, ఉపాధి కల్పనలో వృద్ధి సాధించామని వివరించారు. సుపరిపాలనతో >>2


శనివారం డీలిమిటేషన్‌పై చెన్నైలో జరిగిన సదస్సులో పాల్గొన్న తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి తదితరులు

హిందీ రచయిత వినోద్‌కుమార్ శుక్లాకు జ్ఞానపీఠ్ పురస్కారం 2లో

# జైలు నుంచి పోసాని విడుదల



**విజయవాడ,మార్చి22,ప్రభాతదార్తప్రతినిధి:** ఎపీ సీఎం చంద్రబాబునాయుడు, డీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ల మీదవారు విపక్షంలో ఉన్నప్పుడు అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో పోసాని కృష్ణ మురళి అరెస్ట్ అయ్యారు, గత కొన్ని రోజుల నుంచి ఆయన గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా >>2

# అక్రమ నర్సింగ్ విద్యాసంస్థలపై నిఘా

## సురక్షిత ప్రసవాల కోసం వైద్య సౌకర్యాలు బలోపేతం: మంత్రి సత్యకుమార్ యాదవ్



**విజయవాడ,మార్చి22,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఇబ్బడిముబ్బడిగా నర్సింగ్ విద్యా సంస్థల ఏర్పాటు, తదనంతర పరిణామాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.ఈ రంగాన్ని ప్రక్షాళన చేయడానికి శ్రీకారం చుట్టింది. ప్రజలకు ఉన్నతమైన వైద్య సేవల్ని అందించడానికి డాక్టర్లతో పాటు అంతే ప్రధానమైన ఉన్నత ప్రమాణాలు కలిగిన నర్సుల్ని అందించే దిశగా పలు చర్యల్ని చేపట్టాలని నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా 571 నర్సింగ్ స్కూళ్లు, కాలేజీలు ఏర్పాటయ్యాయి. ఇందులో 21 ప్రభుత్వ సంస్థలు కాగా 550 ప్రైవేట్ రంగంలో ఉన్నాయి. ఈ సంస్థల నుండి ఏడాదికి 30,220 మంది నర్సులు ఉత్తీర్ణ లవుతున్నారు. ఈ నేపథ్యంలో నర్సింగ్ విద్యా సంస్థల ఏర్పాటు, వాటిలో నర్సింగ్ విద్య నైపుణ్యతపై వివిధ అంశాల్ని సమగ్రంగా పరిశీలించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ కొంత కాలం క్రిందట ఆదేశించారు. ఈ మేరకు జరిగిన పరిశీలనా ఫలితాల్ని మంత్రి ఈరోజు సుదీర్ఘంగా చర్చించారు.రాష్ట్ర అవసరాలతో నిమిత్తం లేకుండా పలు నర్సింగ్ విద్యా సంస్థలు ఏర్పాటైన నేపథ్యం, దాని పరిణామాల్ని దృష్టిలో పెట్టుకుని గుర్తించిన అవసరాల మేరకు మాత్రమే అట్టి విద్యాసంస్థల >>2

# ఎపిలో 9% పెరిగిన కేన్సర్ కేసులు

## కేంద్ర మంత్రిత ప్రతాప్‌రావ్ జాదవ్

**విజయవాడ మార్చి 22 ప్రభాతవార్త ప్రతినిధి:** గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ లో 9% పెరిగిన క్యాన్సర్ కేసులు పెరిగాయి,తెలంగాణలో 10%, ఏపీలో 9% మేర క్యాన్సర్ కేసులు పెరిగాయి. దేశవ్యాప్తంగా నమోదైన సగటు పెరుగుదలతో పోలిస్తే ఇదికాస్త తక్కువ. క్యాన్సర్ రోగులకు వైద్య సౌకర్యాలు అందించేందుకు దేశవ్యాప్తంగా 19 స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లు మంజూరు చేసినట్లు మంత్రి చెప్పారు. ఈ మేరకు ఏపీలో కర్నూలులోని మెడికల్ కాలేజి తెలంగాణలో హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ అండ్ ఆర్‌సీసీలకు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ హోదా కల్పించినట్లు తెలిపారు. భారత్‌లో టీబీ కేసుల సంఖ్య 17.7 % తగ్గినట్లు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. లోక్‌సభలో రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు బదులిచ్చారు. 2015లో ప్రతీ లక్ష జనాభాకు 237 మంది టీబీ రోగులు ఉండగా 2023 నాటికి అది 195 కి తగ్గినట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా నమోదైప తగ్గుదల కంటే ఇది రెట్టింపు అనితెలిపారు. అలాగే మరణాలు 21.4% తగ్గినట్లు చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో ఒక్కగ్రామన్యాయాలయమూ ప్రారంభం కాలేదని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ తెలిపారు. ఆయన శుక్రవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఈమేరకు సమాధానమిచ్చారు. ఏపీలో 42 తెలంగాణలో 55గ్రామ న్యాయాలయాలను నోటిఫై చేయగా ఇంత >>2





మార్కెట్ రాబడులతో లైఫ్ కవర్ బెనిఫిట్స్‌ని పొందండి

నాన్-పార్, లింక్డ్, లైఫ్, ఇండివిజువల్, సేవింగ్స్ ప్లాన్

- ₹2,500/- అతితక్కువ నెలవారీ ప్రీమియంతో ప్రారంభించండి
- రెండు ఫండ్స్ నుంచి ఎంచుకోవచ్చు: నిఫ్టీ 50 (ఫ్లెక్సీ స్మార్ట్ గ్రోత్ ఫండ్) లేదా నిఫ్టీ 100 (ఫ్లెక్సీ గ్రోత్ ఫండ్) యొక్క ఎంపికచేసిన స్టాక్స్‌లో 100% వరకు పెట్టుబడిపెట్టడం జరుగుతుంది
- గ్యారంటీడ్ అడిషన్‌లతో*

*నియమ నిబంధనలు వర్తిస్తాయి

LIC
లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా
LIFE INSURANCE CORPORATION OF INDIA
ప్రతి క్షణం మీకు తోడుగా

LIC/P/2024-25/22/TEL

వివరాల కొరకు, మీ ఏజెంట్‌ని/సమీపంలో ఉన్న ఎల్ఐసి బ్రాంచిని సంప్రదించండి లేదా 56767474కి మీ నగరం పేరు ఎస్ఎంఎస్ చేయండి

డౌన్‌లోడ్ చేసుకోండి ఎల్ఐసి మొబైల్ యాప్ LIC digital | సందర్శించండి: licindia.in | కాల్ సెంటర్ సర్వీసు (022) 6827 6827 | మా వాట్సాప్ నం. 8976862090 'Hi' చెప్పండి | మమ్మల్ని ఫాలో అవ్వండి: LIC India Forever | IRDAI Regn No.: 512

నకిలీ ఫోన్ కాల్స్ మరియు కాల్పనిక/కపట ప్రతిపాదనలకు లొంగకుండా జాగ్రత్తపడండి. ఐఆర్‌డిఎఐ లేదా దాని అధికారులు బీమా పాలసీలు విక్రయించడం, బోనస్ ప్రకటించడం లేదా ప్రీమియంలు పెట్టుబడిపెట్టడం. మొత్తాలను రిఫండ్ చేయడం లాంటి పనులు వేటినీ చేయరు. ఇలాంటి ఫోన్ కాల్స్‌ని అందుకునే ప్రజలను పోలీసులకు ఫిర్యాదు చేయవలసిందిగా కోరడమైనది. నష్టాంశాలు, నియమ నిబంధనలపై మరిన్ని వివరాల కొరకు, దయచేసి పాలసీని విక్రయించడానికి ముందు అమ్మకాల బ్రోచర్‌ని జాగ్రత్తగా చదవండి.

మారుతుండే లింక్డ్ ఇన్సూరెన్స్ ప్రోడక్ట్‌లు సంప్రదాయ బీమా ప్రోడక్ట్‌ల కంటే భిన్నంగా ఉంటాయి మరియు నష్టాంశాలకు లోబడి ఉంటాయి.
లింక్డ్ ఇన్సూరెన్స్ పాలసీల్లో చెల్లించిన ప్రీమియం కింద అందించబడే యాన్యుటీ, క్యాపిటల్ మార్కెట్‌లతో మరియు బహిరంగంగా లభిస్తున్న ఇండెక్స్‌తో ముడిపడివున్న పెట్టుబడి రిస్కులకు లోబడి ఉంటుంది. ఫండ్ పనితీరు మరియు క్యాపిటల్ మార్కెట్‌లతో మరియు బహిరంగంగా లభిస్తున్న ఇండెక్స్‌ని ప్రభావితం చేస్తున్న అంశాలపై ఆధారపడి యూనిట్‌ల ఎన్ఏవిలు పెరగవచ్చు లేదా తగ్గవచ్చు మరియు ఇన్‌ష్యూర్డ్ (అతను/ఆమె) తన నిర్ణయాలకు తానే బాధ్యత వహించవలసి ఉంటుంది.
లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అనేది జీవిత బీమా కంపెనీ పేరు మాత్రమే మరియు ఇండెక్స్ ప్లస్ అనేది లింక్డ్ ఇన్సూరెన్స్ కాంట్రాక్టు పేరు మాత్రమే మరియు కాంట్రాక్టు నాణ్యతను, దాని వృద్ధి అవకాశాలను లేదా రాబడులను ఏ విధంగానూ సూచించడం లేదు.
ఈ కాంట్రాక్టు కింద అందించబడుతున్నవివిధ ఫండ్‌లు ఆయా ఫండ్‌ల పేర్లు మాత్రమే మరియు ఈ ప్లాన్‌ల నాణ్యతను, వాటి వృద్ధి అవకాశాలను మరియు రాబడులను ఏ విధంగానూ సూచించడం లేదు.



పట్టుబడిన గంజాయితో పోలీసులు

## రూ.30లక్షల విలువైన గంజాయి పట్టివేత

**పాచిపెంట (మన్యం జిల్లా) మార్చి 22 ప్రభాతవార్త :** పార్వతీపురం మన్యం జిల్లాలో పోలీసులు భారీ స్థాయిలో గంజాయిని పట్టుకున్నారు. సుమారు 30 లక్షల విలువైన 258 కిలోల 235 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను మన్యం జిల్లా సాలూరు ఇనస్పెక్టర్ పి.రామకృష్ణ పాచిపెంట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.గోగాడవలస-మాతుమోరు మధ్యలో గల గ్రీన్ ఫీల్డ్ రహదారిలో రెండు కార్లు ఆగి ఉన్నాయని వీఆర్వో రవిరాజు శుక్రవారం సాయంత్రం పోలీసులకు సమాచారం ఇచ్చారని తెలిపారు. ఈమేరకు పోలీసులు అక్కడికి చేరుకుని కార్లు తనిఖీ చేశారన్నారు. ఆ రెండు కార్లలో 134 ప్యాకెట్లలో సుమారు 30 లక్షల విలువ చేసే 258.235 కిలోల గంజాయిని పోలీసులు కనుగొన్నారని సిఐ రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. గంజాయి అక్రమ రవాణా చేసినట్లయితే చట్టరీత్యా వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అలాగే గంజాయి తదితర మత్తు పదార్థాలు వినియోగించినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గంజాయి తదితర మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియ చెయ్యాలని సీఐ రామకృష్ణ ఈ సందర్భంగా కోరారు.2025 జనవరి నుండి ఇప్పటి వరకూ సుమారుగా పద కొండు వందల కిలోల గంజాయిని సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. గంజాయి అక్రమ రవాణాపై నిఘా ఉంచి ఈ మూడు నెలల్లో అధిక మొత్తంలో గంజాయి పట్టుకున్న స్థానిక ఎస్సై వెంకట సురేష్‌తో పాటు పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు. స్థానిక పోలీసుల పనితీరుపై ఉన్నత అధికారులు కూడా ప్రశంసిస్తున్నారని తెలిపారు. ఏఎస్ఐ ముసలి నాయుడుతో పాటు ట్రైనింగ్ ఎస్సైలు, ఇతర పోలీసు సిబ్బంది కూడా విలేఖరుల సమావేశంలో పాల్గొన్నారు.

## విద్యావ్యవస్థలో కీలక సంస్కరణలు

>> వచ్చే ఏడాది జనవరి 5నుంచి 8, ఫిబ్రవరి 9 నుంచి 12వ తేదీ వరకూ నిర్వహిస్తారు. సమ్మెటివ్ 1, 2 పరీక్షలు నవంబరు 10 నుంచి 19, వచ్చే సంవత్సరం మార్చి 6 నుంచి 15వ తేదీ వరకూ ఉంటాయి. విద్యార్థుల్లో ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించేందుకు 'మిషన్ ఇంగ్లిష్ ఫ్లూయెన్సీ' కార్యక్రమం నిర్వహిస్తారు. డిజిటల్ లెర్నింగ్ స్కిల్స్ పెంపొందించేందుకు స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేస్తారు. విద్యార్థులకు మెడికల్, ఇంజినీరింగ్‌తో పాటు, ఏపీపీఎస్సీ, యూపీఎస్సీ, బ్యాంకింగ్, ఇతర ఉద్యోగావకాశాలపై మెగా కెరీర్ గైడెన్స్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తారు. విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన, కౌన్సెలింగ్‌కు స్టూడెంట్ వెల్ బీయింగ్ ప్రోగ్రామ్‌ను అమలు చేయనున్నారు.

## ఎపిలో 9% పెరిగిన కేన్సర్ కేసులు

>> వరకూ ఒక్కటికూడా పనిచేయడం లేదని చెప్పారు. దేశవ్యాప్తంగా 488 కి గాను 320 ప్రారంభమైనట్లు వివరించారు. లోక్‌సభలో జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ సహాయమంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ ఇచ్చిన సమాధానం ద్వారా ఈ విషయం వెల్లడైంది. అన్ని రకాల క్యాన్సర్ కేసులు ఏపీలో 2020లో 70,424 మేర ఉండగా, 2024 నాటికి ఆసంఖ్య 76,708కిపెరిగింది.అదే సమయంలో తెలంగాణలో కేసులసంఖ్య47,620 నుంచి 52334కి చేరింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఈ సంఖ్య 1392179 నుంచి 1533055కి పెరిగింది.

## అక్రమ నర్సింగ్ విద్యాసంస్థలపై నిఘా

>> ఏర్పాటును ప్రోత్సహించాలని నేటి సమీక్షా సమావేశంలో నిర్ణయించారు. గతంలో మంత్రి ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లాల వారీగా డిమాండ్ మరియు సరఫరా పరిస్థితిని డిఎంఇ అధికారులు మదింపు చేశారు. జనాభా ఆధారంగా ప్రతి వెయ్యి మందికి ముగ్గురు నర్సులు, రెండు ఆసుపత్రి పడకలు ఉండాలన్న డబ్ల్యుహెచ్ ఓ ప్రమాణాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ మదింపు చేశారు. దీని ఆధారంగా అవసరాల కంటే బాగా తక్కువగా నర్సుల లభ్యత ఉన్న 8 జిల్లాల్లో నూతన నర్సింగ్ విద్యా సంస్థల ఏర్పాటుకు ప్రాధాన్యతనివ్వాలని నిర్ణయించారు. నర్సుల కొరత ఎక్కువగా ఉన్న జిల్లాలుగా...శ్రీ సత్య సాయి, నంద్యాల, ఏలూరు, కోనసీమ, అన్నమయ్య, శ్రీకాకుళం, బాపట్ల మరియు అల్లూరు సీతా రామరాజు జిల్లాల్ని ఆ క్రమంలో గుర్తించారు. అవసరాల కంటే ఎక్కువగా నర్సుల లభ్యత ఉన్న జిల్లాలు విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి, తూర్పుగోదావరి, నెల్లూరు, కడప, ప్రకాశం మరియు అనంతపురం రాష్ట్రంలో నర్సింగ్ విద్యా సంస్థల ఏర్పాటు క్రమాన్ని పరిశీలించగా...201920 కాలంలో 133 విద్యా సంస్థల (మొత్తంలో దాదాపు నాలుగో వంతు) ఏర్పాటుకు అప్పటి ప్రభుత్వం అనుమతించినట్లు వెల్లడయ్యింది. వీటి ద్వారా ఏడాదికి 6,460 నర్సులు( మొత్తంలో 22 శాతం) ఉత్తీర్ణులవుతున్నారు. ఇదే కాలంలో 28 విద్యా సంస్థలకు నియమాలకు విరుద్ధంగా పేరెంట్ ఆసుపత్రులు లేకపోయినా అనుమతులు మంజూరైనట్లు అధికారులు వెల్లడించారు. ప్రైవేట్ రంగంలోని 548 నర్సింగ్ విద్యా సంస్థలకు సంబంధించి అధికారులు చేపట్టిన డాక్యుమెంట్ల పరిశీలన ఫలితాల్ని అధికారులు మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ కు వివరించారు. వీటిలో 427 సంస్థలు ( 78 శాతం) నియమాల ప్రకారం ఉండాల్సిన పేరెంట్ ఆసుపత్రుల వివరాల్ని ప్రభుత్వానికి అందించలేదు. 357 సంస్థలు (65 శాతం) స్వంత భవనాలకు సంబంధించి, 148 సంస్థలు(27 శాతం) మేనేజ్‌మెంట్ ట్రస్టు/సొసైటీకి చెందిన వివరాల్ని అందించలేదు. ఈ కీలక రంగానికి సంబంధించిన పలు అంశాల్ని, సమస్యల్ని సంబంధిత ఉన్నతాధికారులతో దాదాపు మూడు గంటలపాటు చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.పలు సంవత్సరాలుగా నర్సింగ్ విద్యా సంస్థల ఏర్పాటుకు స్వీయ ప్రతిపాదనలతో ముందుకొచ్చిన వారికి రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు మంజూరు చేయడంతో.. డాక్యుమెంట్ల పరిశీలనలో బయటపడిన లోపాలు, వాటి పరిణామాలపై మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులతో కూలంకషంగా చర్చించారు. దీంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నర్సింగ్ విద్యా సంస్థల్లో అందించబడుతున్న విద్య నాణ్యతపై మంత్రి పలు ప్రశ్నల్ని సంధించి, పర్యవేక్షణా లోపాన్ని ఎత్తి చూపారు. ఆయా నర్సింగ్ విద్యా సంస్థల్లో నియమాల మేరకు అధ్యాపకుల నియామకం, సొంత భవనాల లభ్యత, ప్రయోగశాలల ఏర్పాటు, క్లినికల్ మెటీరియల్‌ల లభ్యతపై ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీలు జరపాలని మంత్రి ఆదేశించారు.డిఎంఇ విభాగం గుర్తించిన లోపాలపై ఏప్రిల్ 15లోగా ఆయా నర్సింగ్ విద్యా సంస్థలకు నోటీసులిచ్చి వాటిని రెండునెలల్లోగా సవరించకుంటే 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాల్ని అనుమతించేది లేదంటూ స్పష్టం చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. అదేవిధంగా వివిధ నర్సింగ్ విద్యా సంస్థల్లో భౌతిక పరిశీలనలో వెల్లడయ్యే లోపాల్ని ఈ ఏడాది జూన్ 15లోగా సవరించకపోతే ప్రవేశాల్ని అనుమతించరాదని మంత్రి ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, కార్యదర్శి డాక్టర్ మంజుల డి. హోష్మణి, డిఎంఇ డాక్టర్ నరసింహం,రాష్ట్రనర్సింగ్ కౌన్సిల్‌కార్యదర్శి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఢిల్లీ బడ్జెట్ కోసం ప్రజలనుంచి 10వేల సూచనలు: సిఎం రేఖాగుప్తా

**న్యూఢిల్లీ, మార్చి 22:** దేశరాజధాని కేంద్రపాలితప్రాంత ఢిల్లీ అసెంబ్లీకి కొత్త బడ్జెట్‌ఫరంగా కోరిన సలహాలు సూచనలు భారీగా వచ్చాయని ముఖ్యమంత్రి రేఖాగుప్తా వెల్లడించారు. మొత్తం వివిధ రంగాలనుంచి 10వేల సూచనలు అందాయన్నారు. మహిళల ఆర్థిక సాధికారత, విద్య,ఆరోగ్యం, యమునానది ప్రక్షాళన, కాలుష్యం వంటి వాటికిబడ్జెట్‌లో ప్రాధాన్యం ఇస్తామన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం ఖీర్ వేడుకతో ప్రారంభం అవుతాయని అన్నారు. దేశరాజధానిలో అసెంబ్లీ బడ్జెట్‌సమావేశాలు ఈనెల 24నుంచి 28వరకూ జరుగుతాయి. 25న బడ్జెట్‌నుప్రవేశపెడతారు. బడ్జెట్‌ను సిద్ధంచేసేముందు ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు తమ ప్రభుత్వం నిపుణులతో సహా సమాజంలోని వివిధ వర్గాలను సంప్రదించిందని రేఖాగుప్త తెలిపారు. ప్రజలనుంచి మెయిల్ ద్వారా 3303 సూచనలు రాగా వాట్సాప్‌ద్వారా 6982 సూచనలు వచ్చాయన్నారు. వాటిని పరిగణంలోనికి తీసుకునే బడ్జెట్‌ను రూపొందిస్తామన్నారు. ప్రజల ప్రాథమిక అవసరాలను ఉపాధి కల్పనను దృష్టిలోపెట్టుకుని ప్రధానిమోడీ నేతృత్వంలోని బిజెపిన రపభుత్వం ఢిల్లీని అభివృద్ధిబాటలో నడుపుతుందని ముఖ్యమంత్రి రేఖాగుప్తా పేర్కొన్నారు.

## దళిత,బహుజన సంక్షేమమే లక్ష్యం

>> ఎస్సీ వర్గీకరణకు నేను కమిటీ వేశాను. నాటి నుంచి వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చేంత వరకూ ఈ సుదీర్ఘ ప్రయాణంలో నేను భాగస్వామిని కావడం అరుదైన అవకాశంగా, నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు.సామాజిక న్యాయం కోసం నేను చేసిన ఆలోచన సబబు అని అత్యున్నత న్యాయస్థానం తీర్పు ద్వారా స్పష్టమైంది. ఎన్టీఆర్ సామాజిక న్యాయం కోసం అనునిత్యం తపించారు. దేశంలోనే మొదటిసారిగా ఎస్సీ, ఎస్టీలకు శాశ్వత గృహాలు నిర్మించిన వ్యక్తి ఎన్టీఆర్. దేశంలో మొదటిసారిగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుకునేందుకు సోషల్ వెల్ఫేర్ స్కూలు పెట్టింది కూడా ఎన్టీఆరే. నాడు ముఖ్యమంత్రిగా ఎస్సీల పట్ల వివక్షను నేను స్వయంగా చూశాను. ఆ రోజుల్లో తెలంగాణలో అయితే బాన్చత్ నీ కాళ్లు మొక్కుతా అనేవారు. అంటరానితనాన్ని రూపుమాపేందుకు నాకు చాలా సమయం పట్టింది. ఆనాడు బోతర్లు, బావుల దగ్గర నీరు తీసుకునేందుకు ఎస్సీలను రానిచ్చేవారు కాదు. వారు చెప్పులు లేకుండా ఊర్లో తిరగాలి. టీ స్టాల్ దగ్గర గ్లాస్ లు వేరే పెట్టేవారు. ఇవన్నీ చూశాక నేను జస్టిస్ పున్నయ్య కమిషన్ వేయగా బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చిత్తశుద్ధితో పనిచేశారు. రాష్ట్రంలో కుల వివక్ష ఉండకూడదనే ఉద్దేశంతో 25 మెమోలు, జీవోలు ఇచ్చాను.ఎస్సీ వర్గీకరణపై 15.11.2024లో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రాతో ఏక సభ్య కమిషన్ వేశాం. వారు 13 ఉమ్మడి జిల్లాల్లో తిరిగి ప్రజల అభిప్రాయాలు తీసుకున్నారు. 10.03.2025న సమగ్ర నివేదికఇచ్చారు. 59 ఉపకులాలను 3 కేటగిరీలుగా విభజించి రిజర్వేషన్లు కేటాయించారు. గ్రూప్ 1 అత్యంత వెనుకబడింది, గ్రూప్ 2 వెనుకబడింది, గ్రూప్ 3 సాపేక్షంగా తక్కువ వెనుకబడింది గ్రూప్ 1 అత్యంత వెనుకబడిన కేటగిరి రెల్లి ఉప కులాలకు 1.0 . గ్రూప్ 2 వెనుకబడిన కేటగిరీ మాదిగ ఉపకులాలకు 6.5 గ్రూప్ 3 సాపేక్షంగా వెనుకబడిన కేటగిరి మాల ఉప కులాలకు 7.5 శాతంరోస్టర్ విధానం ప్రకారం మొదట 100 పోస్టులు వస్తే 8 పోస్టులు మాల సామాజిక వర్గానికి వస్తాయి. మాదిగ సామాజిక వర్గానికి 6 శాతం, రెల్లి సామాజిక వర్గానికి ఒక శాతం వస్తాయి. మూడు కలిపితే 15 శాతమవుతుంది. 200 పోస్టులు వస్తే మాల సామాజిక వర్గానికి 15, మాదిగ సామాజిక వర్గానికి 13 , రెల్లికి 2 పర్సంటేజ్ వస్తుంది. తద్వారా రోస్టర్‌లో అందరికీ న్యాయం జరుగుతుంది. టీడీపీ ఆవిర్భావం నుంచి కుల వివక్షతపై యుద్ధం చేసింది. గిరిజన భూములు గిరిజనులకే చెందాలని చట్టాన్ని తెచ్చి అమలు చేశాం. 694 జీవో ప్రకారం జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ఎస్సీ,ఎస్టీల సమస్య పరిష్కార కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశాం. అధికారులంతా వారానికోసారి గ్రామానికి వెళ్లేలా ఆదేశాలిచ్చాం. కుల వివక్ష చూపే వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టేందుకు ఆదేశాలు ఇచ్చాం.దేవాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో అంటరానితనం నిర్మూలనకు చర్యలు తీసుకున్నాం. అంటరానితనంపై పోరాడే వారికి జిల్లాస్థాయిలో 5 మందికి రూ.10వేల నగదుతో అవార్డులు,రాష్ట్రస్థాయిలో రూ.25వేల నగదుతో ప్రోత్సాహకాలు అందిం చాం. ఎస్సీ మహిళలపై అత్యాచారాలు జరిగితే కలెక్టర్,ఎస్పీలు 24గంటల్లో వెళ్లి చర్యలు తీసుకు నేలా ఆదే శాలు ఇచ్చాం. ఎస్సీ అట్రాసిటీస్‌పై ప్రత్యేక కోర్టులు పెట్టాం. ప్రభుత్వ వ్యయంతో న్యాయవాదులను నియమించాం. సామాజిక సమానత్వంపై క్యాంపులు పెట్టి చైతన్యంతెచ్చాం. రాష్ట్రస్థాయిలో నోడల్ ఆఫీసర్‌ని నియమించాం. ప్రతినెలా 30వ తేదీన ప్రతిగ్రామంలో పౌరహక్కుల ఉత్సవాలు జరిపామన్నారు. ఎస్సీ వర్గాలపైదాడులను ఎంతమాత్రం సహించను. అటువంటి శక్తులను అత్యంత కఠినంగా శిక్షిస్తామన్నారు.

## లోక్‌సభ సీట్లు పెంచొద్దు

>> పాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొ న్నారు. దేశ ఖజానాకు మనం పెద్ద మొత్తంలో నిధులు ఇస్తూ తక్కువ మొత్తాన్ని పొందుతు న్నామని, తమిళనాడు పన్నుల రూపంలో కేంద్రానికి రూపాయి చెల్లిస్తే 29 పైసలే వెనక్కి వస్తుంది.. ఉత్తరప్రదేశ్‌కు రూపాయికి రెండు రూపాయల 73 పైసలు వెనక్కి వెళుతున్నాయి. బీహార్ రూపాయి చెల్లిస్తే 9 రూపాయల 22 పైసలు వెనక్కి తీసుకుంటుంటే కర్ణాటకకు కేవలం 14 పైసలు, తెలంగాణకు 41 పైసలు, కేరళకు 62 పైసలు మాత్రమే వెనక్కి వస్తున్నాయి. అదే సమయంలో మధ్యప్రదేశ్ రూపాయి పన్ను రూపంలో కేంద్రానికి ఇస్తే వెనక్కి రూ.2.79 పైసలు వెళుతున్నాయి అని వివరించారు. దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం కేటాయింపులు.. పన్ను చెల్లింపులు క్రమంగా తగ్గిస్తోంది.. చివరకు జాతీయ ఆరోగ్య మిషన్ కేటాయింపుల్లోనూ ఉత్తరాది రాష్ట్రాలకే 60 నుంచి 65 శాతం నిధులు దక్కుతున్నాయని పేర్కొన్నారు. పునర్విభజనను మనం అంగీకరించం.. ఎందుకంటే ఇది దక్షిణాది రాష్ట్రాల రాజకీయ కుదింపు. మంచి ప్రగతి సాధిస్తున్న రాష్ట్రాలను ఈ ప్రక్రియ శిక్షిస్తోందని చెప్పారు. ఈ అసమగ్రమైన పునర్విభజన ప్రక్రియ చేపట్టకుండా మనం బీజేపీని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. 1976లో ఇందిరా గాంధీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అలానే పునర్విభజన చేపట్టింది. లేకుంటే రాష్ట్రాల మధ్య రాజకీయ తేడాలు (అసమతౌల్యాలు) వచ్చేవి.. 2001లో ప్రధానమంత్రి వాజ్‌పేయీ నేతృత్వంలోని ప్రభుత్వం పునర్విభజన ప్రక్రియను అలానే ప్రారంభించింది. లోక్‌సభ సీట్లను అదే సంఖ్యలో ఉంచుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అదే విధంగా చేయగలరా? అని ప్రశ్నించారు. బీజేపీ ప్రతిపాదిస్తున్న జనాభా దామాషా పద్ధతిలో పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాలైన మనం రాజకీయ గళం కోల్పోతాం. మనల్ని ఉత్తరాది ద్వితీయ శ్రేణి పౌరులుగా తగ్గించివేస్తుందని వివరించారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేపడితే ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు దేశంపై ఆధిపత్యం చలాయిస్తాయని ఇక్కడ ఉన్న ప్రతి ఒక్కరూ అంగీకరిస్తారు. ఏ పరిస్థితుల్లోనూ మనం దీనికి అంగీకరించకూడదు,బీజేపీ అనుసరిస్తున్న ఈ విధానానికి వ్యతిరేకంగా దక్షిణాది ప్రజలు, పార్టీలు, నాయకులు ఏకం కావాలి అని పిలుపునిచ్చారు.



## ఆర్థిక శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష


**విజయవాడ, మార్చి 22 ,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో అత్యంత సమన్వయంతో వ్యవహరించాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు. రాష్ట్రానికి ఏ ప్రభుత్వరంగ శాఖకు నిధులు విడుదలలో జాప్యం చోటు చేసుకుంది తదితరంశాలపై దృష్టిపెట్టాలన్నారు.,రాష్ట్రంలోను ద్రవ్యవినిమయ బిల్లు ఆమోదించబడిన నేపథ్యంలో ఆయా పథకాల పరిధిలో బకాయిల విడుదలపైన ఫోకస్ పెట్టాలన్నారు.ఇంకా నిధులు విడుదల చేయని రెగ్యూలర్ పథకాలకు నిర్దేశిత వ్యవధిపెట్టి వాటిని జమచేయాలన్నారు.రాష్ట్ర ఆర్థిక శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం సమీక్ష చేశారు. మరో వారంరోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఆర్థిక శాఖలో స్థితిగతులపై చర్చించారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై అధికారులతో రివ్యూ చేశారు. కేంద్రంలోని ఆయా శాఖల నుంచి రావాల్సిన నిధులు వచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర పథకాలకు సంబంధించి అవసరమైన సమగ్ర సమాచారాన్ని అందించి సకాలంలో నిధులు విడుదల అయ్యేలా చూడాలని అధికారులకు సీఎం సూచించారు. కేంద్ర పథకాలకు సంబంధించి 5 శాఖల నిధులు రావాల్సి ఉందని అధికారులు తెలపగా కేంద్రంతో సంప్రదింపులు జరిపి ఆర్థిక సంవత్సరం ముగింపులోగా నిధులు తెచ్చుకోవాలని తెలిపారు. హైదరాబాద్ లోని సిఎం నివాసంలో జరిగిన ఈ రివ్యూకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక శాఖ సెక్రటరీ రోనాల్డ్ రోస్ హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, సిఎంవో అధికారులు పాల్గొన్నారు.

## చంద్రబాబును కలసిన కేవీబీ పురం టీడీపీ నేతలు

**కేవీబీ పురం, మార్చి 22 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుటుంబ సమేతంగా తిరుమల దర్శనార్థం వచ్చిన సందర్భంగా రేణిగుంట విమానాశ్రయంలో కేవీబీ పురం మండలానికి చెందిన టీడీపీ నేతలు కలిశారు. రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్, తిమ్మసముద్రం సర్పంచ్, పార్టీ సీనియర్ నేత ఎర్రం దొరబాబునాయుడు, అదేవిధంగా ఓల్లూరు సర్పంచ్ సురేష్‌చౌదరి, పీవీ కండ్రిగ సర్పంచ్ ప్రకాష్ యాదవ్‌లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.

## హిందీ రచయిత వినోద్‌కుమార్ శుక్లాకు జ్ఞానపీఠ్ పురస్కారం

**నయారాయ్‌పూర్, మార్చి 22:** హిందీభాషలో ఎన్నో రచనలుచేసిన ప్రముఖ రచయిత వినోద్ కుమార్ శుక్లాకు దేశంలోనే అత్యున్నత సాహిత్య గౌరవమైన జ్ఞానపీఠ్ అవార్డు దక్కింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన 88 ఏళ్ల వినోద్‌కుమార్ శుక్లా ఎన్నో రచనలుచేసారు. హిందీలో లఘు కథలు, కవితలు, వ్యాసాలు రాసారు. దేశంలోని ప్రముఖ హిందీరచయితల్లో ఒకరయిన ఆయన సాహిత్యరంగానికిచేసిన సేవలకు గుర్తింపుగా ఈ ఉన్నత పురస్కారం లభించింది. వినోద్ కుమార్‌శుక్లాను జ్ఞానపీఠ్ అవార్డుకు ఎంపిక చేస్తున్నట్లు శనివారం ప్రకటించారు. 59వ జ్ఞానపీఠ్‌పురస్కారాన్ని ఈసారి శుక్లా అందుకోబోతున్నారు. ఇప్పటికే 58 మందికి ఈ అవార్డును అందచేసారు. చత్తీస్‌ఘర్ తొలి రచయితగా వినోద్‌కుమార్ ఇపుడు గుర్తింపుపొందారు. అలాగే హిందీభాషలో ఈ అవార్డు అందుకున్న 12వ రచయితగా నిలిచారు.ప్రఖ్యాత స్టోరీ



టెల్లర్,జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత ప్రతిభా రే నేతృత్వంలోని జ్ఞానపీఠ్ సెలక్షన్ కమిటీ సమావేశంలో వినోద్‌కుమార్‌శుక్లాను ఈ అవార్డుకు ఎంపికచేసారు. జ్ఞానపీఠ్ పురస్కారంతో పాటు రూ.11 లక్షల నగదు సరస్వతీదేవి కాంస్య విగ్రహం అందిస్తారు. వినోద్‌కుమార్ శుక్లా 1999లో సాహిత్య అకాడమీ పురస్కారాన్ని కూడా అందుకుంటారు.

## ఐఎఎస్ సుబ్రమణ్యానికి కేంద్రంలో కీలక పోస్టింగ్

**విజయవాడ,మార్చి22,ప్రభాతవార్తప్రతినిధి:** ఐఏఎస్ సుబ్రమణ్యానికి కేంద్రంలో కీలక పోస్టింగ్ వరించింది. న్యూ రెన్యువబుల్ ఎనర్జీ శాఖకు జాయింట్ సెక్రటరీగా నియమిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. అస్సాం కేడర్‌కి చెందిన 2009 బ్యాచ్ ఐఏఎస్‌గా సుబ్రమణ్యం జవ్వాది. గతంలో ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలశాఖ కమిషనర్‌గా, ఏపీఐఐసీ ఎండీ, ఏపీఈడీబీ సీఈవోగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత డిప్యుటేషన్‌లో కేంద్ర ఎకనమిక్ ఎఫైర్స్ శాఖకు డైరెక్టర్‌గా వెళ్లారు. అనంతరం ఆయనకు ఇటీవల కేంద్రం జాయింట్ సెక్రటరీ హోదా కల్పించింది. 2047 కల్లా 100 గిగావాట్ల అణువిద్యుత్ సామర్థంతో భారత ప్రభుత్వం అడుగులేస్తోంది. 2027 నాటికి దేశవ్యాప్తంగా కోటి కుటుంబాలకు సోలార్ విద్యుత్ వెలుగులు అందించాలన్న సంకల్పంతో ముందుకెళుతోంది. ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ2024 ప్రకారం రూ.10 లక్షల కోట్ల విలువైన 160 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను ఏర్పాటు లక్ష్యాన్ని ఏపీ నిర్దేశించుకుంది. దీనివల్ల 7.50 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు సృష్టించాలనుకుంటోంది.



శనివారం కర్నూలు జిల్లా పుడిచెర్లలో జరిగిన సభలో చిన్నారిని ఎత్తుకొన్న డి.సిఎం పవన్ కల్యాణ్‌తత

## సమగ్ర ప్రణాళికతో అభివృద్ధి

### ఉపాధి హామీతో అన్నదాతల కళ్లలో వెలుగు

### ఫామ్ పాండ్స్ నిర్మాణానికి భూమి పూజ చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

### రాష్ట్రవ్యాప్తంగా లక్షా 55వేల ఫామ్ పాండ్స్ నిర్మాణానికి శ్రీకారం

**కర్నూలు, మార్చి 22, ప్రభాతవార్త :** రాష్ట్ర అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. మా ప్రభుత్వంలో వ్యవస్థలను పటిష్ట పరుచుకుంటూ ముందుకు వెళ్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తే.. కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో ప్రజలకు ఉపాధి కల్పించే దిశగా ఉపాధి హామీ పనులు ముందుకు తీసుకువెళ్తున్నామన్నారు. ప్రజలకు ఉపాధి, ఆర్థిక స్థిరత్వం కల్పించాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అనుభవజ్ఞులైన ముఖ్యమంత్రి ఉండబట్టే పల్లె పండుగ విజయవంతం అయ్యిందన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం, పుడిచెర్లలో జరిగిన కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ భూముల్లో సేద్యపు నీటి కుంటల(ఫామ్ పాండ్స్) నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షా 55 వేల ఫామ్ పాండ్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభను ఉద్దేశించి పవన్ మాట్లా డుతూ''గత ప్రభుత్వంలో జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రాజకీయ ఉపాధి పథకంగా మార్చారు. అలాంటి వాటిని ఎదుర్కోవడానికి బలమైన అధికారులను ఏర్పాటు చేశాం. పల్లె పండుగ పనుల్లో కర్నూలు జిల్లా మొదటి స్థానంలో ఉంది. కర్నూలు జిల్లాలో రూ.75 కోట్లతో 117 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మించాం. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలో 98 శాతం రోడ్ల నిర్మాణం పూర్తయ్యింది. రైతులు నీరు నిలవ చేసుకోగలిగితే సమస్య ఉండదు. వర్షాలు రాగానే పంట కుంటలు నిండేలా ప్రణాళికలు చేస్తాం. గత ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలను పటిష్టపరచిన పాపాన పోలేదు. వాటిని పూర్తిగా నిర్వీర్యం చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ కింద సొంత గ్రామాల్లోనే పనులు కల్పించాం. ఉపాధి హామీ కింద ఇప్పటి వరకు రూ. 9,597 కోట్లు ఖర్చు చేశాం. ప్రజలకు ఉపాధి, ఆర్థిక స్థిరత్వం కల్పించాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు గత ప్రభుత్వంలో లబ్దిదారులు ఎవరో కూడా తెలియకుండా చేశారన్నారు. ఈ రోజు జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఎకరం 30 సెంట్ల నేలలో 6 సెంట్లలో చెరువు, రెండు సెంట్లలో గట్టు ఉండే విధంగా నిర్మిస్తున్నాం. గత ప్రభుత్వంలో ఎవరు లబ్దిదారులో కూడా తెలియనంతగా అవకతవకలకు పాల్పడ్డారు. ఈ రోజు పుడిచర్ల గ్రామానికి చెందిన రైతు సూర రాజన్నకు చెందిన భూమిలో ఫామ్ పాండ్ కి భూమి పూజ చేశాం. ఈ పథకం ద్వారా ఉపాధి కూలీలు లబ్ది పొందుతున్నార. గ్రామాల్లో పనులు లేక నలిగిపోతున్నవారికి ఉపాధి కల్పించేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ పథకానికి కావాల్సిన అర్హత కష్టపడి పని చేయడమే అన్నారు.ఈ కార్యక్రమంలో కర్నూలు పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి, పాణ్యం శాసనసభ్యురాలు గౌరు చరితారెడ్డి, నందికొట్కూరు శాసన సభ్యులు గిత్తా జయసూర్య, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి కమిషనర్ కృష్ణ తేజ, జిల్లా కలెక్టర్ రంజిత్ భాషా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జైలు నుంచి పోసాని విడుదల

>> ఉన్నారు. నిన్న ఆయనకు గుంటూరులోని సీఐడీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో శనివారం ఆయన జైలు నుంచి విడుదల అయ్యారు. వైసీపీ నేత అంబటి రాంబాబు జైలు వద్దకు వెళ్లారు. జైలు నుంచి బయటకు వచ్చిన పోసానికి స్వాగతం పలికారు. ఆ తర్వాత పోసాని తన కుటుంబసభ్యులతో కలిసి కారులో అక్కడినుంచి వెళ్లిపోయారు. కాగా, మార్చి 23వ తేదీ వరకు పోసాని రిమాండ్‌లో ఉండాల్సి ఉంది. సీఐడీ అధికారులు ఒక రోజు ఆయన్ని కస్టడీలోకి తీసుకుని విచారించారు. మరోసారి తమకు విచారణ నిమిత్తం అప్పగించాలని కోర్టును కోరారు. కానీ, ఈ లోపే సీఐడీ కోర్టు ఆయనకు బెయిల్ ఇచ్చింది. రూ. లక్ష చొప్పున ఇద్దరు వ్యక్తుల తోపాటు సొంత పూచీకత్తు సమర్పించాలని ఆదేశించింది. చార్జిషీటు దాఖలు చేసే వరకు గుంటూరు సీఐడీ రీజినల్ ఆఫీసులో రెండు వారాలకోసారి హాజరు కావాలని షరతు పెట్టింది. పోలీసులు పిలిచినప్పుడు వచ్చి విచారణకు సహకరించాలని ఆదేశించింది. అయితే, పోసానిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వ్యాప్తంగా చాలా చోట్ల కేసులు నమోదు అయి ఉన్నాయి. బెయిల్ మంజూరు అయిన తర్వాత కూడా ఆయన విడుదలపై ఉత్కంఠ నెలకొని ఉండింది. కోర్టు బెయిల్ మంజూరు చేసినా.. ఏ జిల్లా నుంచి అయినా పోలీసులు వచ్చి పీటీ వారెంట్‌తో పోసానిని మరోసారి అదుపులోకి తీసుకుంటారా? అనే సందిగ్ధతకు ఏర్పడింది.ఈ క్రమంలో పోసాని విడుదలయ్యారు.

### వారం - వర్జ్యం

తేది : 23-03-2025, ఆదివారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
నవమి తె.5.39
పూర్వాషాఢ తె.4.17
వర్జ్యం మ.1.20-3.00
దు.సా.4.46-5.35
రాహుకాలం - సా.4.30-6.00

### వార్తాఫలం

**మేషం** :ఆర్థిక వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైన పట్టుదలతో అధిగమిస్తారు. రుణబాధలు తప్పవు.

**వృషభం** : పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. సోదరుల నుండి సాయం అందుకుంటారు.

**మిథునం**: ఆస్తి వివాదాలు పరిష్కారమై నూతన ఒప్పందాలు కుదురుతాయి. దూరప్రాంతాల నుండి శుభవార్తలు.

**కర్కాటకం** :కుటుంబ సమస్యలు తీరి ఊరట చెందుతారు. వస్తు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**సింహం**:ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు.

**కన్య** : ప్రముఖుల నుండి శుభవార్తలు అందుకొంటారు. బంధువుల నుండి సాయం అందుకుంటారు.

**తుల** : చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు. ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కుతారు.

**వృశ్చికం**: ఆర్థిక ఇబ్బందులు ఎదురైన సమర్థవంతంగా నిర్వహిస్తారు. రుణాలు కొంతవరకు తీరుస్తారు.

**ధనుస్సు**: ముఖ్యమైన వ్యవహారాలలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.

**మకరం**:సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. కాంట్రాక్టుల లాభిస్తాయి.

**కుంభం**:కుటుంబ సభ్యుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు. ప్రయాణాలు లాభిస్తాయి.

**మీనం** : విలువైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త అవసరం. బంధువులతో ఏర్పడిన తగాదాలు పరిష్కరించుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



## పల్లికొండేశ్వర స్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.8,15,338,00

**నాగలాపురం, మార్చి 22 ప్రభాతవార్త:** నాగలాపురం మండలం సురుటుపల్లి గ్రామంలో వెలసి ఉన్న శ్రీ పల్లికొండేశ్వర స్వామి దేవస్థానంకు సంబంధించిన హుండీ లెక్కింపు కార్యక్రమం(పరాకామణి) శనివారం దేవాదాయ శాఖ, తిరుపతి డివిజన్ తనిఖీదారులు పి.పణిరాజశయన వారి పర్యవేక్షణలో ఆలయ కార్య నిర్వహణాధికారిణి పి.లత ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. 60 రోజులకు గాను దేవస్థానం హుండీల ద్వారా రూ.7,52,706లు, అన్నదానం ద్వారా రూ.62,632లు, మొత్తం రూ.8,15, 338,00లు ఆదాయం వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో నాగలాపురం పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రవి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నరేగా పథకం కింద డొంక రోడ్లను చేర్చాలి

### - బందరు ఎంపి వల్లభనేని బాలశౌరి




:దిశ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి వల్లభనేని బాలశౌరి

**విజయవాడ,మార్చి22,ప్రభాతవార్తప్రతినిధి:** మహాత్మా గాంధీ నరేగా పథకం కింద డొంక రోడ్లను కూడా చేర్చాలని దిశా కమిటి చైర్మన్, మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి కోరారు. శనివారం జరిగిన దిశా కమిటి సమావేశంలో దిశా కమిటి చైర్మన్, మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ పండించిన పంటను పొలంనుండి రైతన్నలు మార్కెట్ కు తీసుకు వెళ్ళడానికి డొంక రోడ్ల అవసరం చాలా ఉన్నదని, ఈ విషయంలో ఒక నోట్ తయారుచేసి పంపాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ని కోరారు. అలెంకో వారినుండి దివ్యాంగులకు అవసరమైన యంత్రపరికరాలను తెప్పించాలని డిజేబుల్ ఏడి సూచించారు. రూరల్ వాటర్ సప్లయ్ శాఖను జల జీవన్ మిషన్ కింద అన్ని గ్రామాలకు మంచి నీరు అందించే విధంగా ప్రతిపాదనలు తయారుచేయాలని కోరారు. అలాగే ప్రస్తుత వేసవి కాలంలో కొన్ని గ్రామాలలో త్రాగు నీటి కొరకు ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, అటువంటి గ్రామాలను గుర్తించి ట్యాంకర్ ల ద్వారా మంచినీటిని సరఫరా చేయవలసినదిగాను, అందుకు అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వ సంస్థలనుండి తెప్పిస్తానని హామీ ఇచ్చారు. మన జిల్లాలోని కోడూరు, నాగాయలంక, కృత్తివెన్ను, బంటుమిల్లి తదితర సముద్ర తీర ప్రాంతాలలో పంట పొలాలు సముద్రపు ఉప్పునీటి లవణియత వలన పంటలు పండటం లేదని, ఇక్కడి రైతుల ఆవేదనను అర్థం చేసుకొని, నాబార్డ్ ద్వారా క్లైమేట్ చేంజ్ ఫండ్ పథకం కింద ఈ ప్రాంతలకు శాస్త్రవేత్తలను పంపి పరిశోధనలు చేసి పరిష్కారం కనుగొనాలని కోరారు. వ్యవసాయ శాఖ వారిని కౌలు రైతులకు సి.సి.ఆర్.సి. కార్డులు అందజేయాలని, ఈ విషయంలో రెవిన్యూ శాఖ వారి సహకారం తీసుకోవాలన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా వారికి పంట రుణాలు అందించాలని సూచించారు. ఇరిగేషన్ శాఖ వారిని సమీక్ష చేసి వచ్చే వేసవి కాలంలోపే కాలవలో గుర్రపు డెక్కను తొలగించానికి అవసరమైన ప్రతిపాదనలు తయారుచేసి, ఖరిఫ్ సీజన్ కు ముందే గుర్రపు డెక్కను తొలగించి రైతులకు సాగు నీరు అందించాలని కోరారు. వైద్య శాఖపై సమిక్షిస్తూ పెడన నియోజక వర్గంలోని చిన గొల్లపాలెం,చిన పండ్రాక గ్రామాలలోని ఆరోగ్య కేంద్రాల ఆధునీకరణకు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే పంపాలని కోరారు. మొత్తం సుమారు 5 కోట్ల రూపాయలతో మరల ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సౌకర్యాలను మెరుగు పరచడం జరుగుతుందని తెలిపారు. గుడివాడ ఏరియా ఆసుపత్రినందు సౌర ఫలకల ఏర్పాటు గురించి అడిగి తెలుసుకున్నారు. రోడ్లు భవనాల శాఖను సమీక్ష చేస్తూ, జిల్లలో సేన్రస్ల రోడ్ ఫండ్ కింద జరుగుతున్న పనులను గురించి ఆరా తీసారు. ఎదురుమొండి బ్రిడ్జి నిమిత్తం అవసరమైన అదనపు 50 కోట్లకు ప్రతిపాదనలను నాబార్డ్ ద్వారా మంజూరు నిమిత్తం నివేదికలు తయారుచేయ వలసినదిగా కోరారు. అలాగే అవనిగడ్డ కోడూరు రోడ్డు, గుడివాడ - కంకిపాడు రోడ్ల పరిస్థిని అడిగి తెలుసుకున్నారు. నేషనల్ హై వే అధికారులతో మాట్లాడుతూ విజయవాడ బందర్ నేషనల్ హై వే 65 ను 4 వరసల నుండి 6 వరసల రహదారిగా మార్చు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. గన్నవరం ప్రాంతంలోని రైతులు పొలాలలో పండిన పంటను తెచ్చుకోవడానికి వీలుగా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలనీ సూచించారు.



## డీలిమిటేషన్‌పై ప్రధాని మోడీకి జగన్ లేఖ

**విజయవాడ మార్చి 22 ప్రభాతవార్త ప్రతినిధి:** డీలిమిటేషన్‌పై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లేఖ రాశారు. దక్షణాది రాష్ట్రాలకు సీట్ల సంఖ్యలో తగ్గింపు లేకుండా చూడాలని లేఖలో ప్రధానిని కోరారు. 2026 లో జరిగే డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాలలో ఆందోళన ఉంది. తమ రాష్ట్రాల్లో నియోజకవర్గాలు తగ్గుతాయనే చర్చ ఆందోళన కలిగిస్తోంది. గత 15 ఏళ్లలో దక్షిణాది రాష్ట్రాలలో జనాభా తగ్గింది. గతంలో కేంద్రం ఇచ్చిన జనాభా నియంత్రణ పిలుపు మేరకు తగ్గుదల కనిపించింది. ఇప్పుడు జనాభా లెక్కల ప్రకారం డిలిమినేషన్ చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు భాగస్వామ్యం తగ్గుతుంది. అందుకే జనాభా లెక్కల ప్రకారం ఈ డీలిమిటేషన్ లేకుండా చూడాలి అని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చెప్పుకొచ్చారు. అయితే పార్లమెంటులో తీసుకునేవిధాన నిర్ణయాలలో అన్ని రాష్ట్రాలకు సమాన భాగస్వామ్యం కల్పించేలా ఉండాలి అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. అందుకే దక్షిణాదిన సీట్ల తగ్గింపు లేకుండా చూడాలని చెప్పారు. ఇక, అప్పుడే జాతీయ విధాన రూపకల్పనలో అన్ని రాష్ట్రాలకు సరైన భాగస్వామ్యం ఉంటుంది అని తెలిపారు.

## జర్నలిస్టుల అక్రెడిటేషన్ నూతన విధానాన్ని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలి

### ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్

**విజయవాడ , మార్చ్ 22:** జర్నలిస్టుల అక్రెడిటేషన్ నూతన విధానాన్ని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. విజయవాడ గాంధీనగర్ లోని ప్రెస్ క్లబ్ లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు అధ్యక్షతన శనివారం జరిగింది. రాష్ట్రంలో జర్నలిస్టుల అక్రెడిటేషన్ మంజూరు విషయంలో జరుగుతున్న జాప్యంపై కార్యవర్గంలో చర్చ జరిగింది. పలు జిల్లాల ప్రతినిధులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నాలుగేళ్ల పాటు జర్నలిస్టులకు అక్రెడిటేషన్లు మంజూరు చేయలేదని, చివరికి అడ్డగోలు నిబంధనలతో జీవో జారీ చేసి , అర్హులైన సగం మందికి పైగా జర్నలిస్టులకు అక్రెడిటేషన్ నిరాకరించారని, జగన్ ప్రభుత్వం జారీ చేసిన జీవోని వెంటనే రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు. అర్హులందరికీ అక్రెడిటేషన్ మంజూరయ్యేలా నూతన విధానాన్ని రూపొందించాలని వారు కోరారు. వెంటనే నూతన అక్రెడిటేషన్ విధానాన్ని ప్రకటించాలని కోరుతూ ఏప్రిల్ 7 వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలని కార్యవర్గం జిల్లా శాఖలకు పిలుపు ఇచ్చింది. శాసనసభ సమావేశాల కవరేజీకి కొన్ని మీడియా సంస్థల ప్రతినిధులకు అవకాశం ఇవ్వకపోవడం సమంజసం కాదని , అన్ని సంస్థలకు అవకాశం కల్పించాలని సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడుకు ఎ.పి.యు.డబ్ల్యు.జే. రాష్ట్ర కార్యవర్గ సమావేశం విజ్ఞప్తి చేసింది. శాసనసభలో మీడియా సలహా కమిటీ కూడా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసి ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర మహాసభలు ఏప్రిల్ చివరివారంలో ఒంగోలులో నిర్వహించాలని రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది.



## భగవంతుని నామంతోనే మోక్షం

### - అహోబిలం మఠాధిపతి రంగనాధయతీంద్ర మహాదేశికన్

**తిరుమల,మార్చి 22ప్రభాతవార్తప్రతినిధి:** భగవంతుని నామాన్ని ఉచ్చరించడం, నిత్యం స్మరించడం, పఠించడంతోనే మోక్షం కలుగుతుందని అహోబిలం 46వ పీఠాధిపతి రంగనాధయతీంద్రమహాదేశికన్ తెలిపారు. శనివారం ఉదయం శిష్యులతో కలసి ఆలయం వద్దకు విచ్చేసిన స్వామికి టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ అర్చకులు పెద్దమర్యాదతో స్వాగతం పలికారు. ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీరవ్చనం చేశారు. టిటిడి ఇఒ శ్యామలరావు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి వెంట ఆలయ పేష్కార్ రామకృష్ణ ఉన్నారు.

## శ్రీవారి అనుగ్రహంతో శుభాలు కలగాలి: ప్రముఖులు



**తిరుమల,మార్చి 22ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంక టేశ్వక స్వామి ఆశీస్సులతో ప్రజ లందరికీ శుభాలు కలగాలని, ప్రజలు సంతోషంగా ఉండాలని ప్రముఖులు ఆకాంక్షించారు. శనివారం ఉదయం సినీ దర్శకుడు క్రిష్, అమరనాధ్ కేదార్‌నాథ్ ఆలయ అర్చకుడు అమర్‌నాధ్ నంబూద్రి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత కుటుంబంతో కలసి వేర్వేరుగా శ్రీవారిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ప్రభుత్వం శాశ్వతం, రాజకీయాలు ఎన్నికలకే పరిమితం

### జగన్ ఇప్పటికైనా తెలుసుకుంటే మేలు: మంత్రి లోకేష్

**విజయవాడ మార్చి 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వం, శాశ్వతం రాజకీయాలు ఎన్నికలకే పరిమితమని ఇప్పటికైనా జగన్ తెలుసుకోవాలని మంత్రి నారా లోకేశ్ హితవు పలికారు. ప్రభుత్వం మారినా అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగించడం సంప్రదాయమన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని గతంలో జగన్ విధ్వంస పాలనతో బ్రేక్ చేశారని విమర్శించారు. 2019లో జగన్ అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వ బకాయిలు చెల్లించనని మొండికేశారు. తెలుగుదేశంపార్టీ హయాంలో ప్రారంభమైన అభివృద్ధి పనులను నిలిపివేశారు. మరికొన్ని ధ్వంసం చేశారు. ఇలాంటి నిరంకుశ మనస్తత్వం ప్రజాస్వామ్యానికి ప్రమాదం. మేం అధికారంలోకి రాగానే జగన్ పెట్టిన బకాయిలు చెల్లించాం. ఆర్థిక ఇబ్బందులున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేశాం. విద్యార్థులు, తల్లిదండ్రులపై ఎటువంటి ఒత్తిడి లేకుండా చేయడమే బాధ్యతగా తీసుకున్నాం అని లోకేశ్ తెలిపారు.



## మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను పరామర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**విజయవాడ,మార్చి22,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరామర్శించారు. శనివారం సాయంత్రం హైదరాబాద్లోని జుబ్లీహిల్స్ లో ఫరూక్ నివాసానికి చంద్రబాబు వెళ్లారు. మంత్రి ఫరూక్ సతీమణి షెహనాజ్ మృతి పట్ల సంతాపం తెలుపారు. మనో ధైర్యంతో ఉండాలని కుటుంబ సభ్యులతో చంద్రబాబు పేర్కొన్నారు. దాదాపు గంట సమయం పాటు మంత్రి కుటుంబ సభ్యులతో సీఎం చంద్రబాబు మాట్లాడారు.మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, బీసీ జనార్దన్ రెడ్డి, ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, సీపీఐ నేత రామకృష్ణ, మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్ రెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి, భూమా అఖిలప్రియ, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, గిత్త జయసూర్య, పరిటాల సునీత, టిడిపి నాయకులు భార్గవ్ రామ్, తుగ్గలి నాగేంద్ర, తిక్కారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మాండ్ర శివానందరెడ్డి,పరిటాల శ్రీరామ్, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ పిపి నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ టిడి జనార్ధన్,వివిధ రాజకీయ పార్టీలకు చెందిన పలువురు నాయకులు మంత్రి ఫరూక్ ను పరామర్శించారు.

# దుర్గమ్మ ఆలయంలో 30 నుండి ఉగాది వేడుకలు



దాతలకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, మార్చి 22, ప్రభాత'వార్త' :** దుర్గమ్మ వారి ఆలయంలో ఈనెల 30 నుండి ఏప్రిల్ 7 వరకు వసంత నవరాత్రోత్సవాలు నిర్వహిస్తామని ఇఓ కె రామచంద్రమోహన్ శనివారం తెలిపారు. ఉగాది పర్వదినం మార్చి 30న ప్రారంభయ్యే ఈ ఉత్సవాల్లో దుర్గమ్మవారిని వర్ణమయ పుష్పాలతో ప్రత్యేక పుష్పార్చన నిర్వహిస్తామన్నారు. ఈనెల 30న ఉదయం 3 గంటలకు శ్రీ అమ్మవారికి ఉపాలయాలలోని దేవతామూర్తులకు స్నపనాభిషేకం, అలంకారం, అర్చన, నివేదన, హారతి నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఉగాది పర్వదినాన ఉదయం 9 గంటలకు శ్రీ అమ్మవారి దర్శనం ప్రారంభమవుతుందన్నారు. ఉగాది పర్వదినాన (ఒక్కరోజు మాత్రమే) శ్రీ అమ్మవారి ఆర్జిత సేవలు ఉదయం 9 గంటల నుండి జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు దేవస్థానం ఆస్థాన సిద్దాంతి బ్రహ్మశ్రీ చల్లా శ్రీనివాస శర్మ పంచాంగం శ్రవణం చేస్తారని, మధ్యాహ్నం 4 గంటలకు మండప పూజ, అగ్ని ప్రతిష్టాపన, రుద్ర హోమం (యాగశాలలో), సాయంత్రం 6 గంటలకు వెండి రథోత్సవం ( శ్రీ మల్లిఖార్జున మండపం నుండి ప్రారంభం) జరుగుతాయన్నారు. ఏప్రిల్ 5వ తేదీన చైత్రమాసం శుద్ధ అష్టమి రోజున ఉదయం 6 గంటలకు ఇంద్రకీలాద్రి స్థిత క్షేత్రపాలక హనుమకు, ఘాట్‌రోడ్డు నందు శ్రీ అభయాంజనేయ స్వామివార్లకు అభిషేకం, నాగవల్లీ దళార్చన (తమలపాకు అర్చన), ఏప్రిల్ 6న శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా ఉదయం 10 గంటలకు శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ 7న ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి, ఉదయం 10.30 గంటలకు శ్రీ రాముల వారి పట్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తామన్నారు. పుష్పార్చన టికెట్లు భక్తులు ఆన్‌లైన్లో, దేవస్థానం ఆర్జిత సేవా టికెట్ల కౌంటర్లో పొందవచ్చన్నారు. దుర్గమ్మ ఆలయం బంగారు గోపురం పనులకు ఏలూరు జిల్లా పూళ్ళ గ్రామానికి చెందిన ఎనికేపల్లి శ్రీనివాసరావు రు.1లక్ష 51,116ల విరాళాన్ని శనివారం ఆలయాధికారులకు అందించారు. వారికి దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన ఎన్ వేంకట నాగేశ్వరరావు రు.1లక్ష విరాళాన్ని శనివారం అందించారు. దాత కుటుంబసభ్యులకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి శేషవస్త్రం, మెమొంటో, ప్రసాదాలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

## డీలిమిటేషన్‌పై మా అభిప్రాయాలు మేం వెల్లడిస్తాం: డి.సిఎం పవన్

**విజయవాడ,మార్చి22,ప్రభాతవార్తప్రతినిధి:** చెన్నైలో డి.ఎం.కె పార్టీ నియోజకవర్గాల పునర్విభజనపై నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి జనసేన పార్టీకి ఆహ్వానం వచ్చింది. అయితే ఈ సమావేశానికి హాజరు కాలేమని సమాచారం అందించామని జనసేన పార్టీ వెల్లడించింది. ఈ మేరకు పార్టీ కార్యాలయం నుంచి అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. ఈ సమావేశానికి జనసేన హాజరైనట్లు వచ్చిన వార్తలు కేవలం ఊహాగానాలు మాత్రమే. ఈ సమావేశంలో పాల్గొనాలని డి.ఎం.కె తరపున ప్రతినిధులు వచ్చి ఆహ్వానం అందించారు. వేర్వేరు కూటములుగా ఉన్నందున ఈ సమావేశంలో పాల్గొనడం లేదని మర్యాదపూర్వకంగా తెలియ చేయాలని మా పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. ఆ మేరకు సమాచారం ఇచ్చాము. నియోజకవర్గాల పునర్విభజనపై వారి అభిప్రాయాలు వారికి ఉన్నట్లే ఈ అంశంపై మా విధానం మాకు ఉంది.

## ఆటో, మోటార్ బైక్ ఢీ : ముగ్గురు మృతి

**పొదలకూరు (నెల్లూరు), మార్చి 22, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా పొదలకూరు మనుబోలు రహదారిలో వడ్లపూడి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. పొదలకూరు నుంచి వడ్లపూడి కి ప్రయాణీకులతో వెళుతున్న ఆటో ఎదురుగా వస్తున్న మోటార్ బైక్ వడ్లపూడి చెరువు కట్ట వద్ద బలంగా ఢీ కొన్నాయి. మోటార్ బైక్ లో వస్తున్న ముగ్గురిలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. తీవ్రంగా గాయపడిన ఆటో డ్రైవర్ సురేందర్‌ను ఆరోగ్యకేంద్రానికి తరలిస్తుండగా మధ్యలోనే మృతి చెందాడు. మోటార్ బైక్ లో ప్రయాణిస్తూ మృతి చెందిన వారు నోసిన తరుణ్, అడుసుపల్లి నందకుమార్‌లుగా గుర్తించారు.

# తిరుమల సమాచారం

## ఉగాది ఆస్థానానికి 25న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



**తిరుమల,మార్చి 22ప్రభాత వార్తప్రతినిధి:** తెలుగు నూతన "విశ్వావసు నామ సంవ త్సర"ఉగాది ఆస్థానం ఆదివారం శాస్త్రోక్తంగా తిరుమల ఆలయంలో జరగనుంది. ఈ సందర్భంగా 30వ తేదీవిఐపి బ్రేక్ దర్శనాలు టిటిడి రద్దు చేసింది. అలాగే 29వతేదీ విఐపి బ్రేక్ దర్శనాలకు సంబంధించి సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. ఉగాది పర్వదినానికి ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం 25వతేదీ మంగళవారం ఉదయం నిర్వహిస్తున్నారు. ఉదయం 6గంటల నుండి 11గంటల వరకు పవిత్ర జలంతో శుద్ధిచేస్తారు. మంగళవారం విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు చేశారు. 24వతేదీ సోమవారం విఐపి బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించరు. ఆరోజు అష్టదళపాదపద్మారాధన సేవ కూడా రద్దు చేశారు. ఆదివారం తెల్లవారుజామున 3గంటలకు సుప్రభాతం అనంతరం ఆలయ శుద్ధి చేస్తారు. ఉదయం 6గంటలకు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామివారికి ,విశ్వక్సేనుల వారికి విశేష సమర్పణ జరుగుతుంది. ఉదయం 7గంటల నుండి 9గంటల వరకు విమానప్రాకారం,ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోనికి ప్రవేశిస్తారు. ఆ తరువాత వెంకన్న మూలవిరాట్టుకు ,ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపజేస్తారు. ఆ తరువాత పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఉగాది ఆస్థానాన్ని బంగారు వాకిలివద్ద ఆగమపండితులు, అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు.

## తాతయ్యగుంటగంగమ్మ ఆలయానికి రూ.14కోట్లు

### - నిధులు మంజూరుకు బోర్డులో చర్చించి నిర్ణయం

### - టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు



**తిరుమల,మార్చి 22 ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి చెల్లెలయిన తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ అభివృద్ధిపనులకు అవసరమైన 14కోట్ల రూపాయలు నిధులు మంజూరుచేయడానికి కృషి చేస్తామని, ఈ విషయంగా సోమవారం జరిగే బోర్డు సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. టిటిడి నిధులతోనే గంగమ్మ ఆలయాన్ని అభివృద్ధిచేస్తామని ఆయన హామీ ఇచ్చారు. తిరుపతి గంగమ్మజాతర బ్రహ్మాండంగా నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. టిటిడి ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత శనివారం ఉదయం తొలిసారిగా నాయుడు తాతయ్యగుంట గంగమ్మ ఆలయాన్ని సందర్శించారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, శాంతారాం, గంగమ్మగుడి మాజీ ఛైర్మన్, నగరపాలకసంస్థ డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ, టిటిడి సిఇ సత్యనారాయణ,బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ ఛైర్మన్‌కు స్వాగతం పలికారు.ఆలయ అర్చకులు ఆలయ సంప్రదాయంగా పూర్ణకుంభం స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. ఈసందర్భంగా బిఆర్‌నాయుడు మాట్లాడుతూ తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధిచేస్తామన్నారు.అమ్మవారి ఆలయానికి భక్తుల రాక పెరుగుతోందని, ఈ ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధిదిశగా తీసుకెళతామని అన్నారు. ఆలయంలో జరుగుతున్న పలు అభివృద్ధిపనులను ఆయన ఎమ్మెల్యేతో కలసి పరిశీలించారు. ఆలయ పునర్నిర్మాణపనుల్లో భాగంగా మొదటి విడతగా 3.75కోట్ల రూపాయలతో అభివృద్ధి జరుగుతుండటాన్ని పరిశీలించారు. ఇందులో ఆర్చి. ఎస్‌ఎస్ గ్రిల్స్, రాతిఫ్లోరింగ్ ,డ్రైనేజీతదితర పనులు పురోగతిని పరిశీలించి సూచనలు చేశారు. రెండవ విడత అభివృద్ధిలో 3.90కోట్లరూపాయలతో ప్రతిపాదనలు వచ్చాయని, ఇందులో ముఖమండపం, పోటు,తూర్పు,పశ్చిమ వైపు ప్రాకారాలు,మరుగుదొడ్ల పనులకు సంబంధించి బోర్డుసమావేశంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. మేనెల 6వతేదీ నుండి 13వరకు గంగమ్మజాతర వైభవంగా నిర్వహించేందుకు టిటిడి అన్ని విధాలా సహకారం అందిస్తుందని ఛైర్మన్ చెప్పారు.

## పరకామణిలో వందకోట్లు విదేశీకరెన్సీ చోరీపై విచారణ చేయాలి

### - బోర్డు సభ్యుడు భానుప్రకాశ్

**తిరుమల, మార్చి 22ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వర స్వామికి భక్తులు తమ కానుకలుగా మొక్కుల రూపంలో హుండీకి సమర్పించే కానుకల లెక్కింపుచేపట్టే పరకామణిలో విలువైన కరెన్సీని చోరీచేయడం వెనుక దర్యాప్తుచేయాలని టిటిడి బోర్డుసభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఓ ఉద్యోగి భారీ మొత్తంలో వందకోట్లనూపాయలకగాపై విదేశీ కరెన్సీని చోరీచేసి ఎక్కడ దాచాడనేది విచారణ చేయాలన్నారు. ఇప్పటికే విదేశీ కరెన్సీని దొంగతనం చేసి విజిలెన్స్‌కు పట్టుబడిన ఆయన పై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ చోరీలో ఎవరి పాత్ర ఉంది, ఎవరెవరికి భాగస్వామ్యం ఉందనేది తేల్చాలంటే ఖచ్చితంగా విచారణ చేయాలని డిమాండ్ చేశారు.గత ఐదేళ్ళలో పరకామణిలో కూడా కరెన్సీని నొక్కేసిన ఘనులు ఉన్నారన్నారు. అంతేగాక అన్ని విధాలా అతనికి సహకరించిన ఘరానా నిందితులు ఎవరనేది కూడా వెల్లడికావాల్సి ఉందన్నారు. స్వామివారి సొమ్ముతింటే దేవుడు ఊరికేవదలి పెట్టబోడన్నారు. అంతకుముందు ఆయన తిరుపతిలో గత వైసిపి ప్రభుత్వం మంజూరుచేసిన హోటళ్ళ స్థలాలను రద్దచేస్తూ,

వాటిని తిరిగి టిటిడి స్వాధీనం చేసుకునేలా చూడటంలో సిఎం చంద్రబాబు నాయుడు కృషి అమోఘవ న్నారు.

సిఎం ఒకేసారి కేటాయింపులు రద్దుచేయడాన్ని స్వాగతించావ న్నారు. ఇప్పుడు పరకామణిలో విదేశీ కరెన్సీ చోరీపై సమగ్రవిచారణ చేయాలని ,దానివెనుక ఉన్న అసలు సూత్రధారులు, పాత్రదారులను తేల్చాలని భాను డిమాండ్ చేశారు.

## ప్రపంచంలోనే ఇష్టమైన క్షేత్రం తిరుమల

### - టేబుల్‌టెన్నిస్ క్రీడాకారిణి నైనాజైస్వాల్



**తిరుమల,మార్చి 22ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచంలోనే తనకెంతో ఇష్టమైన ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమలఅని, కొండలెక్కి ఇక్కడకు రావడం, శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం జీవితంలో అనుభూతి కలిగిస్తుందని టేబుల్‌టెన్నిస్ క్రీడాకారిణికి నైనాజైస్వాల్ తెలిపారు. పుట్టినరోజు సందర్భంగా శనివారం తిరుమలకు వచ్చి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకోవడం సంతోషం కలిగించిందన్నారు. ఎవరైనా భక్తులు కష్టాల్లో ఉన్నపుడు మనస్ఫూర్తిగా మొక్కుకుని వేడుకుంటే ఆ కష్టం తొలగి పోతుం దని విశ్వాసం వ్య క్తం చేశారు. త్వరలో జరగబోయే క్రీడల్లో పాల్గొనేందుకు శిక్షణ తీసుకుం టున్నట్లు జైస్వాల్ తెలిపారు. శనివారం ఉదయం ఆమె విఐపి బ్రేక్ దర్శనంలో స్వామివారిని దర్శించుకున్నారు. వేదపం డితు లు వేదా శీర్వ చనం చేశాంు. ఆల య అధి కారులు స్వామివారి తీర్థప్రసా దాలు అంద జేశారు. స్వామివారి దర్శనం బాగా జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు.

బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కీలక కామెంట్లు చేసారు. అప్పులు చేయడమే తప్ప అప్పులు తీర్చడాన్ని మరిచిన గత ప్రభుత్వ తప్పుడు విధానాలను సరిచేస్తున్నామని వ్యాఖ్యానించారు. కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు జరపక పోవడంతో అభివృద్ధి పనులు చేయడానికి గతప్రభుత్వంలో ముందుకు రాలేదన్నారు. రెవెన్యూవ్యయం అంచనా రూ.2,51,162 కోట్లు, మూలధన వ్యయం అంచనా రూ. 40,635కోట్లు, రెవెన్యూ లోటురూ.33,185 కోట్లు, ద్రవ్యలోటు రూ.79,926 కోట్లు, వ్యవసాయ, అనుబంధరంగాలకు రూ.13,487 కోట్లు, పౌరసరఫరాల శాఖకు రూ.3,806 కోట్లు, ఎస్సీల సంక్షేమానికి రూ.20,281 కోట్లు, ఎస్టీల సంక్షేమానికి రూ.8,159 కోట్లు, బీసీల సంక్షేమానికి రూ.47,456 కోట్లు, అల్పసంఖ్యాక వర్గాల కోసం రూ.5,434 కోట్లు, మహిళా శిశుసంక్షేమం, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమం కోసం రూ.4,332కోట్లు, నైపుణ్యాభివృద్ధి శిక్షణశాఖకు రూ.1,228 కోట్లు, పాఠశాల విద్యాశాఖకు రూ.31,805 కోట్లు, ఉన్నత విద్యాశాఖకు రూ.2,506 కోట్లు, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమానికి రూ.19,264 కోట్లు, పంచాయతీరాజ్ శాఖకు రూ.18,847కోట్లు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ.13,862 కోట్లు, గృహనిర్మాణ శాఖకు రూ.6,318 కోట్లు, జలవనరుల శాఖకు రూ.18,019కోట్లు, పరిశ్రమలు, వాణిజ్య శాఖకు రూ.3,156 కోట్లు, ఇంధన శాఖకు రూ.13,600 కోట్లు, ఆర్‌అండ్‌బీకిరూ.8,785 కోట్లు, యువజన పర్యాటక, సాంస్కృతికశాఖకు రూ.469కోట్లు, గృహమంత్రిత్వశాఖకు రూ. 8,570కోట్లు, తెలుగు భాష అభివృద్ధికి రూ. 10కోట్లు, మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంకోసం నవోదయ 2.0 కార్యక్రమానికి రూ.10కోట్లు, అన్నదాత సుఖీభవకురూ.6,300 కోట్లు, పోలవరానికి రూ.6,705 కోట్లు, జల్‌జీవన్‌మిషన్ కోసం రూ.2800 కోట్లు, తల్లికివందనం కోసం రూ.9,407 కోట్లు కేటాయించారు.

# ప్రశాంతంగా సాగిన ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

విజయకుమార్ ఘంటా

ఏపీలో నూతనంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దగ్గర దగ్గరగా 16గా రోజుల పాటు జరిగిన ఆర్థిక ప్రణాళిక(బడ్జెట్) సమావేశాలు దాదాపు విపక్షం లేకుండా ప్రశాంతంగా జరిగిపోయాయి. ఎస్సీ వర్గీకరణఅమలు, బుడజంగాలను ఎస్సీల్లో చేర్చడం, చేనేత కార్మికులకువిద్యుత్తు చార్జీల్లో రాయితీ, ల్యాండ్ టైటింగ్ యాక్ట్, ద్రవ్యవినిమయ, ప్రైవేట్ విశ్వవిద్యాలయాల ఏర్పాటు యాక్ట్ సవరణతో సహా తొమ్మిది బిల్లులు ఈ సభలో ఆమోదించబడ్డాయి. పేరుకు అధికార పక్షమనే మాట తప్పించి, ప్రశ్నోత్తరాలు, జీరో అవరులోను విపక్షం లేదనే లోటును వారు తీర్చారు. చతుర సంభాషణ, సీరియస్ అంశాలు ఈ సమయాల్లో చోటు చేసుకున్నాయి. మంత్రులు జీరోఅవర్‌ను నిజంగానే శూన్య సమయంగా మారుస్తున్నారని సభ్యులు ఆక్షేపించిన పరిస్థితి. మొత్తమ్మీద సభలు సెలవుల్లో తప్పించి నిర్దేశిత షెడ్యూల్‌కు అనుగుణంగా జరిగాయి. సభా నిర్వాహణ అనుభవం గతంలో లేనప్పటికి స్పీకరు అయ్యన్నపాత్రుడు, ఉపసభాపతి రఘు రామకృష్ణంరాజు హుందా నిర్వహించారు. మంచి కమాండ్‌తో వారు సభలను ముందుకు నడిపారు. రఘురామ చతురోక్తు తలతో సభ నవ్వులుపూస్తాయి. ఆయన సీఎం చంద్రబాబు, డీప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను పొగడ్తలతో ముంచెత్తారు. అయ్యన్నపాత్రుడు ప్రతి అంశంలో మంత్రులకు మార్గదర్శనం చేసారు. గత నెల 24నుంచి ఈ నెల 20వ తేదీ వరకు నిరాటంకంగా జరిగిపోయాయి. అసెంబ్లీ సమావేశాలు తొలి రోజున ఉభయసభలను ఉద్దేశించి ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ కీలక ప్రసంగం చేసారు. ఈ ప్రసంగం ఆరంభంలో వైకాంగ్రెస్ పార్టీ 11మంది శాసనసభ్యులు మాజీ సీఎం జగన్ నేతృత్వంలో తమ పార్టీ ప్రతిపక్ష హోదా కల్పించాలంటూ స్పీకరు పోడియం వద్ద ఆందోళన చేసిన అనంతరం సభనుబాయికాట్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇక గవర్నర్ తన ప్రసంగంలో ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశానికే కాదు, ప్రపంచానికే ఒక అభివృద్ధి మార్గదర్శిగా నిలిచేలా చేద్దామంటూ పిలుపునుఇచ్చారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు అనేక సంక్షేమ పథకాలను పేదరికాన్ని నిర్మూలించాలన్నదే అంతిమ లక్ష్యంగా వెల్లడించారు. గతప్రభుత్వం నిలిపిన 93 కేంద్రపథకాల్లో 74 పథకాలు పునరుద్ధరించాం, రూ.9,371 కోట్ల అప్పులు తీర్చామన్నారు. నీటిపారుదల, రోడ్ల సంబంధిత రూ.10,125 కోట్ల బిల్లులు క్లియర్ చేసామని తెలిపారు. ఎవరైనా ఒక మనిషికి ఒక చేపను ఇస్తే, అది అతనికి ఒకరోజు తిండి పెట్టినట్లవుతుంది. అదే మనిషికి చేపలు పట్టడం నేర్పితే, జీవితాంతం తిండి పెట్టినట్లవుతుందనే తమ ప్రభుత్వ విధానమని తెలిపారు. మన తలసరి ఆదాయం కూడా గత సంవత్సరంలోని రూ.2.37 లక్షల నుంచి రూ.2.68 లక్షలకు పెరిగింది. 2047 నాటికి స్వర్ణాంధ్ర కలను సాకారం చేస్తామని వెల్లడించారు. విద్య,



వైద్యం, మౌలికవసతులపై ప్రత్యేక దృష్టి సారించామన్న గవర్నర్, బీసీవర్గాలు సమాజానికి వెన్నెముక అని వారికోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్లు కేటాయించినట్లు గుర్తు చేశారు. తలసరి ఆదాయంకూడా రూ.2.68 లక్షలకు పెరిగిందని, వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగాలు వృద్ధి చెందాయని అన్నారు. ఈ సందర్భంగా సంఘ సంస్కర్త కందుకూరి వ్యాఖ్యలను గవర్నర్ ప్రస్తావించారు. ప్రతి వ్యక్తిలో ప్రతిభ ఉంటుందని, అవకాశమిస్తే బయటకు వస్తుందని చెప్పారు. తమ ప్రభుత్వం స్వర్ణాంధ్ర2047 దిశగా వెళ్తోందని, సమాజ అభివృద్ధికి సంక్షేమం, అభివృద్ధి కలిసికట్టుగా వెళ్లాలని సూచించారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉండాలనేదే తమ విధానమని స్పష్టంచేశారు. ప్రస్తుతం ఏపీ మరో విప్లవానికి నాయకత్వం వహిస్తోందని, పరిపాలన, పరిశ్రమలు, ఆర్థిక వృద్ధిలో ఏఐను వినియోగిస్తున్నామని చెప్పారు. రూ.2,488 కోట్ల ఆర్థికసంఘం గ్రాంట్‌తో స్థానిక పాలన బలోపేతం చేశామని గవర్నర్ నజీర్ తెలిపారు. పోలవరం, అమరావతి ప్రాజెక్టులను మళ్లీ పట్టాలెక్కించామని, విశాఖ ఉక్కు పరిరక్షణ, రైల్వేజోన్ ఏర్పాటు హామీలు నెరవేర్చామని గుర్తు చేశారు. సుస్థిర వృద్ధికి దోహదపడే 22 కొత్త విధానాల ద్వారా బలమైన పునాదివేశామన్న గవర్నర్, గూగుల్, ఆర్సెలర్ మిట్టల్, టాటాపవర్ కంపెనీలను ఆకర్షించినట్లు తెలిపారు. గ్రీన్‌కో గ్రూప్, బీపీసీఎల్, టీసీఎస్ కంపెనీలను ఆకర్షించామని, ఇన్వెస్టర్లు ఇప్పటివరకు రూ.6.5 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు వెల్లడించారు. ఆయా పెట్టుబడుల ద్వారా4లక్షల మందికి ఉపాధి అవకాశాలు పెరిగాయని, రాష్ట్ర ఆర్థికవ్యవస్థ రూ.16 లక్షల కోట్లకు విస్తరించిందని అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపైమూడు రోజుల పాటు చర్చ జరిగింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, వ్యవసాయశాఖామంత్రి అచ్చెన్నాయుడు, మానవ వనరుల శాఖమంత్రి నారా లోకేష్, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రులు సవిత, అనిత, గుమ్మిడి సంధ్యారాణి ఎంఎల్‌ఏలు కూన రవికుమార్, జ్యోతుల నెహ్రూ, బండారు శ్రావణిశ్రీ, గౌతు శిరిష, పరిటాల సునీత, తంగిరాల సౌమ్యలు పాల్గొన్నారు. రాష్ట్రం ఆరోగ్యవంతమైన, సుసంపన్నమైన, సంతోషకరమైన సమాజ నిర్మాణ దిశగా ఒక నూతన శకానికి నాందిపలికే దిశలో రాష్ట్రబడ్జెట్‌ను రూపొందించామని ఆర్థికశాఖమంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టంచేసారు. మా విజన్ 'స్వర్ణాంధ్ర-27గా రాష్ట్రాభివృద్ధి సాగుతుందన్నారు. ఇది కష్టతరమైనప్పటికి, సాధ్యమేనని గత ఏడాది నుంచి సీఎం చంద్రబాబు నేతృత్వంలో సాగుతున్న కార్యచరణే నిదర్శనమన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 3,22,359 కోట్లతో వ్యయ ప్రతిపాదనలో రూపొందించామన్నారు. ఇంఏపీ అసెంబ్లీలో 2025-26 వార్షిక బడ్జెట్‌ను ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారు. నిర్ణయించిన ముహుర్తం ప్రకారం ఉదయం 10.08 గంటలకు బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభిస్తూ 2025-26ఆర్థికసంవత్సరానికి రూ.3,22,359 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టారు. తద్వారా తొలిసారి రాష్ట్ర బడ్జెట్ రూ. 3లక్షలు కోట్లు దాటింది. సూపర్ సిక్స్, మేనిఫెస్టో హామీలకు, అభివృద్ధి పనులకు ఎక్కువ కేటాయింపులు జరపాల్సి రావడంతో బడ్జెట్ రూ.3లక్షల కోట్లు దాటింది. ఎన్నికలహామీల అమలుకు తాము కట్టుబడి ఉన్నామని ఏపీ ప్రభుత్వం తాజా బడ్జెట్ ద్వారా స్పష్టంగా చెప్పింది. సూపర్ సిక్స్, మేనిఫెస్టో హామీలు, అభివృద్ధిపనులకు ఎక్కువ కేటాయింపులు జరపడంతో 2025-26 ఏపీబడ్జెట్ తొలిసారిగా రూ.3లక్షల మార్కును దాటింది. నేడుసభలో బడ్జెట్‌ప్రవేశపెట్టిన ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ కీలకప్రకటన చేశారు. గతేడాది రూ.2.94. లక్షల కోట్లతో వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టగా ఈసారి బడ్జెట్ రూ.3లక్షల 22వేల 359 కోట్లకు చేరింది. వ్యవసాయరంగానికి భారీగా కేటాయింపులు పెరిగాయి. అన్నదాతలకోసం కూటమి ప్రభుత్వం ఈసారి రూ.48,340కోట్లను కేటాయించింది. గతేడాది బడ్జెట్ రూ. 43,402. 33కాగా ఈసారి కేటాయింపులు భారీస్థాయిలు పెరిగాయి. మూలధనం అంచనావ్యయం రూ.40,635 కోట్లు గతంలో ఇది రూ. 32,712 కోట్లుగాఉంది. ఈసారిద్రవ్యలోటు రూ.79,926 కోట్లు ఉండొచ్చని అంచాన వేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. నిర్ణయించిన ముహుర్తం ప్రకారం 10.08 గంటలకు మంత్రి బడ్జెట్ ప్రసంగంమొదలు పెట్టారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి 322359 కోట్లతో ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రవేశపెట్టారు. రాష్ట్రబడ్జెట్ తొలిసారి 3 లక్షలు కోట్లు దాటింది. రెవెన్యూ వ్యయం 251162 కోట్లు కాగా రెవెన్యూ లోటు 33185 కోట్లు ఉంది. ద్రవ్యలోటు 79926 కోట్లు ఉంది. మూలధన వ్యయం 40635 కోట్లు గా ఉంది. ఈ సమావేశాల్లో స్పీకరు అయ్యన్న పాత్రుడు సభా ప్రాంగణానికి వచ్చిన వైకాంగ్రెస్ పార్టీ సభ్యులు ఐప్యాడ్‌లు తీసుకుని వెళ్ళిపోవడంపై ఆశ్యర్యం వ్యక్తం చేసారు. మండలిలో విపక్షం, అధికార పక్షం మధ్య వాగ్వాదాలు చోటు చేసుకున్నా సమన్వయంతో వ్యవహరించారు. సభలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం అమలు చేస్తున్న 10 సూత్రాలు, పీ-4 పథకం, సంపద సృష్టికి తీసుకుంటున్న చర్యలను ఆయా సందర్భాల్లో సీఎం చంద్రబాబు వివరించారు. ●

# 'సమాధి' సమరం!

మహారాష్ట్ర

ఎ.వి.వి ప్రసాద్

చినుకులే కదా అని వదిలేస్తే గాలివానగా మారి కలవర పెట్టవచ్చు. ఇంకా ముదిరి పెను తుఫానుగా మారితే బీభత్సాన్ని సృష్టించవచ్చు. నాగ్‌పూర్‌లో కనిపిస్తున్న దృశ్యం అటువంటిదే. పాఠ్యపుస్తకాలలోనో, ఏ చారిత్రక సినిమాలలోనో కనిపించే ఔరంగజేబును, సమాధిలో దీర్ఘనిద్రలో ఉన్న ఔరంగజేబును లేపి వార్తల్లోకి తెచ్చి వివాదాలను సృష్టిస్తున్న వారిని ఏమనాలి! ఎల్లోరా గుహలకు చేరువలోనే ఉన్నాపర్యాటకులు సైతం అంతగా పట్టించుకోని ఔరంగజేబును మతకలహాలకు దారి తీయడానికి పనికి వచ్చే ఉపకరణంగా కొందరు భావిస్తున్నారంటే వారిని ఏమనాలి? వివాదం చినుకులుగానే మొదలై గాలివానను దాటుతోంది. నాగ్‌పూర్‌కు మాత్రమే పరిమితం కాకుండా నలువైపులకూ 'టెంటకిల్స్' ను కదుపుతోంది. ఉన్న సమస్యలతోనే సతమతమవుతున్న సాధారణ ప్రజలకు ఈ అనవసర వివాదం తలకెత్తుకోవలసి రావడం అవసరమా? హింసాకాండ శ్రుతిమించడంతో గతవారం మూడు, నాలుగు రోజులు నాగ్‌పూర్‌లో కర్ఫ్యూ కూడా విధించారు. డజను మందినిపైగా అరెస్టు చేశారు. కొందరిపై దేశద్రోహ నేరం మోపి జైళ్లలోకి తోశారు. హింసాత్మక ఘర్షణల్లో చాలా ఆస్తినష్టమే సంభవించింది. ఈమొత్తం ఉదంతంలో నలిగిపోయింది సాధారణ ప్రజలే. వివిధపార్టీల నేతలు వినోదం తిలకిస్తున్నారు. కొందరైతే 'తమవంతు'గా ఆజ్యంపోస్తున్నారు. 17వ శతాబ్ది పాలకుని గురించి 21వ శతాబ్దంలో తలలు పగుల గొట్టుకోవడం అవసరమా? అనిమాత్రం ఎవరూ ఆలోచించకపోవడమే ఆశ్చర్యంకలిగించేవిషయం. ఛత్రపతి శివాజీ, ఆయన కుమారుడు శంభాజీ మొఘల్ పాలకులతో ఎలా పోరాడారో, అనితర సాధ్యమైన సాహసంతో శివాజీ, శంభాజీలుఎన్ని యుద్ధాలు చేశారో చరిత్రలో చదువుకున్నాం. తాజాగా ప్రదర్శితమవుతున్న ఓ హిందీ సినిమాలోని కొన్ని దృశ్యాలు ఓవర్గం మనోభావాలనుగాయపరిచాయనీ, అందువల్ల ఆ సినిమాను బ్యాన్ చేయాలనే డిమాండ్ కూడా కొందరుచేస్తున్నారు. మొఘల్ చక్రవర్తి అయిన ఔరంగజేబు సమాధిని కూల్చేస్తామంటూ ఓ వర్గం ప్రకటనలు గుప్పించడంతో మొదలైన చినుకులు ఒకటి రెండు రోజుల్లోనే కర్ఫ్యూ గాలివాన దాకా వచ్చాయి. ఆలస్యమెందుకని రాజకీయ నేతలు తలదూర్చడంతో అదే ఇప్పుడు పెనుతుఫానుగా కూడా మారుతోంది. గత సోమవారం (17, మార్చి)సెంట్రల్ నాగ్‌పూర్‌లో కొందరు వ్యక్తులు ఒక మత గ్రంథాన్ని దగ్ధంచేశారనే పుకార్లు వ్యాపించడంతో ఆ ప్రాంతమంతా తొలుత తీవ్ర ఉద్రిక్తతతోనిండిపోయింది. పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.



హింసాకాండ

అదే అదనుగా అల్లరి మూకలు వీరవిహారం చేశాయి. నాగ్‌పూర్‌లోని మహల్ ప్రాంతంలో ఉన్న ఛత్రపతి శివాజీ విగ్రహం కేంద్రంగా ఆందోళనలు చెలరేగాయని పోలీసులు ఆరోపించడంతో వారిని టార్గెట్ చేస్తూ పలు చోట్ల దాడులు జరిగాయి. 24 గంటలు గడిచేలోగా అల్లర్లు మహారాష్ట్రలోని మరికొన్ని ప్రాంతాలకు కూడా విస్తరించాయి. కర్ఫ్యూ సమయంలో పోలీసులు కఠినచర్యలు తీసుకొనడంతో ఆందోళనల తీవ్రత కొంత తగ్గినట్లు కనిపించినా శుక్రవారం దాకా చిచ్చురగులు తూనే ఉంది. ఔరంగాబాద్ జిల్లా ఖుర్దాబాద్‌లోని ఔరంగజేబు సమాధి నమూనా తయారు చేయించి దానిని నాగ్‌పూర్‌లోని మహల్ సెంటర్ వద్ద దగ్ధం చేయడానికి ప్రయత్నించారనీ, దానితో మరోవర్గం కూడా రెచ్చిపోయి హింసాకాండకు పాల్పడిందనీ పోలీసులు అంటున్నారు. ఔరంగజేబు మంచిపాలకుడు, ఆ సినిమాలోని కొన్ని అంశాలు తప్పుగా చిత్రీకరించారంటూ సమాజ్‌వాది పార్టీ ఎమ్మెల్యే అబూఅజ్మీ పొగడడంకూడా ఈ వివాదానికి గాలికొట్టిందనిపిస్తుంది. ఆయన్ని మహారాష్ట్ర అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారు కూడా. వివాదం ముదరడానికి అది కూడా కొంత కారణం. చరిత్ర పుస్తకాలలో లిఖించిన ప్రకారం ఔరంగజేబు తన సమాధిని బతికి ఉండగానే నిర్మించుకొన్నారనీ, దానికైన ఖర్చును టోపీలు కుట్టి సంపాదించాడనీ అంటారు. ఆయన అనేక దేవాలయాలు నిర్మించినట్లుగా కూడా చెబుతారు. అయితే ఆ విషయాలను అలాఉంచి, ఇన్ని శతాబ్దాల తర్వాత ఆ సమాధిని వివాదాస్పదం చేయడం ఎంతవరకు సబబు? అన్నది ముఖ్యంగా రాజకీయ నాయకులు ఆలోచించవలసి ఉంది. నిజానికి 2015నుంచే ఇది ఒక వివాదంగా మారినా హింసాకాండ పరిస్థితులు ఏర్పడలేదు. ఇప్పుడు కూడా అవసరం లేకపోయినా, కొందరు కావాలనే ఉద్రిక్తతలు సృష్టిస్తున్నట్లుగా కనిపిస్తోందని పరిశీలకులు భావిస్తున్నారు. శివసేన, మహారాష్ట్ర నవనిర్మాణ సేనపార్టీలు ఔరంగజేబుసమాధిని ఎవరూ సందర్శించకుండా కంతకాలంకట్టడి చేశాయి. రెండు సంవత్సరాల క్రితం ఒకసారి అహ్మద్‌నగర్‌లో జరిగిన ఒక ఊరేగింపు సందర్భంగా ఔరంగజేబు పోస్టర్లు వెలిశాయి. అప్పుడు కూడా చెప్పుకోదగినంత ఘర్షణలేమీ జరగలేదు. కానీ తాజాగా వచ్చిన హిందీ సినిమా తర్వాత ఊహించని విధంగా ఘర్షణలు చెలరేగి తీవ్ర ఉద్రిక్త పరిస్థితులేర్పడ్డాయి. సినిమా అనగానే ఎన్నోరకాల కల్పనలతో చారిత్రక అంశాలు కూడా కొత్త రంగులు అద్దు కుంటాయి. వాటిని అలాగే చూడాలి. నచ్చుకుంటే పట్టించుకోవడంవదిలేయాలి తప్ప పెనుతుఫానులు సృష్టించడానికి ప్రయత్నిస్తే అదికచ్చితంగా సామాజిక నేరమేఅవుతుంది. మహారాష్ట్ర డిప్యూటీ సిఎం షిండేచేసిన కొన్ని వ్యాఖ్యలు కూడా సామాజిక మాధ్యమాల్లో ఇప్పుడు చక్కర్లు కొడుతున్నాయి. లాడెన్‌ను అమెరికా తన నేలమీద ఖననం చేయకుండా ఎలా సముద్రంలోకి విసిరేసిందో, ఔరంగజేబు సమాధిని మాత్రం మనం ఎందుకు కొనసాగించాలంటూ ఆయనచేసిన వాదం ఒకవర్గం యువతపై బాగా పనిచేస్తున్నట్లు కనిపిస్తోంది. డిప్యూటీ ముఖ్యమంత్రే ఉద్రిక్తతలను రెచ్చగొడితే ఇకఎవరు పరిష్కరిస్తారు? ఈవివాదం మరింత ముదరకుండా ఫుల్‌స్టాప్ వేయడం ఒకటేఉత్తమం. ఆ బాధ్యత రాజకీయ నాయకులదే. ●

# మిస్టరీగానే మిగిలిన మర్డర్!

అమెరికా

గన్ని మోహన్


అమెరికాలో అత్యంత పిన్న వయసులోనే అధ్యక్షుడుగా ఎన్నికైన జాన్ ఎఫ్ కెన్నడీ హత్యకు సంబంధించిన రహస్యపత్రాలను బహిర్గతం చేసిన ఆదేశ ఆర్కియాలజీ విభాగం అప్‌లోడ్ చేసిన దస్త్రాల్లో కొత్త అంశం ఏమీ కనిపించకపోయినా ఈపిన్నవయసు 35వ అధ్యక్షుడు జాన్ ఎఫ్‌కెన్నడీ హత్యలో అమెరికా నిఘా సంస్థ సిఐఎ హస్తం ఉందన్న అనుమానాలను రేకెత్తించింది. అమెరికాకు 35వ అధ్యక్షుడుగా 1961లో ఆయన ఎన్నికయ్యారు. 43వ ఏటా మొట్టమొదటి రోమన్ కేథలిక్కు అమెరికా అధ్యక్షుడైన ఘనత జాన్ ఫిట్జ్‌గెరాల్డ్ కెన్నడీకే దక్కుతుంది. ఆయన పేరిట ఇప్పుడు అంతర్జాతీయ విమానాశ్రయం కూడా ఉంది. అయితే 1963 నవంబరు 22వ తేదీ డల్లాస్, టెక్సాస్ నగరాల సందర్శన సమయంలో కెన్నడీని హత్యచేసారు. ఈకేసుకు సంబంధించి నియమించిన వారెన్ కమిషన్ లీ హార్వే ఓస్వాల్డ్ అనే వ్యక్తిని అరెస్టుచేసారు. అతడు ఒక్కడే హంతకుడని సిఐఎ కూడా నిర్ధారించింది. అయితే ఈ హత్యకు ముందునుంచే కొంతకాలంపాటుఓస్వాల్డ్ కదలికలపై నిఘా ఉంచిన సిఐఎ కెన్నడీ ప్రాణాలకు ముప్పు ఉందన్న ముందస్తు హెచ్చరికలు చేయకపోవడం కూడా ఈ హత్యలో సిఐఎహస్తం ఉండి ఉందన్న అనుమానాలకు మరింత బలం చేకూర్చింది. మొత్తం 63వేల పేజీల కీలక సమాచారాన్ని అమెరికా నేషనల్ ఆర్కీవ్స్ అండ్‌రికార్డ్స్ అడ్మినిస్ట్రేషన్ తమ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్‌చేసింది. వీటన్నింటినీ కూలంకషంగా పరిశీలన చేసిన వేలాదిమంది అధ్యయనకారులు ఇందులో కొత్త అంశం ఏమీలేదని పెదవి విరిచారు. డల్లాస్‌లో కెన్నడీ భార్య జాక్వెలిన్‌తో కలిసి కారులోవెళుతూ రోడ్లకిరువైపులా ఉన్న వేలాదిమంది మద్దతుదారులకు అభివాదం చేస్తున్న వేళ కాల్పులమోత మోగింది. కెన్నడీ బుల్లెట్ గాయాలతో ప్రాణాలు కోల్పోయారు. అక్కడికి సమీపంలోనే ఉన్న టెక్సాస్ స్కూల్‌బుక్ డిపాజిటరీ భవనం ఆరో అంతస్తులో తుపాకీతో ఉన్నఓస్వాల్డ్‌ను అరెస్టుచేసారు. అయితే హంతకుడిని పట్టుకున్నామని నిర్ధారించేలోపే అతడిని చంపేసారు. ఒకనైట్‌క్లబ్ యజమాని జాక్‌రూబీ ఓస్వాల్డ్‌ను జైలుకు తరలిస్తున్న సమయంలో కాల్చి చంపేసాడు. జాక్‌రూబీ కూడా అరెస్టు అయి జైలులో ఉన్నపుడే ఊపిరితిత్తుల ధమనుల్లో రక్తం గడ్డకట్టిచనిపోయాడు. ఇప్పటికీ కెన్నడీ హత్యతోపాటు వీరిద్దరి మరణాలు కూడా మిస్టరీగానే మిగిలిపోయాయి. వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన పత్రాల్లో ఎలాంటి సవరణలు, దిద్దుబాటు చేయవద్దని కూడా ట్రంప్ హెచ్చరించడంతో అవేమీ బయటపడలేదు. సిఐఎలోని కొందరు ఏజెంట్లు కెన్నడీ అంటే గిట్టనివారున్నారని, వారి ఆధ్వర్యంలోనే ఈ హత్యోదంతంనడిచిందన్న వార్తలు వెల్లువలా వచ్చాయి. ఆనాటి బద్ధశత్రువులు సోవియట్ రష్యా, క్యూబా వంటి దేశాలు అమెరికా అధ్యక్షుడిని అంతమొందించేందుకు యత్నించాయి. ఆ పనిలో ఇప్పుడు సఫలీకృతం అయ్యాయన్న వాదనలు కూడా కెనడీ హత్యకు లింకు అయ్యాయి.



జాన్ ఎఫ్ కెన్నడీ

జెఎఫ్కేపై కాల్పులు జరిపిన ఓస్వాల్డ్ అంతకుముందు రష్యా పౌరసత్వం కోసం ప్రయత్నించాడని, తరచూ రష్యాకు, క్యూబాకు వెళ్లివచ్చేవాడని అందువల్లనే ఓస్వాల్డ్ ఈ హత్యచేసినట్లు నిర్ధారణకు రావాల్సి వస్తోందని, ఈ రహస్యపత్రాల్లో సమాచారం ఉంది. అయితే కెనడీ హత్య తర్వాత వీరిద్దరి హత్యలు మిస్టరీగా మారిపోయాయి. భవనం నుంచి కాదని, పక్కనే ఉన్న పచ్చిక బయళ్లనుంచి కాల్పులువచ్చాయన్న వాదనపై తర్వాత అధ్యక్షుడు లైడెన్‌బీ జాన్సన్ ఏర్పాటుచేసిన వారెన్ కమిషన్ నివేదికపైనా అనుమానాలు రేకెత్తాయి. సిఐఎలోని ఒకవర్గానికి కెన్నడీ అధ్యక్షుడుగా కొనసాగడం ఇష్టంలేదని అందుకే వాళ్లు శతృదేశాలతో చేతులు కలిపారన్న వాదన తెరపైకి వచ్చింది. అమెరికా విదేశాంగవిధానంలో సిఐఎ ఒత్తిడి పెరుగుతోందని ఆనాడు కెన్నడీ సహాయకుడు ఆర్థర్ ష్లెసింగర్ రాసిన నోట్‌కూడా ఈ పత్రాల్లో కనిపించింది. ఫ్రాన్స్ వంటి మిత్రదేశాల్లోని యుఎస్ రాయబార కార్యాలయాల్లో సిఐఎ ఉనికి పెరిగిందని ఈపత్రాలు చెపుతున్నాయి. సిఐఎ ప్రభావంపైనే కెన్నెడీని ష్లెసింగర్ హెచ్చరించినట్లు కూడా ఉంది. అయితే ఈపత్రాల్లో ఎక్కడా ప్రత్యక్ష సాక్షుల సమాచారం లేదు. అదృశ్య శక్తుల సమాచారం మేరకు రూపొందించినట్లుగానే నిరాధార వార్తలు చక్కర్లుకొట్టాయి. అనేక కేసుల్లో సిఐఏ ఏజెంట్ల పేర్లు చిరునామాలు కనిపించకుండా నల్లరంగు పూసిన పత్రాలు బయటపడేవి. కానీ కెన్నెడీ హత్యకేసుకు సంబంధించి సిఐఎహస్తం ఉందన్న మీమాంస మాత్రమే ఉందికానీ నిర్ధారించే పత్రాలు ఏవీలేకుండా ఆ సంస్థ జాగ్రత్తపడిందని, అందుకే హంతకుడు ఓస్వాల్డ్, అతడినికాల్చి చంపిన జాక్‌రూబీ హత్యలు కానీ కెన్నడీ హత్యకు సంబంధించిన పథకరచన మొత్తం వెల్లడికాకుండా తీసుకున్న జాగ్రత్తలే అనిచెప్పాలి. విదేశాల రహస్యాలన్నింటినీ అమెరికా అధ్యక్షుడికి చేరవేయాల్సిన సిఐఎ తన వృత్తి ధర్మానికి విరుద్ధంగా అధ్యక్షుడు పర్యటన వివరాలు అమెరికా శత్రుదేశాలకు కూడా చేరవేసిందని పలు రహస్యపత్రాల్లో నిరూపితమైంది. అందువల్లనే ఓస్వాల్డ్ రష్యా పౌరసత్వంకోసం ప్రయత్నించడం, తరచూ ఆదేశానికి వెళ్లడం వంటివి వెలుగులోకి వచ్చాయి. అలాగే కెనడీ హత్య, ఆపై నిందితుల హత్యలు జరిగిన వెంటనే సిఐఎ ఏజెంట్ గ్యారీ ఆండర్‌హిల్ వాషింగ్టన్ నుంచి పారిపోయి న్యూజెర్సీలోని స్నేహితుడి ఇంట్లో దాక్కున్నాడు. అతడి మాటల్లోనే సిఐఎలోని ఉన్నతస్థాయి ఒక వర్గానికి కెన్నడీ అంటే అసలు గిట్టదని, వాళ్లే కెన్నడీని అంతం చేసారని వారు చిక్కకుండా ఉండేందుకు ఓస్వాల్డ్‌ను హంతకుడుగా చూపించారని చెప్పినట్లు సమాచారం. అయితే కొద్దినెలల తర్వాత గ్యారీ అండర్‌హిల్‌కూడా చనిపోవడం ఈ రహస్యాల గుట్టు ఇప్పటికీ వీడలేదు. ఏది ఎలా ఉన్నా ఎన్నివేల పత్రాలను విడుదల చేసినా ఆనాటి కెన్నడీ హత్యకేసు మిస్టరీ ఛేదించడం అనేది ఇప్పటికీ ఒక అంతుబట్టని నిజంగానే మిగిలిపోయింది. ●

# పరివర్తన దిశగా భారత్ ఆర్థిక వ్యవస్థ



సుంకవల్లి సత్తిరాజు

జనాభా సంఖ్య తక్కువగా ఉండి, సారవంతమైన భూములతో అధిక పంటలు పండే అనుకూలమైన భూభాగం కలిగి, సహజవనరులు సమృద్ధిగా లభించే దేశాలన్నీ ఆర్థికంగా అభివృద్ధి చెందగలవు. యువతకు కూడా అభివృద్ధిలో కీలక భాగస్వామ్యముంది. ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యతో యువత విరాజిల్లాలి. విద్యతోపాటు శ్రమించే గుణం, దేశభక్తి యువతరంలో మెండుగా ఉంటే అలాంటి దేశాలన్నీ అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోగలవు. కేవలం స్వల్ప కాలంలోనే ఏ దేశమూ ఆర్థికంగా బలోపేతం కాజాలదు. ప్రభుత్వం, ప్రజలు ఆకుంఠిత దీక్షతో, కృషిచేస్తూ అందుబాటులో ఉన్న వనరులను సక్రమంగా వినియోగించుకుంటూ, విదేశాలతో చక్కని దౌత్య, వాణిజ్య సంబంధాలను నెలకొల్పుకుని, చాకచక్యంగా ప్రపంచ వాణిజ్య వాతావరణాన్ని అనుకూలంగా మలచుకుంటే అభివృద్ధిశరవేగంతో ముందుకు సాగుతుంది. అభివృద్ధి అంటే కేవలం జిడిపివృద్ధి రేటు పెరగడం మాత్రమేకాదు. ఆర్థిక అంతరాలను కనీస స్థాయికి తగ్గించి, ప్రజల వాస్తవిక తలసరి ఆదాయం పెంచాలి. విద్య, వైద్య సదుపాయాలు ప్రజలకు ఉచితంగా అందించాలి. ఉచిత పథకాలకు బదులుగా దేశ ప్రజలందరికీ నిత్యావసర వస్తువులు సరసమైన ధరలకు లభించేలా చేయాలి. ప్రజలు జీవించడానికి తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలి. బాలలకు తగిన పోషకాహారం అందించాలి. కార్పోరేట్ స్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం లభించాలి. విద్యావ్యవస్థలో నాణ్యమైన అంతర్జాతీయ ప్రమాణాలు ప్రవేశపెట్టాలి. ప్రజలందరికీ పరిశుభ్రమైన త్రాగునీరు లభించాలి. అర్బనైజేషన్ విధానాలకు స్వస్తి చెప్పి గ్రామీణ ప్రాంతాల్లోనే మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలి. యువతను మద్యం, డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉంచాలి. యువత సంఖ్య తగ్గకుండా చర్యలు తీసుకోవాలి. బాలబాలికలంతా పాఠశాలలకు వెళ్లేవాతావరణం కల్పించాలి. భారత దేశంలో సహజ వనరులకు, యువతకు, శ్రమశక్తికి కొదవలేదు. ఇలాంటి అనుకూలమైన పరిస్థితులను వినియోగించుకుని భారతదేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేయాలి. ప్రపంచంలో అమెరికా, చైనా, జపాన్, జర్మనీ ఇండియా, యు.కె, ఫ్రాన్స్, రష్యా, కెనడా, ఇటలీ, బ్రెజిల్ లాంటి దేశాలు బలమైన ఆర్థిక వ్యవస్థలను కలిగి ఉన్నాయి. వీటి జిడిపి మిగిలిన దేశాలతో పోల్చిచూస్తే అధికం. జిడిపిని అభివృద్ధికి కొలమానంగా అర్థశాస్త్రం పేర్కొంటున్న కారణంగా అధిక జిడిపి గల దేశాలను అభివృద్ధి చెందిన దేశాలుగా పేర్కొంటున్నాం. పైన పేర్కొన్న దేశాలన్నీ ఆర్థికంగా బలమైన దేశాలుగా ఒక వైపు పిలవబడుతున్నా మరొక వైపు అమెరికాతో పాటు లక్సంబర్గ్, ఖతార్, సింగపూర్, నార్వే, ఐర్లాండ్, స్విట్జర్లాండ్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఫ్రాన్స్, ఇటలీ, ఆస్ట్రియా, ఆస్ట్రేలియా, స్వీడన్, డెన్మార్క్, న్యూజిలాండ్‌దేశాలు ప్రపంచంలో అత్యంత ధనిక దేశాలుగా పేర్కొనబడుతున్నాయి. ఇక భారతదేశం ప్రపంచంలో ఐదవఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. శతాబ్దాల విదేశీ పాలకుల ఏలుబడిలో ఆర్థికంగా చిన్నాభిన్నమైన భారత్ స్వాతంత్ర్యం వచ్చేనాటికి అప్పటి జనాభాకు కనీస మౌలిక సదుపాయాలుకల్పించలేని స్థితిలో ఉండేది. దేశ విభజన, భారత్ చైనా యుద్ధం, పాకిస్థాన్‌తో జరిగినయుద్ధం, పాక్ ప్రేరిత సీమాంతర ఉగ్రవాదంతో పాటు ఆంగ్లవలస పాలకులు సృష్టించి వెళ్లిన అనేక సమస్యలతో దేశం సతమతమైంది. నిరక్షరాస్యత, నిరుద్యోగం, ఆకలి, దరిద్రం, అనారోగ్యం, పోషకాహార సమస్యలతో పాటు, చదువుకోవడానికి సరైన వసతులు లేని పరిస్థితుల నుండి బయట పడడానికి దేశం ఎన్నో ప్రయత్నాలు చేయవలసివచ్చింది. స్వాతంత్ర్యం వచ్చేనాటికి భారత దేశజనాభా 34కోట్లు, అప్పటి జిడిపి కేవలం 2.7లక్షల కోట్లు, ప్రజల తలసరి ఆదాయం కేవలం 249 రూపాయలు. అప్పటి అమెరికా డాలర్ విలువ కేవలం 3.30రూపాయలుగా ఉండేది. 1947 నాటికి అమెరికా స్థూల జాతీయోత్పత్తి 249,600 మిలియన్ డాలర్లు. నాటి అమెరికా ప్రజలతలసరి ఆదాయం 1737 డాలర్లు. భారత్‌కు స్వాతంత్ర్య వచ్చేనాటికి చైనా 23.7 బిలియన్ డాలర్లతో ఉంది. అప్పటి రోజుల్లో కూడా



అమెరికా, చైనాలు భారత్ కంటే ఎన్నో రెట్లు అధిక ఆర్థిక సామర్థ్యం కలిగి ఉన్నాయి. నేటికీ అదేపరిస్థితి కొనసాగుతుంది. ప్రస్తుతం మనం ఇతర దేశాల ఆర్థిక వ్యవస్థలతో పోల్చుకుంటున్నాం. యు.కె ఆర్థిక వ్యవస్థను మించిపోయామని, జపాన్ ఆర్థికవ్యవస్థను అధిగమించబోతున్నామని సంబరపడుతున్నాం. కాని ఆయాదేశాల జనసంఖ్యను, జనసాంద్రతను, అక్కడగల అనుకూలమైన పరిస్థితులను గమనించడం లేదు. కేవలం 7కోట్ల జనాభాగల యు.కెను, 12.5 కోట్ల జనాభాగల జపాన్‌ను అధిగమించడంలో పెద్ద విశేషమేమీ లేదు. 12.5 కోట్ల జనాభా గల జపాన్ సైతం 4.39 ట్రిలియన్ డాలర్లతో బలమైన ఆర్థిక వ్యవస్థను కలిగి ఉండడం విశేషం. జపాన్ తలసరి ఆదాయం దాదాపు 32 లక్షలు. ఇది చైనా తలసరి ఆదాయంతో పోల్చిచూస్తే రెట్టింపు కంటే అధికం. ఇక అమెరికా జిడిపి, తలసరి ఆదాయంతో పోల్చుకుంటే భారతదేశ ఆదాయం అతి స్వల్పమనిచెప్పాలి. ప్రస్తుత అమెరికా జిడిపి 30ట్రిలియన్ డాలర్లను దాటింది. చైనా 19.5, జర్మనీ 4.9, జపాన్ 4.3, యు.కె 3.7 ట్రిలియన్ల డాలర్ల ఆర్థికవ్యవస్థలను కలిగి ఉండగా, భారత్ 4.27 ట్రిలియన్లతో ప్రపంచంలో ఐదవ బలమైన ఆర్థికవ్యవస్థగా ఎదిగింది. భారత్ జపాన్ ఆర్థిక వ్యవస్థను 2026 నాటికి అధిగమించి నాలుగవ ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందనే అభిప్రాయాలున్నాయి. ఇప్పటికే మన దేశం నాల్గవఆర్థిక వ్యవస్థగా మారిందని కొన్ని వార్తాకథనాలు పేర్కొన్నాయి. భారత్ స్థూలజాతీయోత్పత్తి ఐదు ట్రిలియన్ డాలర్ల చేరి ప్రపంచంలో మూడవ ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందనే అంచనాలున్నాయి. ఈ లక్ష్యం పెద్దకష్టసాధ్యమేమీ కాదు. అయితే వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా భారత్ తన ఆర్థిక ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. బలమైన ఆర్థిక వ్యవస్థలతో పోటీపడాలన్న భారత్‌సంకల్పం ప్రశంసనార్హమే. కాని దేశప్రజల మౌలిక అవసరాలు తీర్చకుండా, అభివృద్ధిని ఆశించడం అత్యాశ మాత్రమే కాగలదు. మనకంటే తక్కువ జనాభా కలిగి, ఎక్కువ జిడిపిగల దేశాలను గమనించాలి. అధిక భూభాగం కలిగి ఉండడం, సాంకేతికపరంగా, పారి శ్రామిక పరంగా, వాణిజ్యపరంగా భారత్ కంటే అమెరికా, చైనా తదితర దేశాలు అగ్రగామిలో ఉండడం వలన ఆయా దేశాలతోఆర్థికంగా పోటీపడడం అంత సులభమైన విషయం కాదు. అపారమైన అనుభవం, రాజనీతిజ్ఞత, ఆర్థిక శాస్త్ర ప్రావీణ్యతగల వారి సలహాలతో దేశం శీఘ్రగతిన అభివృద్ధి చెందగలదు. రాజకీయాలకతీతంగా దేశాభివృద్ధి కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలి. ప్రజలు జీవించడానికి తగిన మౌలిక సదుపాయాలు కలిగి, ప్రజలు నాణ్యమైన జీవన ప్రమాణాలతో ఎక్కడైతే ఉంటాయో అవే అభివృద్ధి చెందిన దేశాలు. స్థూల జాతీయోత్పత్తి పెరిగినా ప్రజల జీవన పరిస్థితులు మెరుగు పడక పోతే అది అభివృద్ధి కాదు. భారత దేశంలో జనాభా పెరుగుదల విషయంలో ఇటీవల చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. కుటుంబ నియంత్రణ పాటించి, జన సంఖ్యను అదుపులో పెట్టిన దక్షిణాది రాష్ట్రాలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం తగ్గి పోయి, జనాభా నియంత్రణకు తిలోదకాలిచ్చిన ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలకు లోక్‌సభలో అధిక ప్రాతి నిధ్యం లభించే అవకాశాలున్న దృష్ట్యా, ఇకపై దక్షిణాది రాష్ట్రాలు కూడా జనాభా నియంత్రణచర్యలు చేపట్టకపోవచ్చు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ జనాభా విషయంలో ఇటీవల చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. పెరగని భూభాగంపై పెరిగేజనాభా అవసరాలు తీర్చగలమా? అందరికీ విద్య, వైద్య, ఉపాధి అవకాశాలను కల్పించగలమా? కుల మతాల కతీతంగా ప్రతీ ఒక్కరూ దేశ వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా జనాభా పెరుగుదల విషయంలో తగిన నిర్ణయం తీసుకోవాలి. జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాలకు అన్యాయం జరగరాదు. జనాభా పెరుగుదల వలన, తగ్గుదలవలన కూడా అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వృద్ధజనాభా పెరిగి, యువత శాతం తగ్గడం వలన అభివృద్ధి అడుగంటుతుంది. అభివృద్ధికి, జనసంఖ్యకు అవినాభావ సంబంధమున్న దృష్ట్యా భారతదేశం జనాభా విషయంలో హేతుబద్ధమైన మార్గాన్ని నిర్దేశించాలి. రాజకీయాలు అభివృద్ధిని నిరోధించరాదు. రాజకీయ వైషమ్యాలతో దేశాభివృద్ధికి అడ్డుకట్టలు వేయడం సబబు కాదు. భారత దేశం

# ఒడిశాలో ఇంకా కొనసాగుతున్న బాల్యవివాహాలు

## ఆరేళ్లలో 8159మంది మైనర్లకు పెళ్లిళ్లు



**భువనేశ్వర్, మార్చి 22:** ఒడిశాలో ప్రతిరోజు మూడు బాల్యవివాహాలు జరుగుతున్నాయని, గడచిన ఆరేళ్లగా ఇదే క్రమం తప్పకుండా కొన సాగుతున్నట్లు ప్రభుత్వ గణాంకాలే చెపుతున్నాయి. అనేక చర్యలు చేపట్టినప్పటికీ బాల్య వివాహాలు మాత్రం ఒడిశాలో తగ్గడంలేదు. గిరిజన సాంప్రదాయంగా చెపుతున్న ఈ బాల్య వివాహాలు వరకట్నం, కార్మిక కుటుంబాల వలసలు, పిల్లలను తల్లితండ్రులు వలసలతో పాటు తమ ఎక్కడ ఎవరితోనయినా లేచిపోతుందో అన్న భయాలతో బాల్యవివాహాలు ఎక్కువగా చేస్తున్నట్లు తేలింది. 2019 నుంచి 2025 ఫిబ్రవరి వరకు 8159 బాల్యవివాహాలు జరిగాయని ప్రభుత్వ గణాంకాలు చెపుతున్నాయి. వీటిలో 1347 కేసులు నబరంగాపూర్ జిల్లానుంచే ఉన్నాయి. ఒడిశాలో మొత్తం 30 జిల్లాల్లో ఈ బాల్యవివాహాలు ఎక్కువ జరుగుతున్నట్లు అధికారులు అంగీకరిస్తున్నారు. ఇక గంజాం జిల్లా రెండోస్థానంలో ఉంది. 966 కేసులు నమోదయ్యాయి. కోరాపుట్లో 636, మయూర్భంజ్ 594, రాయగడ 408, బాలా సోర్ 361, కియోంజార్ 328, కాంధమాల్ 308, నయాఘర్ 308చొప్పున కేసులు నమోదుకాగా అతి తక్కువగా ఝార్సుగూడ జిల్లాలో ఈ ఆరేళ్లలో కేవలం 57 కేసులు మాత్రమే నమోదయ్యాయి. సామాజిక కార్యకర్త నమ్రతా ఛద్దా మాట్లాడుతూ బాల్యవివాహాలు రాత్రికిరాత్రే నిర్మూలించలేమని అందుకు తగిన సామాజిక వాతావరణం కల్పించాలన్నారు. వివాహవయస్సుకు ముందే పెళ్లిచేసుకోవడం ఎక్కువగా గిరిజనుల్లో ఉంది. మారుమూల గిరిజన గ్రామాల్లో మరింతగా ఉన్నట్లు ఛద్దాచెప్పారు. ఇతర ప్రాంతాలకు వలసవెళ్లే తల్లితండ్రులే ఇలా ఎక్కువ పెళ్లిళ్ల చేస్తున్నారు. తాము లేపుడు తమ పిల్లలు ఎవరితోనయినా లేచిపోతారన్న భయం ఎక్కువగా ఉందని, దీనివల్ల కుటుంబ పరువు గంగలో కలుస్తుందన్న ఆందోళన వ్యక్తంచేస్తున్నారని ఆమె చెప్పారు. కట్నం కూడా ఇందుకు భారంగా మారుతోందని, వయసు పెరిగితే మరింత కట్నం కోరుతున్నారన్న భయం ఉందని ఆమె చెప్పారు. వారినివిద్యావంతులుచేసి, నైపుణ్య మెళకువల్లో శిక్షణ ఇస్తే వారు స్వయం ఉపాధిని సాధిస్తారని, అప్పుడే బాలికల భవిష్యత్తుకు పెళ్లి అనేది ఆటంకం కాకుండా ఉంటుందని ఆమె చెప్పారు. పంచాయతీల స్థాయినుంచి ప్రభుత్వం అవగాహన కార్యాచరణ చేపడుతున్నదని అధికారులు చెపుతున్నారు. ప్రభుత్వంతోపాటు రాష్ట్రస్థాయిలో ఏర్పాటయిన కమిటీ కూడా ప్రతి ఆరునెలలకోసారి సమీక్షిస్తోంది. బాల్యవివాహాలతోపాటు రాష్ట్రంలో బాలకార్మికులు కూడా పెరుగుతున్న సమస్యను ఎదుర్కొంటున్నదనే చెప్పాలి. గడచిన ఆరేళ్లలో అధికారులు 328 మంది చిన్నారులను వెట్టిచాకిరీనుంచి విముక్తి కల్పించారన్నారు. వారిలో 85 మంది ఒక ఏడాదిలోనే రక్షించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని విభిన్న ప్రాంతాలనుంచి వీరందరినీ రక్షించామని కార్మికశాఖ చెపుతోంది. ఇప్పటివరకూ 159 కేసులు రిజిస్టరుచేసామని అధికారులు వెల్లడించారు.



# ట్రంప్ 'గోల్డ్‌కార్డ్'కు భలే గిరాకీ..

## ఒక్క రోజే 1,000 విక్రయం!

**వాషింగ్టన్, మార్చి 22:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన 'గోల్డ్ కార్డు'కు భారీ గిరాకీ ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్కరోజే 1,000 కార్డులను విక్రయించినట్లు వాణిజ్యశాఖ మంత్రి హోవర్డ్ లుట్నిక్ వెల్లడించారు. వీటి ద్వారా 5 బిలియన్ డాలర్ల సేకరణ చామని చెప్పారు. ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ లక్షలాది మంది ఈ కార్డును కొనేందుకు సిద్ధంగా ఉన్నారని, వీటిద్వారా 5 ట్రిలియన్ డాలర్ల సేకరించే అవకాశం ఉందన్నారు. 'ప్రపంచ వ్యాప్తంగా 3.7 కోట్ల మందికి ఈ కార్డు కొనే సామర్థ్యం ఉంది. కనీసం 10లక్షల మంది దీనిని కొనుగోలు చేస్తారని అధ్యక్షుడు ట్రంప్ భావిస్తున్నారు' అని లుట్నిక్ పేర్కొన్నారు. అసలు ఈ కార్డు ప్రవేశపెట్టాలన్న ఆలోచన ఎవరిదన్న ప్రశ్నకు బదులిస్తూ ట్రంప్ మదిలో నుంచి వచ్చిన ఆలోచనే అని చెప్పారు. అధ్యక్షుడి ఆలోచనను అమలు చేయడమే తన బాధ్యత అని, దీన్ని అమలు చేసే ప్రణాళిక తన వద్ద ఉందన్నారు.

**ఇన్వెస్టర్ వీసాతో:** ప్రస్తుతం ఉన్న పెట్టుబడి వీసా ఇబి-5 స్థానంలో గోల్డ్‌కార్డు తీసుకురానున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల వెల్లడించిన సంగతి తెలిసిందే. 5 మిలియన్ డాలర్లు చెల్లించగలిగే వారికి నేరుగా అమెరికా పౌరసత్వాన్ని అందజేస్తారు. ప్రపంచ వ్యాప్తంగా సంపన్నుల్ని ఆకర్షించేందుకు దీనిని ప్రవేశపెట్టామని, వారి అమెరికాకు వచ్చి భారీగా ఖర్చు పెడితే స్థానికంగా ఉద్యోగాలు కూడా పెరుగుతాయని ట్రంప్ పేర్కొన్నారు. ఇదే విషయంపై ఇటీవల మరో సందర్భంలో లుట్నిక్ మాట్లాడుతూ 2.5 లక్షల మంది ఈ గోల్డ్‌కార్డు కొనేందుకు ఆసక్తి చూపుతున్నట్లు చెప్పారు. ఇబి-5 ప్రోగ్రామ్ వల్ల జరుగుతున్న మోసాలు, ఇతర అక్రమాలను అరికట్టేందుకు వీటిని తీసుకొస్తున్నాం. చట్టబద్ధ ఇన్వెస్టర్లకు పౌరసత్వం, శాశ్వత నివాసం కల్పించేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. ఇబి-5 వీసా విధానాన్ని అమెరికా 1990లో తీసుకొచ్చింది. వేలాదిమంది ఈ ఇన్వెస్టర్ వీసాలను పొందారు. అయితే, ఈ విధానంలో మోసాలు జరుగుతున్నాయని, కొందరు అక్రమంగా నిధులు పొందుతున్నారని ఇటీవల జరిపిన అధ్యయనంలో తేలింది. దీంతో 2022లో కొన్ని సవరణలు చేశారు. తాజాగా దీని స్థానంలో గోల్డ్ కార్డును ప్రవేశపెడుతున్నట్లు ట్రంప్ ప్రకటించారు.



# జనాభా ఆధారిత పునర్విభజన ఎంతమాత్రం సరికాదు

## ఒడిశా మాజీ సిఎం నవీన్ పట్నాయక్

**భువనేశ్వర్, మార్చి 22:** పార్లమెంటులో ఎన్ని సీట్లు ఉండాలనేందుకు జనాభా ఒక్కటే ప్రామాణికంగా తీసుకోరాదని బిజెడి అధినేత మాజీ సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు. అందుకు ఈ ప్రక్రియ ప్రారంభించేముందే అన్ని రాజకీయ పార్టీలతో సమగ్ర చర్చలుజరపాలని కోరారు. చెన్నైలో జరిగిన తొలి జెఎసి సమావేశంపై పట్నాయక్ మాట్లాడుతూ బిజెడి ఒడిశా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా అన్ని పార్టీలతో సమగ్ర చర్చలుజరిపి ఏకాభిప్రాయ సాధనకు కృషిచేయాలనికోరారు. ఇలాంటి ముఖ్యమైన అంశానికి సంబంధించి అన్ని పార్టీల్లో ఉన్న అనుమానాలను నివృత్తిచేయాలని కోరారు. ప్రజాస్వామ్యంలో అఖిలపక్ష చర్చ అనేది కీలకమని బిజెడి అధినేత చెప్పారు. పార్టీ తరపున ఇద్దరు నాయకులను చెన్నై సమావేశానికి పంపించామని పట్నాయక్ వెల్లడించారు. దీనికితోడు పట్నాయక్ జెఎసి సమావేశంలో వర్చువల్‌గా ప్రసంగించారు. కుటుంబనియంత్రణ దక్షిణాది, తూర్పురాష్ట్రాల్లో కట్టుదిట్టంగా పాటించామని అందువల్లనే ఇపుడు మనకు పార్లమెంటు స్థానాలు తగ్గుతున్నాయని ఆయన అన్నారు. ఈ వ్యవస్థను మనం సమిష్టిగా అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం జనాభా ఆధారంగా పునర్విభజన అనేది ఎంతమాత్రం సహేతుకం కాదని బిజెడి అధినేత స్పష్టంచేసారు. జాతీయ స్థాయిలో కుటుంబ నియంత్రణ అత్యంత ప్రాధాన్యతాంశంగా తీసుకున్న కేంద్రం ఇపుడు జనాభా ఆధారంగాచేస్తే దక్షిణాదిరాష్ట్రాలకు సీట్లు తగ్గుతాయని తెలియదా అని నవీన్ పట్నాయక్ ప్రశ్నించారు.

# నాగ్‌పూర్ అల్లర్ల నిందితుల నుంచే ఆస్తినష్టం వసూలు: సిఎం ఫడ్నవీస్



**ముంబయి, మార్చి 22:** మహారాష్ట్రలో నాగ్‌పూర్‌లో మార్చి 17న రెండు వర్గాల మధ్య చెలరేగిన హింసతో ఉద్రిక్త వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. అయితే ఈ అల్లర్లలో బంగ్లాదేశీయుల హస్తం ఉందా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉందని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారు. ప్రస్తుతం దీనిపై ఏమీ చెప్పలేమని దర్యాప్తు కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. దీని వెనుక ఉన్నది ఎవరైనా కఠిన చర్యలు తప్పవని అన్నారు. నాగ్‌పూర్‌లో నెలకొన్న హింసకు సంబంధించిన కారణాలపై మహారాష్ట్ర బిజెపి అధ్యక్షుడు చంద్రశేఖర్ సమక్షంలో పోలీసు ఉన్నతాధికారులతో జరిగిన సమావేశం అనంతరం ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. హింసకు కారణమైన వారి నుంచే ఆస్తి నష్టం మొత్తాన్ని వసూలు చేస్తామని ఫడ్నవీస్ పేర్కొన్నారు. వారు డబ్బు చెల్లించని పక్షంలో వారి ఆస్తులను స్వాధీనం చేసుకుని విక్రయిస్తామని అన్నారు. మతపరమైన వస్తువులు దహనం చేసినట్లు కొంతమంది సోషల్ మీడియా వేదికగా తప్పుడు పుకార్లు వ్యాప్తి చేశారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి కారణమైన 104 మందిపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. సోషల్ మీడియాలో తప్పుడు వదంతులు వ్యాప్తి చేసి అల్లర్లకు కారణమైన వారిని కూడా నిందితులుగా పరిగణిస్తాం. ఇప్పటి వరకు 66 పోస్ట్‌లను తొలగించాం అని ఫడ్నవీస్ అన్నారు. మార్చి 17న నాగ్‌పూర్‌లో కొందరు మతపరమైన వ్యాఖ్యలు చేయడంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. అనంతరం కొందరు మతపరమైన వ్యాఖ్యలు చేయడంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. అనంతరం కొందరు ఉద్రిక్తతలను మరింత రెచ్చగొట్టేలా నినాదాలు చేయడంతో హింసాత్మకంగా మారింది. ఘర్షణలో 34 మంది పోలీసులు గాయపడ్డారని, ఇందులో ముగ్గురు డిప్యూటీ కమిషనర్లు ఉన్నారని అధికారులు పేర్కొన్నారు. అయితే ఈ అల్లర్ల వెనుక బంగ్లాదేశీయుల హస్తం ఉండి ఉంటుందని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



# హమాస్ సైనిక నిఘా అధిపతి హతం

## ఇజ్రాయెల్ కీలక ప్రకటన

**టెల్‌అవీవ్, మార్చి 22:** గాజాపై ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో పశ్చిమాసియా మళ్లీ రణరంగంగా మారింది. ఈ క్రమంలోనే టెల్‌అవీవ్ ఓ కీలక ప్రకటన చేసింది. హమాస్ మిలిటరీ ఇంటెలిజెన్స్ అధిపతిని తమ బలగాలు హతమార్చాయని పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటనను విడుల చేసింది. దక్షిణ గాజాలో ఒసామా తబాష్‌ను మా ఐడిఎఫ్ దళాలు హతమార్చాయని తెలిపింది. అతడు ఉగ్రవాద సంస్థ నిఘా, లక్ష్యాత్మక యూనిట్ విభాగానికి కూడా అధిపతిగా వ్యవహరిస్తున్నట్లు వెల్లడించింది. ఈ ప్రకటనపై హమాస్ ఇప్పటివరకు స్పందించలేదు. ఇటీవల ఇజ్రాయెల్-హమాస్‌ల మధ్యజరిగిన తొలిదశ కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన సంగతి తెలిసిందే. ఈ ఒప్పందం కొనసాగింపును ఉగ్రవాద సంస్థ తిరస్కరించింది. దీని కారణంగానే తాజాగా దాడులు జరిగాయని అమెరికా ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో పేర్కొంది. ఈ ప్రతిపాదనకు అంగీకరించినట్టయితే ఇలా జరిగేది కాదని పేర్కొంది.

మంగళవారం గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. ఈ దాడుల్లో 400 మందికిపైగా మృతిచెందగా అనేకమంది గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువ మంది చిన్నారులు, మహిళలే ఉన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం మార్పులను హమాస్ తిరస్కరించడంతోనే దాడులకు ఆదేశించానని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తెలిపారు. ఈదాడులను తీవ్రంగాఖండించిన హమాస్ ఇందుకు తగిన మూల్యం చెల్లించు కోవాల్సి వస్తోందని హెచ్చరించింది. గురువారం ఉదయం సైతంగాజాపై ఐడిఎఫ్‌దళాలు దాడులు చేశాయి. ఈ దాడుల్లో దాదాపు 85 మంది ప్రాణాలు కోల్పోగా 133 మందికి గాయాలయ్యాయి. మరోవైపు హమాస్ బందీలను విడిచి పెట్టేవరకు గాజాలోని భూభాగాలను ఒక్కొక్కటిగా ఆక్రమిస్తామని ఇజ్రాయెలన రక్షణ మంత్రి కాట్జ్ హెచ్చరికలు జారీ చేశారు. హమాస్ తలొగ్గితేనే తమ ఆక్రమణ ఆగుతుందని.. అప్ప టివరకు సైన్యం మరిన్ని భూభాగాలను ఇజ్రా యెల్‌లో విలీనం చేస్తూనే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. బందీలు విడుదలయ్యే వరకూ సైన్యం ఒత్తిడి పెంచాలన్నారు. గాజా లేదా వెస్ట్ బ్యాంక్‌లోనిభూభాగాలను ఆక్రమించుకోవడాన్ని ఫ్రాన్స్ తప్పుబట్టింది. రెండు దేశాలు ఒకదాని పక్కన ఒకి శాంతితో నివసించాలని ఆ దేశ విదేశాంగ మంత్రి జీన్‌నోయెల్ బారెట్ పేర్కొన్నారు.

# లద్దాఖ్ భూభాగంలో చైనా కౌంటీల ఏర్పాటు

## తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భారత్!



**న్యూఢిల్లీ, మార్చి 22:** భారత్‌తో సరిహద్దు వివాదం పరిష్కారానికి ఓ వైపు చర్చల దిశగా ప్రయత్నాలు జరుగుతున్న వేళ చైనా మరోసారి కవ్వింపులకు పాల్పడింది. లద్దాఖ్ భూభాగంలోని కొన్ని ప్రాంతాల్లో కౌంటీలను ఏర్పాటు చేస్తోంది. ఈ విషయంపై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి దురాక్రమణను ఎన్నటికీ అంగీకరించబోమని స్పష్టం చేసింది. చైనా రెండు కొత్త కౌంటీలను ఏర్పాటు చేస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఆ కౌంటీల్లోని కొన్ని భాగాలు లద్దాఖ్ పరిధిలోకి వస్తాయి. భారత భూభాగాలను ఆక్రమించడాన్ని మేం ఎన్నటికీ అంగీకరించబోం. భారత సార్వభౌమాధికారానికి సంబంధించి మా దీర్ఘకాల, స్థిరమైన వైఖరిపై ఈ కౌంటీల ఏర్పాటు ఎలాంటి ప్రభావం చూపించదు. ఈ చర్యలు చైనా చేపడుతున్న బలవంతపు ఆక్రమణలకు చట్టబద్ధతను కల్పించలేవు అని కేంద్ర విదేశాంగశాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్‌సింగ్ పార్లమెంట్‌కు వెల్లడించారు. దీనిపై భారత్ నిరసనను దౌత్యమార్గాల ద్వారా తెలియజేశామని పేర్కొన్నారు. చైనా కౌంటీల నిర్మాణంపై కేంద్రానికి సమాచారం ఉందా? అన్న ప్రశ్నకు బదులిస్తూ విదేశాంగ శాఖ ఈ మేరకు వివరణ ఇచ్చింది. కౌంటీలతో పాటు సరిహద్దు ప్రాంతాల్లో చైనా చేపడుతున్న అభివృద్ధి ప్రాజెక్టుల గురించి కూడా తమకు సమాచారం ఉందని వెల్లడించింది. ఈ సందర్భంగా సరిహద్దుల్లో మౌలిక సదుపాయాల పురోగతిపై భారత్ ప్రత్యేక దృష్టి సారించినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. భారత వ్యూహాత్మక, భద్రతా అవసరాలకు అనుగుణంగా సరిహద్దు రహదారుల సంస్థకు గతంలో పోలిస్తే మూడు రెట్లు ఎక్కువగా నిధులు అందిస్తున్నాం. సొరంగాలు, వంతెనలను నిర్మిస్తున్నాం అని కీర్తి వర్ధన్ సింగ్ తన సమాధానంలో పేర్కొన్నారు.

# 357 ఆన్‌లైన్ మనీగేమింగ్ వెబ్‌సైట్లు నిలిపివేత

## వాటిని ఎవరూ వాడొద్దని డిజిజిఐ హెచ్చరిక



**న్యూఢిల్లీ, మార్చి 22:** ఆన్‌లైన్ మనీ గేమింగ్ సంస్థలపై కేంద్రం కొరడా ఝుళిపించింది. అక్రమంగా నిర్వహిస్తోన్న 357 వెబ్‌సైట్లను ఆర్థిక శాఖ పరిధిలోని డిజిజిఐ బ్లాక్ చేసింది. ఆ గేమింగ్ సంస్థలకు చెందిన 2400 బ్యాంక్ ఖాతాలు సీజ్ చేసి, రూ.126 కోట్లను ఫ్రీజ్ చేసింది. అలాగే మనీ గేమింగ్ ప్లాట్ ఫామ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాటిని ఎవరూ వాడవద్దని డిజిజిఐ హెచ్చరించింది. సంస్థలను నమోదు చేయకుండా, ఆదాయాలను దాచి పెడుతూ జిఎస్టీ ఎగవేతలకు పాల్పడుతోన్న సుమారు 700 సంస్థలపై నిఘా ఉంచింది. దేశం వెలుపల ఈ తరహా సంస్థలు నడుపుతోన్న పలువురు భారతీయులపై డిజిజిఐ మరో ఆపరేషన్ చేపట్టింది. వారికి చెందిన 166 ఖాతాలను బ్లాక్ చేసింది. అలాగే ముగ్గురిని అదుపులోకి తీసుకుంది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో పాటు బాలీవుడ్ సెలబ్రిటీలు, క్రికెటర్లు ఈ సంస్థల ప్రచారంలో పాల్గొంటున్నారని ఈ విషంలో ప్రజలు అప్రమతంగా ఉండాలి. ఆ ప్లాట్‌ఫామ్‌లు వ్యక్తుల ఆర్థిక భద్రతను దెబ్బతీయవచ్చు. దేశ భద్రతను దెబ్బతీసే కార్యకలాపాలకు అవి పరోక్షంగా మద్దతు ఇచ్చే అవకాశాలున్నాయి అని ఆర్థిక శాఖ హెచ్చరించింది.



# వ్యోమగామి సునీతకు ఓవర్‌టైమ్ వేతనం ఇస్తా

## సొంత డబ్బు చెల్లిస్తానన్న డొనాల్డ్ ట్రంప్

**వాషింగ్టన్, మార్చి 22:** అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్ ఎట్టకేలకు ఇటీవల సురక్షితంగా భూమిని చేరుకున్న సంగతి తెలిసిందే. 8 రోజుల పర్యటన నిమిత్తం ఐఎస్ఎస్‌కు వెళ్లిన వీరు అనుకోనివిధంగా సుమారు 9 నెలలపాటు అక్కడే గడపాల్సి వచ్చింది. అయితే, సుదీర్ఘ కాలం అంతరిక్షంలోనే ఉండిపోయినందుకు వీరికి ఎలాంటి అదనపు వేతనాలు ఉంటాయనేది ఆసక్తికరంగా మారింది. దీనిపై తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ కీలక ప్రకటన చేశారు. వారి ఓవర్‌టైమ్ జీతాన్ని తాను సొంతంగా చెల్లిస్తానని ప్రకటించారు.

సునీత, విల్మోర్‌కు ఎలాంటి అదనపు వేతనం ఉండదా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ట్రంప్ బదులిస్తూ.. 'నేను చేయాల్సివస్తే నా జేబు నుంచి వారికి ఓవర్‌టైమ్ జీతం చెల్లిస్తా. ఈ సందర్భంగా వ్యోమగాములను సురక్షితంగా భూమ్మీదకు తీసుకొచ్చేందుకు సాయం చేసిన ఎలాన్ మస్క్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ఆయనకు లేకపోతే ఏమై ఉండేదో ఓసారి ఆలోచించండి' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

అంతరిక్షంలో నిర్దేశిత సమయం కన్నా ఎక్కువకాలం పనిచేసిన వ్యోమగాములకు అదనంగా ఎలాంటి చెల్లింపులు ఉండవని తెలిసింది. ఫెడరల్ ఉద్యోగులు అయినందువల్ల అంత రిక్షంలో వారి పనిచేసిన కాలాన్ని భూమ్మీద సాధారణ పర్యటన చేసినట్లుగానే పరిగణిస్తారని నాసా నిపుణులు వెల్లడించారు. సాధారణంగా వచ్చే జీతంతోపాటు ఐఎస్ఎస్‌లో ఆహారం, బస ఖర్చులను నాసా భరిస్తుందన్నారు. ఇటువంటి అనూహ్య పరిణమాలు చోటుచేసుకున్నప్పుడు మాత్రం అదనంగా రోజుకు 5 డాలర్ల చొప్పున చెల్లిస్తుందట. అంటే సునీత, విల్మోర్ 286 రోజులు అంతరిక్షంలో ఉన్నందుకుగానూ అదనంగా వారికి 1,430 డాలర్ల చొప్పున చెల్లించనున్నారు.

నాసా ఉద్యోగులు అమెరికా ప్రభుత్వ ఉద్యోగులు పొందే జీతభత్యాలే పొందుతారు. వ్యోమగాములకు జనరల్ షెడ్యూల్ జిఎస్-13 నుంచి జిఎస్-15 కింద చెల్లింపులు ఉంటాయి. సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లు అత్యధిక గ్రేడ్ జిఎస్-15 గ్రేడ్ పే జీతం అందుకుంటున్నారు. దీని ప్రకారం గతేడాది వీరి వార్షిక వేతనం 1,52,000 డాలర్లుగా ఉంది.



# బిజెపియేతర రాష్ట్రాలమెడపై వేలాడే కత్తి డీలిమిటేషన్

## కేరళ సిఎం పినరయి విజయన్

**చెన్నై, మార్చి 22:** నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తమిళనాడు సిఎం ఎంకెస్టాలిన్ ఆధ్వర్యంలో జరిగిన జెఎసి సమావేశంలో పాల్గొన్న కేరళ సీఎం విజయన్ మాట్లాడుతూ పునర్విభజన ఇపుడు మెడపై వేలాడే కత్తిగా మారిందని అన్నారు. ఎవరితోనూ చర్చించకుండానే డీలిమిటేషన్ అంశంపై బిజెపి ముందడుగులు వేసిందని ఆరోపించారు. ఇది రాజ్యాంగానికి వ్యతిరేకమని ప్రజాస్వామ్య ప్రక్రియకు విరుద్ధమని అన్నారు. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాల డీలిమిటేషన్ జరిగితే సీట్లు తగ్గుతాయన్నారు. బిజెపి అధినేత, ఒడిశా మాజీ సీఎం నవీన్‌పట్నాయక్ విడియో సందేశంలో జెఎసి సమావేశం చాలా కీలకం అన్నారు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జనాభాను నియంత్రించే రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందని విజయన్ అన్నారు.

అన్ని సందేహాలు నివృత్తిచేసేందుకు కేంద్ర ప్రభుత్వం అన్నిపార్టీ లతో ముందు సమావేశం నిర్వహించాలని అలాంటివి ఏమీ లేకుండా ఏకపక్షంగా ముం దడుగు వేస్తోందని విజయన్ ఆరోపించారు. 42,84,87వ రాజ్యాంగ సవరణలను పరిరక్షిం చాలని, అందులో జనాభా నియంత్రణ చర్యలు అమలుచేసినట్లుగా నాయకులు వివ రించారు. డిఎంకె ఎంపి కనిమోళి మాట్లాడుతూ డీలిమి టేషన్‌లో పారదర్శకత కొరవడిందని, అన్నివర్గాలతో ఎలాంటి చర్చలు జరపలేదన్నారు. 1971 జనాభా లెక్కల ఆధారంగా పార్లమెంటు స్థానాలపై విధించిన నిషేధాన్ని మరో 25 యేళ్లపాటు పొడిగించాలని డిమాండ్ చేసారు.

# 8 నుంచి 12 తరగతులవరకూ కర్ణాటకలో సెక్స్‌ఎడ్యుకేషన్

## కర్ణాటక మంత్రి మధుబంగారప్ప వెల్లడి

**బెంగళూరు, మార్చి 22:** కర్ణాటక ప్రభుత్వం 8 నుంచి 12 తరగతుల విద్యార్థులకు సెక్స్ ఎడ్యుకేషన్ తరగతులు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ తరగతుల్లో విద్యార్థులకు వయ సు పెరుగుతున్న కొద్దీ ఎదురయ్యే ప్రభావాలు, ఉద్వేగాలు వాటిని ఎలా అధిగమించాలి అన్న అంశాలపై వారికి అవగాహన పెంచేందుకుగాను 8 నుంచి 12 తరగతుల విద్యార్థినీ విద్యార్థులకు సెక్స్‌ఎడ్యుకేషన్ తరగతులను ప్రారంభిస్తున్నట్లు విద్యామంత్రి మధు బంగారప్ప తెలిపారు. శాసనమండలిలోప్రసంగించిన మధు బంగారప్ప టీనేజర్లలో భౌతిక, ఎమోషనల్, హార్మోనల్ పరంగా వస్తున్న మార్పులపట్ల వారికి అవగాహన కల్పించడమే ఈ తరగతుల కీలక లక్ష్యమని అన్నారు. ఈ తరగతుల నిర్వహణకు ఉత్తర్వులు జారీచేసామన్నారు. వారానికి రెండుసార్లు వైద్యనిపుణులు వచ్చి ఈ తరగతులు బోధిస్తారు. అలాగే క్రమానుగతంగా ఆరోగ్య తనిఖీలు, కౌన్సెలింగ్ తరగతులు ఏడాదికి రెండు సార్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తారు. డ్రగ్స్‌వల్ల అనర్థాలు, ప్రమాదాలు, అంటువ్యాధులపట్ల అవగాహన కల్పిస్తారన్నారు. సెక్స్‌ఎడ్యుకేషన్‌తోపాటు ప్రభుత్వం డిజిటల్ బానిసత్వం, ముందుగానే లైంగిక కార్యకలాపాలపట్ల వచ్చే అనర్థాలు, టీనేజిలోనే గర్భధారణవల్ల ఎదురయ్యే ముప్పు వంటివాటిపైనా అవగాహన తరగతులు నిర్వహిస్తారు.



అలాగే ఒకటినుంచి పదోతరగతి విద్యార్థులకు నైతిక నియమావళి విద్యను కూడా తప్పనిసరిగా బోధించాలని నిర్ణయించినట్లు తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరంనుంచే వారానికి రెండుసార్లు ఈ తరగతులు నిర్వహిస్తారు. సమైక్యత, వాస్తవిక విధానం, ఓర్పు, సంయ మనం వంటి వాటిపై విద్యార్థులకు భోదిస్తారు. బాలికలకు భద్రతరీత్యా పోలీస్ అధికారులను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు. పోక్సో చట్టంపైనా అవగాహన కల్పిస్తారని మంత్రి మదు బంగారప్ప తెలిపారు. దీనివల్ల విద్యార్థినీ విద్యార్థులు తమ హక్కులు, చట్టపరమైన సంరక్షణ వంటివాటిపై అవగాహన పొందుతారని మంత్రి వెల్లడించారు.

# రష్యాకు అన్నివేళలా అండగా నిలుస్తాం


## ఉత్తరకొరియా అధినేత కిమ్‌జాంగ్ ఉన్

**మాస్కో, మార్చి 22:** ఉక్రెయిన్‌తో యుద్ధసమయంలో ఉత్తరకొరియానుంచి రష్యాకు తిరుగులేని మద్దతు అందింది. ఉత్తర కొరియా రాజధాని పాంగ్యాంగ్‌లో రష్యా రక్షణరంగానికి చెందిన ఉన్నతస్థాయి అధికారులతో జరిగిన సమావేశంలో కిమ్‌జోంగ్ ఉన్ స్పందించారు. పుతిన్‌సేనల తరపున పోరాడేందుకు కిమ్‌రాజ్యం మరికొందరు సైనికులను పంపించి ఉండవచ్చని దక్షిణకొరియా నిఘావిభాగం అంచనావేసింది కూడా. కిమ్ రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ సెర్గీ షోయిగు మధ్య జరిగిన భేటీలో వివిధ అంశాలపై చర్చించారు. రష్యా తన సార్వభౌమాధికారం, ప్రాంతీయ సమగ్రతను కాపాడేందుకు చేస్తున్న పోరాటంలో ఉత్తరకొరియా ఎప్పుడూ అండగా ఉంటుందని కిమ్ వెల్లడిం చారు. ఇద్దరి మధ్య ఏర్పడిన ఒప్పందాలు అమలు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తామని పుతిన్ పంపిన సందేశం షోయిగు వినిపించారు. గత ఏడాది రష్యాలోకిమ్ ఉత్తరకొరియాలో పుతిన్‌లు పర్యటించిన సంగతి తెలిసిందే. 24 ఏళ్లలో తొలిసారిగా ఉత్తరకొరియాలో రష్యా అధ్యక్షుడు పర్యటించారు. పాశ్చాత్య దేశాల నుంచి తమ రెండుదేశాల్లో ఎవరిపై దాడి జరిగినా పరస్పర



సహాయం చేసుకుంటామని ఆసమయంలో ఇద్దరునేతలునిర్ణయించారు. సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంటుందని పుతిన్,కిమ్ ఇద్దరూ ప్రకటించారు. ఉక్రెయిన్‌తో యుద్ధంలో భాగంగా రష్యాకు ఉత్తరకొరియా భారీ సంఖ్యలో సాంప్రదాయ ఆయుధాలను, పదినుంచి 12 వేలమందివరకూ బలగాలను పంపించినట్లు దక్షిణ కొరియా నిఘా వేగులు ప్రకటించారు.

# ట్రంప్‌కోసం పుతిన్ ప్రార్ధనలు చేశారు..



## వెల్లడించిన అమెరికా రాయబారి స్టీవ్ విట్‌కోఫ్

**వాషింగ్టన్, మార్చి 22:** రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ముగింపు కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. రష్యాకు అనుకూలంగా ఆయన ప్రకటనలు, నిర్ణయాలు ఉంటున్నాయి. ఈ తరుణంలో వారి స్నేహం గురించి ఓఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. గత ఏడాది ఎన్నికల ప్రచారంలో భాగంగా ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన సంగతి తెలిసిందే. పెన్సిల్వేనియా ప్రచారంలో ఉండగా 20 ఏళ్ల యువకుడు జరిపిన కాల్పుల్లో ట్రంప్ చెవికి స్వల్పంగా గాయమైంది. భద్రతా సిబ్బంది వెంటనే ట్రంప్‌చుట్టూ రక్షణగా చేరి వేదికపై నుంచి దించి ఆసుపత్రికి తరలించారు. ఆ ఘటన అప్పట్లో సంచలనమైంది. ఆ విషయం తెలుసుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్ ట్రంప్ క్షేమం కోసం ప్రార్ధనలు చేశారు. పుతిన్ స్థానిక చర్చ్‌కు వెళ్లి, మత గురువును కలిసి, అధ్యక్షుడి కోసం ప్రార్థించారు. అధ్యక్షుడితో పుతిన్‌కు స్నేహం ఉంది. స్నేహితుడి కోసం ఆయన ప్రార్థించారు. ఇదే విషయాన్ని నేను ట్రంప్‌కు చెప్పాను. పుతిన్ చర్య ఆయన హృదయాన్ని హత్తుకుంది అని అమెరికా రాయబారి స్టీవ్ విట్‌కోఫ్ ఓ పాడ్‌కాస్ట్‌లో భాగంగా వెల్లడించారు. గత ఏడాది ట్రంప్‌పై వరుసగా జరిగిన హత్యాయత్నం ఘటనలపై గతంలో పుతిన్ స్పందించారు కూడా. అమెరికా చరిత్రలోనే ఈసారి దురదృష్టకర ఘటనలుచోటు చేసుకున్నాయి. ఎన్నికల్లో ట్రంప్‌పై పోరాడేందుకు కొందరు అనాగరిక పద్ధతులు పాటించారు. ఆయన కుటుంబాన్ని, పిల్లలను లక్ష్యంగా చేసుకుని రాజకీయ ప్రత్యర్థులు విమర్శలు గుప్పించడం దిగ్భ్రాంతి కలిగించింది. పలుమార్లు ఆయనపై హత్యాయత్నాలు జరగడం విచార కరం. నా అంచనా ప్రకారం ఇప్పుడు ట్రంప్ ఏ మాత్రం సురక్షితంగా లేరు. అయితే ఆయన తెలివైన వ్యక్తి. ముప్పును అర్థం చేసుకుని జాగ్రత్తగా ఉంటారని విశ్వసిస్తున్నా అని అన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి
## మరో విద్యార్థికి తీవ్ర గాయాలు

**వడమాలపేట, మార్చి 22 ప్రభాతవార్త:** తిరుపతి-చెన్నై జాతీయ రహదారిలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి ఒకరు మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వడమాలపేట ఎస్ఐ ధర్మారెడ్డి కథనం మేరకు... బైరెడ్డిపల్లి మండలం ఎం.గాజీపేటకు చెందిన భువన మను(21) పుత్తూరు సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో హాస్టల్‌లో ఉంటూ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. శనివారం ఉదయం తిరుపతిలో జరిగే ఎంపీటీఎల్‌పరీక్షకు హాజరయ్యేందుకు వెళుతూ తన స్నేహితుడు అయిన తొట్టంబేడు మండలం పెద్ద కనపర్తికి చెందిన వంశీతో కలసి స్కూటర్‌పై బయలుదేరాడు. వడమాలపేట టోల్ ప్లాజా సమీపంలో అతి వేగంగా వెళుతూ ముందు నిలుచున్న లారీని ఢీకొన్నారు.

ఈ ప్రమాదంలో భువన మను అక్కడికక్కడే మృతి చెందగా వంశీ తీవ్రంగా గాయపడ్డాడు. వంశీని చికిత్స నిమిత్తం తిరుపతి ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ధర్మారెడ్డి తెలిపారు.


జ్యోతి ప్రజ్వలనంతో సెమినార్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామమోహన్

# రాష్ట్రంలోని ఇన్వెస్టర్లకు అవగాహనకోసం మెగా రిసా

**విజయవాడ, మార్చి 22, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్‌లోని ఇన్వెస్టర్లలో అవగాహన కల్పించేందుకు మెగా రిసా (రీజనల్ ఇన్వెస్టర్ సెమినార్ ఫర్ అవేర్‌నెస్) సెమినార్‌ను ఏఎంఎఫ్ఐ, (సెక్యూరిటీ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు) సెబీ లు సంయుక్తంగా విజయవాడలో శని వారం విజయ వంతంగా నిర్వ హించారు. ఆర్థిక ప్రపంచంలో ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్ళడానికి కావాల్సిన పరిజ్ఞానం అందించడం లక్ష్యంగా ఈ సెమినార్ నిర్వహించినట్లు సెబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోజ్ కుమార్, ఏఎంఎఫ్ఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ చలసాని లు స్పష్టం చేశారు. అందుబాటులో వున్న ఇన్వెస్ట్‌మెంట్ మార్గాలు, ఆర్థిక మార్కెట్ల వివిధ కోణాలు, మోసాల నివారణ, స్మార్ట్ ఇన్వెస్టింగ్ పై అవగాహన కల్పించడానికి ఇన్ఫార్మ్‌డ్ ఇన్వెస్టర్ సహీ హై థీంతో సెమినార్ జరిగిందన్నారు. దేశంలో 8వ పెద్దరాష్ట్రం ఏపిలో వున్న 71శాతం వర్కింగ్ ఏజ్ ప్రజలు బాధ్యతాయుతమైన ఇన్వెస్టింగ్ చేయడానికి అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, పలువురు ఇన్వెస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ వ్యవస్థ పునరుద్ధరించిన తెలంగాణ సిఎంకు కృతజ్ఞతలు

**విజయవాడ, మార్చి 22, ప్రభాతవార్త :** తెలంగాణలో గత టిఆర్ఎస్ ప్రభుత్వం తీసేసిన గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునరుద్దరిస్తూ 10.954 పోస్టు జిపివోలుగా నియమిస్తూ జిఓనెం.41 జారీ చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి శ్రీనివాసరెడ్డికి ఏపి విఆర్ఓ అసోసియేషన్ అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు ధన్యవాదాలు తెలిపారు. రెవెన్యూ వ్యవస్థ తీసేసిన తర్వాత అక్కడి రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను పాదయాత్ర సమయంలో గుర్తించిన రేవంత్‌రెడ్డి జివో జారీ చేయడంవల్ల ప్రజలకెంతో మేలు జరుగుతుందన్నారు.

## అంబేద్కర్ విగ్రహానికి అవమానం.. ఘటనపై డిజిపితో సమీక్ష
### దోషులపై కఠిన చర్యలు తీసుకొంటామన్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, మార్చి22,ప్రభాత వార్తప్రతినిధి:** తూర్పు గోదావరి జిల్లా, గోపాలపురం నియోజకవర్గం, నల్లజర్ల మండలం, దూబచర్ల గాంధీ కాలనీలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించిన ఘటనను సీఎం చంద్రబాబు నాయుడు ఖండించారు. భారతరత్న అంబేద్కర్‌ను అగౌరవపరిచేలా విగ్రహం పట్ల దుశ్చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఘటనపై డీజీపీ, పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడిన ముఖ్యమంత్రి... కుట్రతో ఇటువంటి నేరాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు, ఆయా వర్గాల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించేవారిపట్ల అత్యంత కఠిన వ్యవహరించి, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని, వివిధ వర్గాల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేవారిపై నిఘా ఉంచాలని సీఎం చంద్రబాబు సూచించారు. రాష్ట్రంలో పరిపాలన వ్యవస్థ అన్ని వర్గాల ప్రయోజనాలను కాపాడుతుతూ అభివృద్ధి పథంలో ముందుకు అడుగులు వేస్తోందన్నారు. రాజ్యాంగానికి అత్యంత గౌరవం ఇస్తూ ముందుకు అడుగులు వేస్తోందన్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో కొన్ని అరాచక శక్తులు వర్గ విబేధాలు కలిగించేందుకు అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేయడం వంటి ఘటనలకు పాల్పడ్డతాయని, ఇటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ ఘటనలో దోషులను గుర్తించి, కఠినంగా శిక్షిస్తామని ఏపీ డీజీపీ సీఎం చంద్రబాబుకు తెలిపారు.

## కుప్పం రెస్కో నిధుల దుర్వినియోగం ఎఫెక్ట్
### - మాజీ పాలకవర్గానికి జిల్లా సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ నోటీసులు

**కుప్పం, మార్చి 22 ప్రభాతవార్త** కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (రెస్కో) పరిధిలో గత వైకాపా పాలనలో నిధులు దుర్వినియోగమయ్యాయని ఫిర్యాదులు అందిన నేపథ్యంలో నిధుల దుర్వినియోగం అంశంగా ఇదివరకే రాష్ట్ర సహకార శాఖ కమీషనర్ ఆదేశాల మేరకు రాష్ట్ర సహకార శాఖ అదనపు రిజిస్ట్రార్ శ్రీలక్ష్మి విచారణ చేపట్టి తుది నివేదిక ప్రభుత్వానికి అందించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో అదనపు సహాయ రిజిస్ట్రార్ నివేదికను అనుసరిస్తూ గత వైకాపా పాలనలో పనిచేసిన మాజీ పాలకవర్గం ఈనెల 27వతేది చిత్తూరు డివిజన్ కోఆపరేటిక్ అధికారి కార్యాలయంలో ఉదయం 11గంటలకు విచారణకు హాజరు కావాలని జిల్లా సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ వనజ సెక్షన్ 60(1) కింద సర్‌చార్జ్ నోటీసులు జారీ చేశారు. మాజీ రెస్కోఛైర్మన్ సెంధిల్‌కుమార్‌తో సహా మరో 12మంది మాజీ పాలకవర్గ సభ్యులకు సైతం ఈ నోటీసులు అందిస్తున్నట్లు తెలిసింది. కాగా మాజీ రెస్కో ఛైర్మన్ వెహికల్ అలవెన్సు కింద 2020 ఏప్రిల్ 17వతేది నుంచి 2024 ఏప్రిల్ నెల వరకు ప్రతినెలా 45వేలు వంతున రూ 22,522680లక్షలు నిధులు పొందడం


కుప్పం రెస్కో కార్యాలయం

జరిగినట్లు గుర్తించారు. దీంతో పాటు పాలకవర్గ సభ్యులకు సెల్‌ఫోన్ల కొనుగోళ్లు, సెల్‌ఫోన్ చార్జీల కింద రూ 7.56లక్షల రూపాయలు చెల్లింపులు అప్పట్లో జరిగినట్లు గుర్తించారు. ఈ అంశాలపై మాజీ పాలకవర్గం నేరుగా విచారణకు హాజరై వారి అభ్యంతరాలు ఏవైనా ఉంటే తగిన ఆధారాలతో వివరణ ఇవ్వాలని డిప్యూటీ రిజిస్ట్రార్ నోటీసుల్లో పేర్కొన్నారు. లేకుంటే రికార్డుల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈవిషయంగా రెస్కో ఎండి సోమశేఖర్‌ను 'ప్రభాతవార్త' వివరణ కోరగా జిల్లా డిప్యూటీ రిజిస్ట్రార్ మాజీ పాలకవర్గానికి నోటీసులు జారీ చేస్తున్న విషయం వాస్తవమేనన్నారు. శాఖాపరంగా విచారణ జరుగుతుందని పేర్కొన్నారు.

## ఫేక్ స్టాక్ మార్కెట్లో రూ.55,85000 పెట్టుబడి
### దారుణంగా మోసపోయిన సాయినగర్ మహిళ

**తిరుపతిరూరల్, మార్చి 22 ప్రభాతవార్త:** వాట్సప్ గ్రూపులలో లింకుల ద్వారా వచ్చిన ఫేక్ స్టాక్ మార్కెట్ కంపెనీలో రూ.55,85000 లక్షల రుపాయాలు పెటుబడిపెట్టి దారుణంగా మోసపోయిన ఘటన తిరుపతిరూరల్ సాయినగర్ గ్రామ పంచాయతీలో చోటు చేసుకుంది. తిరుపతిరూరల్ పోలీసుస్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ చిన్నగోవిందు అందించిన వివరాలు మేరకు... తిరుపతిరూరల్ మండలం సాయినగర్, టెలిఫోన్ కాలనీకి చెందిన ఒక కాంట్రాక్టు టీచర్ రూ.55,85000 లక్షల రుపాయాలు స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టి, భారీగా మోసపోయింది. బాధితురాలు బంగారం తాకట్టుపెట్టడంతో పాటు మరీ అప్పులు తెచ్చి భారీగా ఫేక్ స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టింది. కొన్ని రోజులు అనంతరం వాట్సప్ గ్రూపులు క్లోజ్ చేయబడటంతో నాటు నిర్వాహకులు అందుబాటులో లేకుండా పోయారు. మోసానికి గురైన బాధిత మహిళ సైబర్ క్రైమ్ 1930నెంబర్‌కు కాల్ చేసి, ఫిర్యాదు చేసింది. తిరుపతిరూరల్ పోలీసుస్టేషన్ సిబ్బంది ప్రాథమిక ధర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. పోలీసులు వాట్సప్ గ్రూపులు, బ్యాంకు ఖాతాలు, కాల్ రికార్డులు పరిశీలిస్తున్నారు. ప్రజలు ఆర్థిక మోసాల నుండి అప్రమత్తంగా ఉండాలని, అధిక లాభాలు వస్తాయని, మోసగాళ్ల మాటలు నమ్మి, అనుమానాస్పద లావాదేవీలు చేయొద్దని తిరుపతిరూరల్ పోలీసులు హెచ్చరించారు. త్వరలో నిందితులను గుర్తించి, బాధిత మహిళకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఎవరైన మోసపోతే తక్షణమే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

## కొత్త డిజిపి ఎంపికపై ప్రభుత్వం కసరత్తు

**విజయవాడ,మార్చి22,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ కొత్త పూర్తి స్ధాయి డీజీపీ ఎంపికపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.. డీజీపీ ఎంపిక కోసం ఐదుగురు సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్లు కేంద్రానికి ఏపీ ప్రభుత్వం పంపింది సీనియర్ ఐపీఎస్ అధికారులైన మాదిరెడ్డి ప్రతాప్.. రాజేంద్ర నాథ్‌రెడ్డి.. హరీష్ కుమార్ గుప్తా.. కుమార్ విశ్వజిత్.. సుబ్రహ్మణ్యం పేర్లు కేంద్రానికి పంపించింది ఏపీ ప్రభుత్వం అయితే, వీరిలో మూడు పేర్లు ఎంపిక చేసి తిరిగి ఏపీ ప్రభుత్వానికి పంపనుంది కేంద్రం.. ప్రస్తుతం ఏపీ ఇంఛార్జ్ డీజీపీగా హరీష్ కుమార్ గుప్తా కొనసాగుతోన్న విషయం విదితమే.. డీజీపీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇంఛార్జ్‌ల నుంచి పూర్తిస్థాయి డీజీపీ నియామకానికి మొగ్గు చూపిన రాష్ట్ర ప్రభుత్వం యూపీఎస్సీ ద్వారా డీజీపీని ఎంపిక చేసి రెండేళ్లపాటు కొనసాగించాలని భావిస్తున్నట్టుగా తెలుస్తోంది.. అయితే, అందులో మెరిట్ ఆధారంగా హరీష్ కుమార్ గుప్తా పేరు ఉంటుందని, మరో రెండేళ్లపాటు ఆయనకు పోలీస్ బాస్ అవకాశం లభిస్తుందనే ప్రచారం సాగుతోంది.

## విజయపురాన్ని పారిశ్రామికంగా తీర్చి దిద్దుతా
### నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**విజయపురం, మార్చి 22 ప్రభాతవార్త:** విజయపురం మండలాన్ని పారిశ్రామికంగా తీర్చి దిద్దుతామని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్‌లో టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల కష్టంతో గెలిచానని, వారి బాగోగులు చూసుకునే బాధ్యత నాదే అని ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటానని తెలిపారు. గత ఐదు సంవత్సరాల కాలంలో ఎన్నో కష్టాలు పడి జెండా మోసి నాకు 45 వేల మెజారిటీ తెప్పించారని, మీ అందరికి రుణపడి ఉంటానని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందు ఉంటానని, నాయకులు ప్రతి ఒక్కరు సమిష్టిగా పని చేస్తూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. మండలంలోని జంబాడలో వీఆర్‌వోలు, సర్వేయర్లు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని, పైసలు ఇస్తేనే ఫైలు కదులుతున్నదని టీడీపీ కార్యకర్త వాసు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. మండలంలో పలువురు రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదు చేశారు. అనంతరం కార్యకర్తలు గ్రామాభివృద్ధి, సిమెంటు రోడ్డు, శ్మశనానికి రోడ్డు వంటి అభివృద్ధి పనులు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, మండల ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, సర్పంచ్‌గల సంఘం అధ్యక్షుడు చుక్కా ధనంజయయాదవ్, చిత్తూరు పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి బాల సుబ్రహ్మణ్యంరాజు, తెలుగు మహిళా అధ్యక్షురాలు గుణభూషణమ్మ, నాయకులు శివలింగం, కొండూరు దాము, దశరథరాజు, నారాయణరాజు, వేణుగోపాల్‌నాయుడు, ఉదయకుమార్‌రెడ్డి, సుధానాయుడు, శివయ్యనాయుడు, ఆర్ముగం, రవిచంద్రారెడ్డి, మురళి, చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఒబిసిల డిమాండ్ల సాధనకు ఛలో ఢిల్లీ విజయవంతం చేయండి
### రాష్ట్ర బిసి సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు

**విజయవాడ, మార్చి 22, ప్రభాతవార్త :** ఒబిసిలు దేశవ్యాప్తంగా తమ డిమాండ్ల సాధనకు ఈనెల 24, 25, 26తేదీల్లో నిర్వహిస్తున్న ఛలో ఢిల్లీ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ బిసి సంఘం అధ్యక్షులు కేసన శంకరరావు పిలుపునిచ్చారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జనగణనతో పాటే సమగ్ర కులగణన చేసి, జనాభా దామాషా మేరకు చట్టసభల్లో ఒబిసిలకు రిజర్వేషన్లివ్వాలని, ఇప్పటికే ఆమోదించిన మహిళాబిల్లు లో ఒబిసిలకు సబ్‌కోటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో సమగ్ర కులగణనకు అంగీకరించిన నేటి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెద్దల అలసత్వానికి, జాప్యానికి నిరసనగా ఈనెల 25న జంతర్‌మంతర్ వద్ద


మీడియాతో మాట్లాడుతున్న కేసన శంకరరావు

సేవాసంఘం అధ్యక్షుడు ఎంవివిఎస్ఎన్ మూర్తి, ఇతర బిసి సంఘ నేతలు సిహెచ్ చందు, లుక్కా రాంజీ, అండలూరి ఉమామహేశ్వరరావు శ్రీధర్, లక్కోజు వరలక్ష్మి, పారేపల్లి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం హాస్పిటల్‌లో లిఫ్ట్‌కూలి రోగి మృతి

**ప్రభాతవార్త, ఖమ్మం:** జిల్లా కేంద్రమైన ఖమ్మంలో శుక్రవారం రాత్రి ప్రైవేట్ హాస్పిటల్ లో లిఫ్ట్ కూలిన ఘటనలో మహిళ రోగి మృతి చెందింది. ముదిగొండ మండలం వనం వారి క్రిష్టపురం కు చెందిన సట్టు సరోజినమ్మ(60) బాలాజీ నగర్ ప్రసూన హాస్పిటల్ లో గుండె సంబంధిత వ్యాధికి శాస్త్ర చికిత్స చేసుకునేందుకు వచ్చింది. డాక్టర్లు ఆమెకు యాంజియో గ్రామ్ చేసి క్యాథలాగ్ నుంచి హాస్పిటల్ బిల్డింగ్ 4 వ ఫ్లోర్ నుంచి సెకండ్ ఫ్లోర్ కు వార్డు బాయ్ సహాయంతో స్ట్రేచ్చర్ పై లిఫ్ట్ లో తరలిస్తుండగా పడిపోయింది.

## విపత్తుల నిర్వహణలో అత్యాధునిక కమ్యూనికేషన్ పరికరాల వినియోగం కీలకం
### - రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియా

**విజయవాడ,మార్చి22,ప్రభాతవార్తప్రతినిధి:** విపత్తుల నిర్వహణలో అత్యాధునిక కమ్యూనికేషన్ పరికరాలు అత్యవసరమని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (విపత్తుల నిర్వహణ, భూపరిపాలన, స్టాంప్స్ రిజిస్ట్రేషన్స్ , సర్వే సెటిల్మెంట్) , ఆంధ్ర ప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ ఆర్.పి. సిసోడియా పేర్కొన్నారు. తీరప్రాంతాల్లో ఎమ్మార్వో స్థాయి నుండి జిల్లా కలెక్టర్ వరకు ప్రతి అధికారికి శాటిలైట్ ఫోన్లు అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. తద్వారా విపత్తులను సమర్ధవంతంగా ఎదుర్కొని ప్రాణనష్టం నివారించవచ్చని చెప్పారు. శనివారం విపత్తుల నిర్వహణ కార్యాలయంలో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ఐదేళ్లలో కొనుగోలు చేసిన పరికరాల వినియోగ స్థితి, రాబోయే వర్షాకాలానికి అవసరమైన సన్నద్ధత, బడ్జెట్, తీవ్ర ఉష్ణప్రవాహాల (హీట్ వేవ్స్) కోసం తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలను సమీక్షించారు. జిల్లాల స్థాయిలో మానవ వనరులు, పరికరాల అందుబాటు పరిస్థితులను అంచనా వేసి, తుపానుల హెచ్చరికా కేంద్రాల పనితీరును సమీక్షించారు. సమావేశంలో హానికర, రసాయన కర్మాగారాల సమీపంలో గాలి నాణ్యత పర్యవేక్షణ పరికరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వాయు కాలుష్యం లేదా రసాయన గ్యాస్ లీకేజీ వంటి ప్రమాదాలను ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలానికి ముందుగా జి ఐ ఎస్ ప్లాట్‌ఫారమ్‌ను సిద్ధం చేయడంతో పాటు, ఐ ఒ టి పరికరాలను వినియోగించి ఆన్‌లైన్ డేటాను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సిసోడియా మాట్లాడుతూ, విపత్తుల నిర్వహణలో డ్రోన్


విపత్తుల నిర్వహణలో అత్యాధునిక కమ్యూనికేషన్ పరికరాల కీలక వినియోగంపై ఆర్.పి సిసోడియా సమీక్ష

టెక్నాలజీని సమర్ధవంతంగా వినియోగించుకోవాలని, అవసరమైన డ్రోన్ పైలెట్లను ఎంపానల్ చేసి సిద్ధంగా ఉంచాలని సూచించారు. నైట్ విజన్ డ్రోన్ల ప్రాముఖ్యతను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రభుత్వం వాట్స్ అప్ ఆధారిత సేవలను అందుబాటులోకి తెచ్చిందని, అదే విధంగా విపత్తుల నిర్వహణలో వినియోగించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వాట్స్ అప్ ఆధారిత సమీకృత విపత్తుల నిర్వహణ వ్యవస్థను అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత విపత్తుల నిర్వహణ విధానాన్ని రూపొందించాలని, అందుకు అనుగుణంగా కార్యాచరణ సిద్ధం చేయాలని తెలిపారు. సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశంప్రపంచ బ్యాంకు నిధులతో అమలవుతున్న ఆంధ్రప్రదేశ్ డిజాస్టర్ రికవరీ ప్రాజెక్ట్ పరిధిలో కొనుగోలు చేసిన పరికరాలు, అందుబాటులో ఉన్నవి, ప్రస్తుతం వినియోగంలో ఉన్నవి అనే అంశాలపై పూర్తి స్థాయి నివేదిక అందించాలని సిసోడియా అధికారులను ఆదేశించారు. విపత్తుల నిర్వహణ కోసం ఇప్పటికే ఉన్న యాప్‌ను మరింత మెరుగుపరచాలని, కొత్త ఫీచర్లు జోడించి ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలని సూచించారు. విపత్తు సమయంలో ప్రజలకు తక్షణమే సమాచారం అందించేలా ఈ యాప్‌ను ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రొనంకి కుర్మనాథ్ పాల్గొని నిర్వహణ విధానాలను బలోపేతం చేసే దిశగా తన సూచనలు అందించారు.

## కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పరామర్శించిన కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి భువనేశ్వర్‌లోని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పరామర్శించారు. ఇటీ వలే ధర్మేంద్ర ప్రధాన్ తండ్రి, మాజీ కేంద్ర మంత్రి దేవేంద్ర ప్రధాన్ పరమపదించిన సంగతి తెలిసిందే. శనివారం భువనేశ్వర్‌లోని ప్రధాన్ నివాసంలో వారి తండ్రి చిత్రపటం వద్ద కిషన్ రెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ప్రధాన్‌తో పాటు వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ భారతీయ యువ మోర్చాలో పనిచేస్తున్న సమయంలో దేవేంద్రప్రధాన్ వంటి గొప్ప నేతతో కలిసి పనిచేసే అదృష్టం నాకు కలిగిందన్నారు. పార్టీ జాతీయ స్థాయి కార్యక్రమాల్లో వారిని నేరుగా కలిసే అవకాశం వచ్చేదని, ఈ సందర్భాల్లో వారి నుంచి చాలా అంశాలను నేర్చుకున్నానని అన్నారు. వారు గొప్ప మానవతావాది, సహృదయ నేత అన్నారు. కార్యకర్తలను మరీముఖ్యంగా యువ నాయకులను ఎప్పుడూ ప్రోత్సహించేవారని అన్నారు. వృత్తిరీత్యా డాక్టర్ అయిన దేవేంద్ర రాజకీయాల్లోనూ అంతే హుందాగా వ్యవహరించారన్నారు. అటల్ బిహారీ వాజపేయి కార్యక్రమాల్లో, ఎల్‌కే అద్వాణీ యాత్రల్లో దేవేంద్ర ప్రధాన్ కీలక పాత్ర పోషించేవారని అన్నారు. వివిధ కార్యక్రమాల్లో వారితోపాటు పాల్గొన్నందునే వారితో నాకు సత్సంబంధాలు ఏర్పడ్డాయి. అలాంటి గొప్ప వ్యక్తి మన నుంచి దూరం కావడం బాధాకరం అన్నారు. ఆయన కుమారుడు ధర్మేంద్ర ప్రధాన్, తాను కేంద్ర మంత్రి వర్గంలో పనిచేస్తున్నాం అన్నారు.

గతంలో మేమిద్దరం బిజేవైఎంలోనూ కలిసి పనిచేశామని, తెలంగాణ ప్రజల తరఫున, తెలంగాణ బిజెపి తరఫున దేవేంద్రప్రధాన్‌కు వినమ్ర శ్రద్ధాంజలి అర్పిస్తున్నాను అన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.

వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# మంచు పర్వతాలను కాపాడుకుంటేనే రేపటి తరానికి మంచినీరు లభ్యం
### ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ఇంజినీరింగ్ స్టాఫ్ట్ కాలేజీ ఆఫ్ ఇండియా సదస్సు

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** నీటి సంరక్షణలో చివరి మజిలీ గ్లేసియర్స్‌ను పరి రక్షిం చుకోవడమే అని ప్రొఫెసర్ పిజి శాస్త్రి అన్నారు. శనివారం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియాలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిజి.శాస్త్రి మాట్లాడుతూ మానవ నాగరికత నీటి దగ్గరే మొదలయిందని, పెరుగు తున్న జనాభా, గ్లోబల్ వార్మింగ్ వలన భూమి మీదున్న నీటి వనరులతో పాటుగా శతాబ్దాలుగా వున్న హిమానీ పర్వతాలు కూడా క్రమంగా కరిగిపోతున్నాయని, ఇవి కూడా అంతరిస్తే భూమిమీద జీవజాలం ఉండదన్నారు. దక్షిణ భారతంలోని చెరువుల్లో వాటి విస్తీర్ణాన్ని బట్టి 25 శాతం నీళ్లు కూడా రావడం లేదని, హైదరాబాద్‌లో ట్యాంకర్లతో నీళ్లు కొనుక్కుం టున్నామన్నారు. రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ జంబుల్ రెడ్డి మాట్లాడుతూ షాద్‌నగర్ ప్రాంతంలో కొత్త ప్రాజక్టు నిర్మిస్తే హైదరాబాద్‌కు గ్రావిటీ ద్వారా నీళ్లు అందించవచ్చన్నారు. ఇనిస్టిట్యూట్ అఫ్ ఇంజనీర్స్ పూర్వ ఛైర్మెన్ డాక్టర్ నాగభూషణ రావు మాట్లాడుతూ వాతావరణ కాలుష్యానికి, భూతాపం పెరగడానికి, నీటి కొరతకు మనుషుల నిర్లక్ష్యమే అన్నారు. ఇనిస్టిట్యూట్ అఫ్ ఇంజనీర్స్ పూర్వ ప్రెసిడెంట్ జివిల్ రావు మాట్లాడుతూ నీటి పొదుపుపై కొన్నేళ్ల పాటు పక్కా కార్యాచరణ ప్రణాళిక అమలుచేయాలన్నారు.

ఇంజినీరింగ్ కాలేజ్ అఫ్ డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు మాట్లాడుతూ పంచభూతాల్లో భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన వీటిని కాపాడుకోవాల్సిన అవసరం కేవలం మనిషి ద్వారా మాత్రమే సాధ్యమని, యుగాలుగా మనవెంటే వున్న వీటిని సంరక్షించుకోవాల్సిన అవసరం వున్నదన్నారు. ప్రపంచంలో స్వచ్ఛమైన నీరు కేవలం హిమా లయ పర్వత ప్రాంతాల్లోని మంచు పర్వతాల్లో మాత్రమే దాగి వున్నాయి కాబట్టి, ప్రపంచ నీటి దినోత్సవం 2025 థీమ్ గ్లేసియర్ ప్రిజర్వేషన్ ద్వారా ప్రపంచానికి యునైటెడ్ నేషన్స్ ఒక హెచ్చరికను జారీ చేసిందన్నారు.

మెట్రో వాటర్ బోర్డు డైరెక్టర్ వి.ఎల్. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ గత వేసవికాలంలో ఎనిమిదిన్నర లక్షల వాటర్ ట్యాంకర్లను సప్లై చేస్తే, ఈ ఏడాది వేసవి మొదట్లోనే ఇప్పటికే నాలుగున్నర లక్షల ట్యాంకర్లను రవాణా చేశామన్నారు. హైదరాబాద్ నగరానికి రోజుకు 550 మిలియన్ గ్యాలన్ల నీటిని సప్లై చేస్తున్నామని, విలువైన ఈ మంచి నీటిని ప్రజలు పొదుపుగా వాడుకోవాలన్నారు.

# ట్రేడింగ్ ఫ్రాడ్‌లో 23 కేసుల నేరగాడి అరెస్టు

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** సైబర్ నేరాల పట్ల అందరు అప్రమత్తంగా వుండాలని పోలీసులు ఎంత చెబుతున్నా మోసపోతున్న వారి సంఖ్య ఆగడం లేదు. తాజాగా సికింద్రాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఏకంగా కోటీ 22 లక్షల రూపాయలకు పైగా ట్రేడింగ్ ఫ్రాడ్ సైబర్ నేరంలో పోగొట్టుకోగా దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఈ నేరానికి పాల్పడ్డ ముఠా లో ఒక నేరగాడిని అరెస్టు చేశాడు. ఈ నేరగాడు ఇటువంటివి 23 నేరాలు చేసినట్లు తేలింది. దీనికి స ంబంధించిన వివరాలను సైబర్ క్రైం డిసిపి కవిత శనివారం మీడియాకు వెల్లడించారు. సికింద్రాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి టెలిగ్రాం ద్వారా వచ్చిన ఓ మెయిల్‌లో ట్రేడి ంగ్ వ్యవహారాల గురించి వుంది. ఇందులో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలంటూ వివరాలు వుండడంతో సదరు వ్యక్తి ఆకర్షితుడయ్యాడు. అనంతరం టెలిగ్రాంలో ని వివరాల ఆధారంగా కొంత మొత్తం పెట్టుబడులు పెట్టగా లాభాలు వచ్చాయి. దీంతో అతడు ఆశపడి ఈసారి ఏకంగా కోటీ 22 లక్షల 87 వేల 120 రూపాయలు పెట్టుబడిగా పెట్టాడు. ఈసారి లాభాలు రాకపోగా మరింత పెట్టుబడి పెట్టాలని సైబర్ నేరగాడు డిమాండ్ చేశాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితు డు దీనిపై సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు రంగంలో దిగిన సైబర్ క్రైం పోలీసులు దీనిపై విచారించగా ఈ నేరానికి పాల్పడింది ఉత్తర ప్రదేశ్‌లోని దీపక్ కుమార్ ముఠాగా తేలింది. ఇతని ముఠాలో అంకిత్ అరోరా (38) సెకండ్ లీడర్‌గా వున్నాడు. మోసాలకు పాల్పడే క్రమంలో దీపక్ కుమార్‌కు అరో రా మ్యూల్ బ్యాంకు ఖాతాలు ఇస్తుంటాడు. సికింద్రాబాద్ వాసిని మోసం చేసిన కేసులో అంకిత్ అరోరా సమకూర్చిన బ్యాంకు ఖాతాలోనే బాధితుడి నగదు జమా అ య్యింది. అరోరా మొత్తం 23 కేసుల్లో నిందితుడు కాగా ఇతను సమకూర్చిన బ్యాంకు ఖాతాలలో ఆరు కోట్ల రూపాయల లావాదేవీలు జరిగాయని తేలింది.

# విపక్షాల వాకౌట్ బాధాకరం

## దేవుడు అందరివాడు.. మేమూ పూజలు చేస్తాం: మంత్రి శ్రీధర్‌బాబు

## అసెంబ్లీలో ప్రశాంత్‌రెడ్డి, హరీశ్‌రావు, మంత్రి కోమటిరెడ్డి వాగ్వాదం

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** 'ప్రశాంత్‌రెడ్డికి యజ్ఞ యాగాలు మాత్రమే తెలుసని, లోక్‌సభ సభ్యుడిగా పరిచయాలు ఉండటంతో సిఆర్ఎఫ్ నిధులతో పాటు జాతీయరహదారులను అనేకం సాధించాం' అంటూ ఆర్అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలతో బిఆర్ఎస్ సభ్యులు మనస్తాపానికి గురై శనివారం సభనుంచి వాకౌట్ చేశారు. శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపక్షాల వాకౌట్ చేయడం బాధాకరమని, దేవుడు అందరివాడని మేం కూడా పూజలు చేస్తామని ఆర్అండ్‌బి మంత్రి ఇచ్చిన సమాధానంతో సంతృప్తి చెందకుండా సభనుంచి వెళ్లడం తగదని అన్నారు. మాజీమంత్రి హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి.. ఆర్అండ్‌బి మంత్రి అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా ఇతర విషయాలను ప్రస్తావించారని మండిపడ్డారు. బిఆర్ఎస్ హయాంలో వేసిన రోడ్లు స్పీకర్ సమక్షంలో పెట్టాలని ప్రతిపక్షనాయకులు డిమాండ్ చేశారు. ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నోత్తరాల సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో 50 యేళ్లలో 6,093 కి.మీ డబుల్‌రోడ్లు వేయగా పదేళ్లలో 8,672 డబుల్‌రోడ్లు వేశామని తెలిపారు. మా హయాంలో గుంతలమయం అయిందని అసత్య ప్రచారం చేయడం తగదని ఆయన అన్నారు. నాలుగులైన్ల రోడ్లు 2014 వరకు 669 కిమీ రాష్ట్రంలో ఉంటే గత పదేళ్లలో 485 కి.మీలకు పెంచామని ఆయన తెలిపారు. రాష్ట్రంలో 1,154 కి.మీ నిడివితో నాలుగులైన్ల రోడ్లు ఉందని తెలిపారు. హరీశ్‌రావు మాట్లాడుతూ హామ్ రోడ్లపై ఆర్థికమంత్రి 60శాతం ప్రైవేట్ అంటారు .. ఆర్అండ్‌బి మంత్రి 60 శాతం ప్రభుత్వం అంటారు.. ఇంతకు ఏది కరెక్టు అని ఆయన ప్రశ్నించారు. రూ. 27వేల కి.మీ రోడ్లు అభివృద్ధి చేయబోతున్నారు. రూ.11,200 కోట్లను ప్రభుత్వం భరిస్తోంది. 17,800 కోట్ల రుణాలు ఎఫ్ఆర్‌బిఎం పరిధిలో ఉంటుందా అని ప్రశ్నించారు. ఆర్అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సుదీర్ఘమైన సమాధానం ఇవ్వడమే కాకుండా యజ్ఞయాగాలను యాగాలు అంటూ వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. పబ్లిక్ ప్రైవేట్ పార్టిసిపేట్ మోడల్ లో రోడ్ల నిర్మాణ ప్రతిపాదనలు లేవు కేవలం వందశాతం ప్రభుత్వం చెల్లించే హ్యామ్ అనేది ప్రభుత్వం విధానం అని తెలిపారు. ప్రస్తుతం హ్యామ్ రోడ్ల నిర్మాణంపై ఆలోచన చేస్తున్నాం. హ్యామ్ మోడల్ ను 2016 ఎన్‌హెచ్‌ఏఐ ప్రారంభించింది అని వెంకటరెడ్డి వివరణ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జిహెచ్ఎంసిలో రోడ్లు నిర్మించేందుకు సేమ్ హెచ్ఎంఎం మోడల్ లాంటి కాంప్రహెన్సివ్ రోడ్ మేనేజ్ మెంట్ ప్రోగ్రాంలో రోడ్లను నిర్మించారని మంత్రి తెలిపారు.

గత ప్రభుత్వం రూ. 8,112 కోట్లతో 10 ఏండ్లలో 6668 కిలోమీటర్ల రోడ్లను మాత్రమే రిపేర్లు చేపట్టగలిగిందని ఆయన అన్నారు.. దీని కోసం రాష్ట్ర బడ్జెట్ నుంచి 3945 కోట్లతోపాటు 4167 కోట్ల రూపాయలు ఆర్ డి సి ద్వారా లోన్ తీసుకొని రోడ్లను నిర్మించారని తెలిపారు. ఆ లోన్ కూడా మేమే కడుతున్నాం.మేం రూపాయి లోన్ తీసుకోకుండా రోడ్లను నిర్మిస్తున్నాం అని అన్నారు. మా ప్రభుత్వం వచ్చిన సంవత్సరంలోనే మేము 4 వేల కోట్ల రూపాయల మంజూరీ లు ఇవ్వడం జరిగింది. మీరు పదేండ్లలో నిర్మించిన రోడ్లను మేం ఏడాది కాలంలోనే చేస్తున్నాయని వెంకటరెడి అన్నారు.. సిఆర్ఐఎఫ్ సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ తీసుకురావడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిరక్ష్యం చేసింది. మేం వచ్చిన తర్వాత 850 కోట్ల రూపాయలను సి ఆర్ ఐఎఫ్ క్రింద తీసుకొచ్చాను. దీంతో, దీంతో 435 కిలోమీటర్ల రోడ్లను నిర్మిస్తున్నాం. మేం, ఒఆర్ఆర్ కట్టినం, పీవీ నర్సింహారావు ఎక్స్ ప్రెస్ వే కట్టినం, ఎయిర్ పోర్ట్ పూర్తి చేసినం, వరల్డ్ క్లాస్ మెట్రో నిర్మించాం అని గుర్తుచేసుకొన్నారు. 2017 లో ఉప్పల్ ఎలివేటర్ కారిడార్ కు గెజిట్ వచ్చిన బిఆర్ఎస్ నిర్మించలేదు. రీజినల్ రింగ్ రోడ్డు కొరకు డిప్యూటీ సీఎం 1525 కోట్లు నిధులు ఇచ్చారు. 18 నెలల్లో ఉప్పల్ ఎలివేటర్ కారిడార్ పూర్తి చేస్తు న్నాం. ప్రశాంత్‌రెడ్డి నల్గొండకు రూ.200 కోట్లు రోడ్ల నిర్మానానికి ఇచ్చిన అంటున్నారు. వాటి ఆనవాళ్లు చూపితే ప్రశాంత్‌రెడ్డికి సన్మానం చేస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. హ్యామ్‌లో యేడాదికి రెండు లేదా మూడు ఫేజ్ లో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ పనులు పూర్తి





చేస్తున్నామని అన్నారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం ఫోర్‌క్లోజ్ చేస్తే పనులు ఆలస్యం అవుతుందని కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని రిక్వెస్ట్ చేశా.. నానా కష్టాలు పడ్డా. ఇవ్వాల పనులు ప్రారంభం కాబోతున్నాయన్నారు. ప్రశాంత్‌రెడ్డి పనులు సెక్రటరియేట్ కట్టాలి, ప్రగతిభవన్, ఫామ్ హోజ్‌లో చండీయాగాలు, యోగాలు యజ్ఞాలు చెయ్యాలాయే .. నా పని అది కాదు.. బ్రిడ్జిలు, రోడ్లు కట్టడం నా పని అధ్యక్షా అని కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మా ప్రథమ ప్రాధాన్యం ప్రజలకు మంచిరోడ్లు, రవాణా సౌకర్యం ఇవ్వడమేనని ఆయన తెలిపారు.



జువెనైల్ హోమ్‌లో డ్రగ్స్ డీఅడిక్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

# డ్రగ్స్, గంజాయి నిర్మూలన అందరి బాధ్యత

## మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్ (సైదాబాద్), మార్చి 22, ప్రభాతవార్త:** సైదాబాద్‌లోని జువెనైల్ హోమ్‌లో ఏర్పాటు చేసిన డ్రగ్స్ డీఅడిక్షన్ సెంటర్‌ను మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క శనివారం స్థానిక కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. డ్రగ్స్ మహమ్మారి వల్ల కలిగే నష్టాల గురించి హోమ్స్‌లోని బాలలకు అవగాహన కల్పించి, డ్రగ్స్ నివారణకు చర్యలు తీసుకోవడానికి ఈ సెంటర్‌ను వినియోగించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి మత్తుకు అలవాటుపడి నేరబాట పట్టిన బాలలను సన్మార్గంలో నడిపించడానికి పైలెట్ ప్రాజెక్ట్ కింద రాష్ట్రంలోనే మొదటిసారిగా డీఅడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. మాదకద్రవ్యాలకు బానిసైన పిల్లలకు కౌన్సెలింగ్, వైద్య చికిత్స, ఇతర అనేకరకాలైన సేవలను మానసికవైద్యుల ద్వారా ఇక్కడ అందిస్తారన్నారు. తెలంగాణను డ్రగ్స్‌రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న సిఎం రేవంత్‌రెడ్డి కలను సాకారం చేసేలా ముందుకు వెళ్తున్నామని అన్నారు. డీఅడిక్షన్ సెంటర్ నిర్వహణ కోసం దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ సాధికారత శాఖ ద్వారా రూ.13.80 లక్షలు మంజూరు చేశామన్నారు.

# రేపటి నుంచి ఆర్‌జెసి సెట్-2025 దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని విద్యాశాఖ అధ్వర్యంలో కొనసాగుతున్న రెసిడెన్షియల్ జూనియర్ కాలేజెస్‌లో ప్రవేశాల కోసం నిర్వహించే టిజిఆర్‌జెసి సెట్-2025 దరఖాస్తులను రేపటి(సోమవారం మార్చి 24) నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను నేడు(ఆదివారం) జారీ చేయనున్నారు. మే 10న పరీక్షను నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని 35 రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి ఈ నెల 24 నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. దరఖాస్తులను ఏప్రిల్ 23 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపులను ఇంగ్లీష్ మీడియంలో చదవాలనుకునేవారు https://tgrjc.cgg.gov.in/TGRJDCWEB20/#!/home0103prsvdf.rps ఆ వెబ్‌సైట్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సంస్థ తెలిపింది. మరిన్ని వివరాలకు 040-24734899 నంబరుకు ఫోన్ చేయాలని సంస్థ పేర్కొంది. రాష్ట్ర వ్యాప్తంగా 35 జూనియర్ కాలేజీలు ఉండగా.. వాటిలో బాలురకు 15, బాలికలకు 20 గురుకుల జూనియర్ కాలేజీలు కొనసాగుతున్నాయి. రెసిడెన్షియల్ కాలేజీల్లో ప్రవేశాలకు ప్రస్తుతం 10వ తరగతి వార్షిక పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫీజు రూ.200 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి.




రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పి.సురేష్. చిత్రంలో వి.ఎస్.బోస్ తదితరులు


# ప్రజావ్యతిరేక పోస్టల్ యాక్ట్‌ను తక్షణమే రద్దు చేయాలి

## పోస్టల్ ఉద్యోగుల రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), మార్చి 22, ప్రభాతవార్త:** పోస్టల్ శాఖను ప్రైవేటికరించి ప్రైవేటు కొరియర్ సర్వీసులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక 'పోస్టల్ యాక్ట్'ను రద్దు చేయాలని శనివారం నాడిక్కడ జరిగిన పోస్టల్ ఉద్యోగుల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ, కార్మిక కాన్ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు పి.సురేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పోస్టల్ సర్వీసెస్ బిల్లు వల్ల తపాలా రంగంలో పనిచేస్తున్న నాలుగున్నర లక్షల మంది ఉద్యోగుల ప్రాథమిక హక్కులు నిర్వీర్యం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులను సామూహికంగా తొలగించడం లేదా విఆర్ఎస్‌తో బలవంతంగా పంపడానికి ఈ బిల్లు వీలు కల్పిస్తుందన్నారు. అంతేకాకుండా మూడు లక్షల మంది గ్రామీణ సేవక్‌ల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందని, ప్రైవేటు రంగంలోకి పోస్టల్ సర్వీసులు తరలిపోతే సామాన్య ప్రజలకు పోస్టల్ సేవలు ఖరీదైనవిగా మారుతాయని, పోస్టల్ ఉద్యోగ, కార్మిక సంఘాలతోగాని పార్లమెంట్‌లో ఏలాంటి చర్చలు లేకుండా ఈ చట్టం తీసుకురావడం దుర్మార్గమన్నారు. తక్షణమే పోస్టల్ యాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పోస్టల్ ఉద్యోగులు సంఘటితంగా దేశవ్యాప్తంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో ఎఐటియుసి సీనియర్ నాయకులు వి.ఎస్. బోస్, అఖిల భారత పోస్టల్ అండ్ ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.జలాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సు ఢీకొని అడిషనల్ ఎస్పీ మృతి

**హైదరాబాద్ (హయత్‌నగర్), మార్చి 22, ప్రభాతవార్త:** రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని అడిషనల్ ఎస్పీ దుర్మరణం పాలైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. పెద్దఅంబర్‌పేట మున్సి పాలిటీ లక్ష్మారెడ్డి పాలెంలోని మైత్రి కుటీర్ లో నివాసముండే టి.ఎం. నందీశ్వర్ బాబ్జీ(50) డిజిపి కార్యాలయంలో అద నపుఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన శనివారం తెల్లవారు జామున మార్నింగ్ వాకింగ్ చేస్తూ హనుమాన్ దేవాలయం సమీపంలో రోడ్డు దాటు తుండగా... విజయవాడ వైపు నుంచి వచ్చిన ఏపీఎస్ఆర్టీసీ నూజివీడు డిపోకు చెందిన బస్సు అతన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాబ్జీ అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన ఇటీవలే అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందినట్లు సమాచారం. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు, ఇతర పోలీసు అధికారులు బాబ్జీ ఇంటికి చేరుకుని ఆయన మృతదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు.



నందీశ్వర్‌బాబ్జీ (ఫైల్)

# ఆవేశపడకండి.. చర్చించుకొందాం

## ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

## ప్రోటోకాల్ విషయంలో పైడి రాకేష్‌రెడ్డికి బాసటగా బిఆర్ఎస్

## బిఆర్ఎస్ ఎమ్మెల్యే రన్నింగ్ కామెంటరీపై స్పీకర్ ఆగ్రహం



**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** ఆవేశపడ కండి.. మైక్ దొరకగానే ఆవేశపడితే ఎట్లా అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిని మందలించారు. అసెంబ్లీలో జీరో అవర్‌లో ప్రోటోకాల్ విషయంలో ఆయనకు జరుగుతున్న అవమానం సభ దృష్టికి తీసుకొచ్చి మీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రక్తమరుగుతుందా? ఓడిపోయిన అభ్యర్థిని తీసుకొచ్చి పలు కార్యక్రమాలకు శంకుస్థాపనలు అధికారులు చేయిస్తుంటే మాకు రక్తం మరుగదా అని అంటూ ఆయన నిలదీశారు. అసెంబ్లీలో ఓటమిపాలైన వారిని కూడా తీసుకొచ్చి కూర్చో బెట్టండి అని ఆయన అన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్ర మార్క మాట్లాడుతూ ఆవేశంతో వూగిపోతే మావైపు కూడా ఆవేశంతో వూగిపోయేవారు ఉన్నారు. పరిష్కారం కనుక్కొందాం. చర్చించుకొందాం అంటూ భట్టి విక్రమార్క అనడంతో ఓవైపు ప్రశాంత్‌రెడ్డి, మరోవైపు పల్లారాజేశ్వర్‌రెడ్డి కూడా అభ్యర్థి ఓటమిపాలైనవారిని కూడా తీసుకొచ్చి అసెంబ్లీలో కూర్చోపెట్టుమంటున్నారు కదా అంటూ రన్నింగ్ కామెంటరీ చేశారు. దీనితో స్పీకర్ ప్రసాద్‌కుమార్ కలుగ జేసుకొని ప్రతి విషయంలో బిఆర్ఎస్ వాళ్లు కలగజేసుకోవడం ఎక్కువైంది. ఇది సభలో మంచి పద్ధతికాదు అంటూ స్పీకర్ అన్నారు. బిజెపి ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పాల్వాయి, హరీశ్‌రావు, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేలను పాయల్ శంకర్‌ను రాకేష్‌రెడ్డికి బాసటగా ఆందోళన చేయడానికి ప్రశాంత్‌రెడ్డి సూచనలు చేసినా ఎవ్వరు స్పందించలేదు. మొత్తానికి పైడిరాకేష్‌రెడ్డి ఒంటరిగా తన ఘోషను సభలో వెల్లగక్కుకున్నారు.

# రూ.15వేల కోట్ల పెట్టుబడితో టూరిజం విధానం

## మూడు లక్షల మందికి ఉపాధి: మంత్రి జూపల్లి

**హైదరాబాద్, మార్చి 22,ప్రభాతవార్త:** తెలంగాణలో 15వేల కోట్ల పెట్టుబడితో టూరిజం విధానం త్వరలో ఏర్పాటు చేయబోతున్నామని దీనివల్ల సుమారు 3లక్షల మందికి ఉపాధి లభిస్తుందని పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. అసెంబ్లీలో ఆయన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, పటోళ్ళ సంజీవరెడ్డి, ఆదిశ్రీనివాస్,కూనేని సాంబశివరావు,భూపతిరెడ్డి అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. నది పరివాహాక ప్రాంతాలలో ముఖ్యంగా కృష్ణాగోదావరి దాని ఉపనదులు ఉన్న ఏరియాల్లో పర్యాటకరంగం అభివృద్ధిచేస్తామని తెలిపారు. శ్రీపాద ఎల్లంపల్లిలో బోటింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కిన్నరసాని ప్రాజెక్టు,ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ స్థలం పర్యాటకంగా అభివృద్ధికోసం కూనంనేని సాంబశివరావు, భూపతిరెడ్డి ప్రతిపాదనలు చేశారు. కోటుపల్లి ప్రాజెక్టు వద్ద రక్షకచర్యలు చేపట్టాలని కోరారు. సంజీవరెడ్డి సంగమేశ్వరటెంపుల్ అభివృద్ధిని కోరారు. మక్కాన్‌సింగ్ మైనింగ్ టూరిజం కావాలని అన్నారు.



బిసి సంఘాల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి ఆర్. కృష్ణయ్య, చిత్రంలో గుజ్జ సత్యం, గుజ్జ కృష్ణ తదితరులు

# బిసి రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి కేంద్రంపై ఒత్తిడి తేవాలి

## జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లుపెట్టి ఆమోదింప చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి బీసీ కుల సంఘాల ప్రతినిధుల సమావేశం కృతజ్ఞతలు తెలియజేసింది. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన శనివారం నగరంలో 18 బీసీ కుల సంఘాల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు. ఇది బీసీల సమష్టి పోరాట కృషి ఫలితమేనని ఆయన అన్నారు. బీసీ బిల్లు పార్లమెంట్లో ప్రవేశపెట్టి దీన్ని 9వ షెడ్యూల్లో పొందుపరిస్తే తప్ప న్యాయపరమైన ఇబ్బందులు ఉండవని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి అక్కడే ఉండి ఈ బిల్లు పార్లమెంట్లో పాస్ అయ్యేంత వరకు కృషి చేయాలని కోరారు. జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు.ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# 19 కేంద్రాల్లో ప్రారంభమైన ఇంటర్ మూల్యాంకనం

## నాలుగు విడతల్లో కొనసాగనున్న స్పాట్ వాల్యుయేషన్

## మూల్యాంకన కేంద్రాల్లో బయోమెట్రిక్ హాజరు

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 5 నుంచి ప్రారంభమైన ఇంటర్ వార్షిక పరీక్షలకి సంబంధించిన ప్రధాన పరీక్షలు ఈ నెల 20తో ముగిశాయి.. దీంతో జవాబు పత్రాల మూల్యాంకనం శనివారం నుంచి ప్రారంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగా 19 కేంద్రాల్లో మూల్యాంకనాన్ని నిర్వహిస్తున్నారు. మొదటిసారిగా మూల్యాంక కేంద్రాల్లో సిబ్బందికి ఆధార్ బయోమెట్రిక్‌ను అటెండెన్స్‌ను అమలు చేస్తున్నారు. ఈ నెల 28 వరకు నాలుగు విడతల్లో లాంగ్వేజెస్‌తోపాటు సబ్జెక్టుల మూల్యాంకనను కొనసాగించనున్నారు. గత ఏడాది 17 కేంద్రాల్లో మూల్యాంకనం జరగగా.. ఈ ఏడాది అదనంగా వరంగల్, మెదక్‌లోనూ మూల్యాంకన కేంద్రాలను ఏర్పాటు చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా 19 కేంద్రాల్లో మూల్యాంకనం కొనసాగతుంది. ఈ నెల 10 నుంచే సంస్కృతం మూల్యాంకనం ప్రారంభమైన విషయం తెలిసిందే. మొదటి విడతలో ఇంగ్లీష్, తెలుగు, హిందీ పేపర్-1, 2తోపాటు గణితం, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభిస్తారు. రెండో విడత ఈ నెల 24 నుంచి ఫిజిక్స్, ఎకనామిక్స్, మూడో విడత 26 నుంచి ప్రారంభం కానుండగా.. మూడో విడతలో కెమిస్ట్రీ, కామర్స్ సబ్జెక్టులు.. ఇక చివరి విడతగా ఈ నెల 28న నాలుగో విడతలో హిస్టరీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభం కానుంది. మొత్తం ఇంటర్ పరీక్షలకు 9.96,971 మంది పరీక్ష ఫీజు చెల్లించగా.. మొత్తంగా 97 శాతానికిపైగా విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ నెల 25తో ఒకేషనల్, బ్రిడ్జికోర్సులకు సంబంధించిన పరీక్షలు కూడా ముగియనున్నాయి. మూల్యాంకనాన్ని ఏప్రిల్ రెండో వారంలోగా ముగించి.. ఏప్రిల్ నెలాఖరులో ఫలితాలను విడుదల చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# బిసి బిల్లుకు కోర్టులో చిక్కులు లేకుండా చూడాలి

## డీలిమిటేషన్ జరిగితే కొమురవెల్లి ప్రాంతం నియోజకవర్గంగా ఏర్పడుతుంది: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**కొమురవెల్లి, మార్చి 22, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం కేవలం చట్టసభల్లో బిసి బిల్లు ప్రవేశపెట్టడం కాకుండా కోర్టులో ఎలాంటి చిక్కులు లేకుండా జాగ్రత్త పడాలని తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలోని శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామిని భారీ కాన్వాయ్‌తో వచ్చి దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం స్వామివారికి పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిసిల హక్కుల సాధన కోసం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన మొదటి రౌండ్‌టేబుల్ సమావేశంలో మొక్కిన మొక్కును బిల్లు సాధించిన సందర్భంగా మల్లికార్జునస్వామిని దర్శిం చుకొని చెల్లిం చుకున్నట్లు తెలిపారు. అసెంబ్లీ ఆవరణలో జ్యోతి రావుపూలే విగ్ర హాన్ని ఏర్పాటు చేయా లన్నారు.

గత ప్రభుత్వ హయాంలో కొమురవెల్లి మల్లన్న ఆలయం వద్ద జరుగుతున్న అభివృద్ధియే నిదర్శనమన్నారు. తెలం గాణ రాష్ట్రానికే తలమానికంగా ఉన్న మల్లన్నసాగర్ రిజర్వా యర్‌కు మల్లన్న పేరు పెట్టామని వివరించారు. రాబోయే రోజుల్లో డీలిమిటేషన్ జరిగితే కొమురవెల్లి ప్రాంతం తిరిగి నియోజకవర్గంగా ఏర్పుడుతుందన్నారు. మల్లన్నస్వామి దయతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నారు. తెలంగాణ జాగృతి నాయకుల పోరాట ఫలితంగానే విద్య, ఉద్యోగాల్లో ఒక బిల్లు, రాజకీయంగా ఒక బిల్లు ప్రవేశపెట్టారని పేర్కొన్నారు.



స్వామివారికి పట్నంవేసి మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్సీ కవిత

# టెన్త్ పరీక్షలు రాసివస్తున్న విద్యార్థిని ప్రమాదంలో మృతి

## గచ్చిబౌలి ఫ్లైఓవర్‌పై దుర్ఘటన

## గాయపడిన సోదరుడు



ప్రభాతి ఛత్రియా(ఫైల్)

**హైదరాబాద్ (గచ్చిబౌలి), మార్చి 22, ప్రభాతవార్త:** గచ్చిబౌలి ఫ్లైఓవర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పదోతరగతి పరీక్ష రాసి సోదరుడితో కలిసి ఇంటికి వస్తున్న విద్యార్థిని బస్సు ఢీకొన్న ప్రమాదంలో ప్రాణాలు విడిచింది. ద్విచక్రవాహనంపై వస్తున్న వీరిని, గచ్చిబౌలి ఫ్లైఓవర్ మీద వేగంగా వెనుక నుంచి వచ్చిన హెచ్‌ఎండిఏ ఎలక్ట్రికల్ బస్సు ఢీకొట్టింది. రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. గచ్చిబౌలిలోని టిఎన్‌జిఒ కాలనీలో పెనుదాస్ చత్రియా, సబితా చత్రియాలు తమ కుమారుడు సుమన్ ఛత్రియా, కుమార్తె ప్రభాతి ఛత్రియా(16)తో కలిసి నివాసం ఉంటున్నారు. శనివారం ప్రభాతి ఛత్రియాను పదో తరగతి పరీక్ష రాయడానికి ఆమె సోదరుడు సుమన్ రాయదుర్గంలోని పరీక్ష సెంటర్ వద్ద వదిలాడు. పరీక్ష రాశాక తన సోదరి ప్రభాతితో కలిసి స్కూటీపై ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యంలో గచ్చిబౌలి ఫ్లైఓవర్ మీదకు వచ్చిన వీరి ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి వేగంగా దూసుకువచ్చిన హెచ్‌ఎండిఏ డబుల్ డెక్కర్ ఎలక్ట్రికల్ ఫ్రీ బస్సు(టిఎస్09 యుఈ0491) ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుమన్ ఎడమవైపు, ప్రభాతి ఛత్రియా కుడివైపు పడిపోయారు. కాగా బస్సు వెనుక చక్రం ప్రభాతిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందగా, సుమన్ స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని విద్యార్థిని ప్రభాతి మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. డబుల్ డెక్కర్ బస్సును, డ్రైవర్ బలరాంను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# వేవ్స్ 2025 పోటీలకు ఆహ్వానం

## ప్రధాని క్రియేట్ ఇండియాలో ప్రతిభకు స్వాగతం

## తెలంగాణ విఎఫ్‌ఎక్స్ యానిమేషన్ గేమింగ్ అసోసియేషన్ వెల్లడి

**హైదరాబాద్, మార్చి 22:** వర్చువల్ సినిమాటిక్ స్టోరీ టెల్లింగ్ పరిధిని పెంచటం, వీఎఫ్‌ఎక్స్ యాని మేషన్, గేమింగ్ పరిశ్రమ నుంచి అగ్రస్థానాల్లో ఉన్న ప్రతిభావంతులను ఏకతాటిపైకి తీసుకురావాలనే లక్ష్యంగా ప్రధానమంత్రి మోదీ క్రియేట్ ఇన్ ఇండియా కార్యక్రమానికి అనుగుణంగా పోటీలు నిర్వహిస్తున్నారు. స్వదేశీ డిజిటల్ కంటెంట్ సృష్టిని ప్రోత్సహించడం, స్వదేశీ ప్రతిభను సాధికారత కల్పించటం ద్వారా వీఎఫ్‌ఎక్స్, యానిమేషన్‌కు సంబంధించి భారత్ స్థానాన్ని ఈ పోటీ బలోపేతం చేయనుంది. ఈనెల 17నుంచే దరఖాస్తులను ఆహ్వానించిన ఈసంస్థ ఏప్రిల్ ఒకటవ తేదీ ముంబయి సదస్సులో ప్రపంచ దృశ్య శ్రవణ వినోద సదస్సు వేవ్స్ 2025లో అన్‌రియల్ సినిమాటిక్ ఛాలెంజ్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ వీఎఫ్‌ఎక్స్, యానిమేషన్, గేమింగ్ అసోసియేషన్ ప్రకటించింది. అన్‌రియల్ సినిమాటిక్ ఛాలెంజ్‌లో వృత్తినిపుణులు, విద్యార్థులను అన్‌రియల్ ఇంజిన్ అనే సాఫ్ట్‌వేర్ ఉపయోగించి అద్భుతమైన సినిమాటిక్ సన్నివేశాలను రూపొందించాలి. తద్వారా సృజనాత్మకతను ప్రోత్సహించటమే కాకుండా సృష్టికర్తలు వారి నైపుణ్యాలను ప్రదర్శించడానికి ఒక వేదికను అందిస్తోంది. పాల్గొనేవారికి 10 సెకన్ల ప్రాథమిక యానిమేషన్ సన్నివేశాలను ఇస్తారు. ఇందులోని కెమెరా యానిమేషన్‌ని అలాగే ఉంచుతూ అవాస్తవ ఇంజిన్ సీక్వెన్సర్ ఉపయోగించి దీనిని మెరుగుపరచాలి. పాల్గొనేవారు వారి స్వంత పాత్రలను పరిచయం చేయొచ్చు కానీ ఇచ్చిన పరిమితులకు కట్టుబడి ఉండాలి. అవాస్తవ ఇంజిన్ వ్యూపోర్ట్ స్క్రీన్ షాట్‌తో పాటు అంతిమంగా వచ్చిన యానిమేషన్ వీడియోను పరిశ్రమ నిపుణులతో కూడిన బృందం మదింపు చేస్తుంది. ఫైనల్‌కు విద్యార్థులు, వృత్తి నిపుణులను సమానంగా ఎంపికచేస్తారు. ముంబయిలోని వేవ్స్ 2025కు పూర్తి ఉచితమైన పర్యటనను వీరంతా అందుకుంటారు. అక్కడ వారు ప్రత్యక్షంగా పాల్గొంటారు. 8 గంటల ఛాలెంజ్‌లో సినిమాటిక్ సన్నివేశాలను ప్రత్యక్షంగా తయారుచేస్తారు. వీళ్ల తయారు చేసిన యానిమేషన్స్ ప్రముఖ మీడియా, వినోద రంగ నిపుణుల బృందం మదింపు చేస్తుందని టివిఎజిఎ ప్రకటించింది.



## వరల్డ్ కప్ ఫుట్‌బాల్ టోర్నీకి..
# ఒక్క విజయం దూరంలో
### న్యూజిలాండ్, న్యూ కాలడోనియా అర్హత

**న్యూఢిల్లీ:** వచ్చే ఏడాది జరిగే ప్రపంచ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు అర్హత సాధించేందుకు న్యూజిలాండ్, న్యూ కాలడోనియా జట్లు ఒక్క విజయం దూరంలో నిలిచాయి. ఓసియానియా జోన్ క్వాలిఫయింగ్ టోర్నీలో ఈ రెండు జట్లు ఫైనల్‌కు దూసుకెళ్లాయి. 24న ఈ జట్ల మధ్య జరిగేఫైనల్లో గెలిచిన జట్టు 2026 ప్రపంచ కప్ టోర్నీ బెర్తు అధికారికంగా ఖరారు చేసుకుంటుంది. వెల్లింగ్టన్‌లో జరిగిన సెమీఫైనల్లో న్యూజిలాండ్ 7-0 గోల్స్ తేడాతో ఫిజీ జట్టుపై గెలుపొందగా, న్యూ కాలడోనియా జట్టు 3-0తో తాహితి జట్టును ఓడించింది. ఫిజీజట్టుతో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ తరఫున క్రిస్టోఫర్ వుడ్ (6వ, 56వ, 60వ నిమిషాల్లో) 3గోల్స్‌తో హ్యాట్రిక్ నమోదుచేశాడు. సర్‌ప్రీత్‌సింగ్ (16వ నిమిషంలో), టైలర్ గ్రాంట్‌బిండన్ (23వ నిమిషంలో), టిమోతీ జాన్ పేన్, బార్బరూసెస్ ఒక్కో గోల్ సాధించారు. తాహితి జట్టుతో జరిగిన మ్యాచ్‌లో న్యూ కాలడోనియా తరఫున జార్జెస్ గోప్ ఫెనెపెజ్ (50వ, 76వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా, లూయిస్ వాయా (90+1వ నిమిషంలో) ఒక గోల్ సాధించాడు. న్యూజిలాండ్ జట్టు ఇప్పటికి రెండుసార్లు (1982లో, 2010లో) ప్రపంచ కప్ ప్రధాన టోర్నీలో పోటీపడింది. మరోవైపు న్యూ కాలడోనియా జట్టు ఇప్పటివరకు ఒక్కసారికూడా ప్రపంచ కప్ టోర్నీకి అర్హత సాధించలేదు.




# భారత్ జట్టు కెప్టెన్‌గా యువరాజ్ సింగ్

**న్యూఢిల్లీ:** డాషింగ్ బ్యాటర్ యువరాజ్ సింగ్ భారత క్రికెట్ జట్టు కెప్టెన్‌గా మళ్లీ ఎంపికయ్యాడు. వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (డబ్ల్యూసిఎల్) రెండో ఎడిషన్ కోసం ఇండియా ఛాంపియన్స్ యాజమాన్యం యువరాజ్‌ను కెప్టెన్‌గా నియమించింది. యువరాజ్ సారథ్యంలో ఇండియా ఛాంపియన్స్ డబ్ల్యూసీఎల్ తొలి ఎడిషన్‌లో విజేతగా నిలిచింది. రెండో ఎడిషన్ డబ్ల్యూసీఎల్ ఈ ఏడాది జులై 18 నుంచి యునైటెడ్ కింగ్డమ్ వేదికగా జరుగనుంది. ఈ టోర్నీలో ఇండియా ఛాంపియన్స్ డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగుతుంది. డబ్ల్యూసీఎల్ మొదటి సీజన్లో భారత్‌తో పాటు, ఆస్ట్రేలియా, వెస్టిండీస్, ఇంగ్లండ్, పాకిస్తాన్, సౌతాఫ్రికా జట్లు పాల్గొనగా, ఫైనల్లో భారత్ పాకిస్తాన్‌ను చిత్తు చేసి ఛాంపియన్‌గా నిలిచింది. తొలి సీజన్లో భారత్ తరఫున యువరాజ్‌తో పాటు, సురేశ్ రైనా, రాబిన్ ఉతప్ప, ఇర్ఫాన్ పఠాన్, యూసఫ్ పఠాన్ మెరుపులు మెరిపించారు. ఇక ఈ సీజన్లో భారత జట్టులో మరో స్టార్ కూడా చేరనున్నాడు. టీమిండియా మాజీ ఓపెనర్ శిఖర్ ధవన్ ఈ సీజన్లో ఇండియా ఛాంపియన్స్‌తో జతకట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాడు. కాగా డబ్ల్యూసీఎల్‌లో ఇండియా ఛాంపియన్స్‌కు సుమంత్ బల్, సల్మాన్ అహ్మద్, జస్పాల్ బహ్రా ఓనర్లు వ్యవహరిస్తున్నారు. అంతర్జాతీయ వేదికపై మెరిసిన పలువురు స్టార్ క్రికెటర్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నారు. కాగా, డబ్ల్యూసీఎల్ రెండో సీజన్‌లో పాకిస్తాన్‌కు కొత్త సారథి వచ్చాడు. ఈ సీజన్ కోసం పాక్ ఛాంపియన్స్ యాజమ్యానం సర్ఫరాజ్ అహ్మద్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేసింది. ఈ వెటరన్ వికెట్ కీపర్ 2023 నుంచి కాంపిటేటివ్ క్రికెట్‌కు దూరంగా ఉంటున్నాడు. సర్ఫరాజ్ చేరిక పాకిస్తాన్ ఛాంపియన్స్‌కు బూస్టప్ ఇస్తుంది. గత సీజన్ పాక్‌కు యూనిస్ ఖాన్ కెప్టెన్‌గా వ్యవహరించగా, మిస్బా ఉల్ హక్, షాహిద్ అఫ్రిది, షోయబ్ మాలిక్, మహ్మద్ హఫీజ్, అబ్దు ల్ రజాక్, కమ్రాన్ అక్మల్, వాహబ్ రియాజ్, సోహైల్ తన్వీర్, సయీద్ అజ్మల్ లాంటి స్టార్లు ప్రాతినిథ్యం వహించారు.



## వరల్డ్ బ్యాడ్మింటన్ టోర్నీలో..
## వరల్డ్ 2పై శంకర్ పెను
# సంచలనం
### సెమీస్‌లో గాయత్రి-ట్రెసా జోడీ

**న్యూఢిల్లీ:** స్విస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింట్ టోర్నమెంట్‌లో భారత యువతార శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్ పెను సంచలనం సృష్టించాడు. ప్రపంచ రెండో ర్యాంకర్, డెన్మార్క్‌కు చెందిన అండెర్స్ అంటోన్సెన్‌పై శంకర్ అద్భుత విజయం సాధించాడు. తమిళనాడుకు చెందిన 21 ఏళ్ల శంకర్ బాసెల్‌లో జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 18-21, 21-12, 21-5తో ఆంటోన్సెన్‌ను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. 2022ప్రపంచజూ. చాంపి యన్‌షిప్‌లో రజత పతకం సాధించిన శంకర్ 66 నిమిషాల పోరులో ఆంటోన్సెన్ ఆట కట్టించాడు. ప్రపంచ సీనియర్ చాంపియన్‌షిప్‌లో రెండుసార్లు రజతం, ఒకసారి కాంస్య పతకం నెగ్గిన ఆంటోన్సెన్ తొలి గేమ్ గెలిచినప్పటికీ ఆ తర్వాత ప్రపంచ 68వ ర్యాంకర్ శంకర్ ధాటికి చేతులెత్తేశాడు. క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 31వ ర్యాంకర్, ఫ్రాన్స్‌కు చెందిన క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్)తో శంకర్ తలపడతాడు. మరోవైపు మహిళల డబుల్స్ విభాగంలో భారత నం.1 జోడీ పుల్లెల గాయత్రి-ట్రెసాజాలీ సెమీఫైనల్లోకి అడుగుపెట్టింది. క్వార్టర్ ఫైనల్లో గాయత్రి-ట్రెసా ట్రెసా జాలీద్వయం 21-18, 21-14తో హాం కాంగ్‌కు చెందిన పుయ్ లామ్‌యెంగ్-ఎన్గా టింగ్ యెయుంగ్ జంటపై విజయం సాధించింది.

# ఐపిఎల్‌లో ఫ్యూచర్ స్టార్స్
### లిస్ట్‌లో 8 మంది కుర్రాళ్లు.. లీగ్‌లో 13 యేళ్ల సూర్యవంశీ



**న్యూఢిల్లీ:** ప్రపంచవ్యాప్తంగా యువ ప్రతిభను బయటకు తీసుకురావడానికి ఐపీఎల్ ప్రసిద్ధి చెందింది. దేశంతో పాటు, ప్రపంచంలోని ఇతర జట్లకు కూడా స్టార్లను అందించింది. ఈ18వ సీజన్ ఐపీఎల్‌లో క్రికెట్ భవిష్యత్తుగా భావించే యువ ఆటగాళ్ళు పాల్గొంటున్నారు. 22 ఏళ్ల రాబిన్ మింజ్‌ను ముంబై రూ.65 లక్షలకు కొనుగోలు చేసింది. మింజ్‌కు ప్రస్తుతం 2 ఫస్ట్ క్లాస్‌మ్యాచ్‌లు, 7 టీ20 మ్యాచ్‌లఅనుభవం మాత్రమే ఉంది. ఎడమచేతి వాటం వికెట్ కీపర్‌బ్యాట్స్‌మన్ మింజ్ ఇప్పటికే డాషింగ్ బ్యాట్స్‌మన్‌గా ముద్ర వేశాడు. హెలికాప్టర్ షాట్‌లు, బ్యాటింగ్ వేగం, తుఫాన్ శైలిని చూస్తే, అతన్ని తదుపరి ధోని, క్రిస్‌గేల్ అని పిలుస్తున్నారు. కాగా 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ కాంట్రాక్ట్ పొందిన అతి పిన్న వయస్కుడు. రాజస్థాన్ రాయల్స్ రూ.1.1 కోట్లకు దక్కించుకుంది. ఎడమచేతి వాటం వైభవ్ పెద్ద షాట్లు కొట్టడంలో పేరొందాడు. గత ఏడాది ఆస్ట్రేలియాతో జరిగిన యూత్ టెస్ట్‌లో 58 బంతుల్లో సెంచరీ, అండర్19 ఆసియా కప్‌లో రెండు అర్ధ సెంచరీలు, బీహార్ తరఫున అండర్19 విభాగంలో ట్రిపుల్ సెంచరీ కూడా సాధించాడు. ఇక ముష్తాక్ అలీ టీ20ని ముంబై గెలవడంలో సూర్యాంశ్ షెడ్జ్‌ది కీలక పాత్ర.

విదర్భతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో 12 బంతుల్లో 36 పరుగులు, మధ్యప్రదేశ్‌తో ఫైనల్లో 15 బంతుల్లో 36 పరుగులు చేశాడు. ఇది కాకుండా, 9 ఇన్నింగ్స్‌లలో 8 వికెట్లు కూడా పడగొట్టాడు. 22 ఏళ్ల అతను ఈసారి పంజాబ్ కింగ్స్ రూ.30 లక్షలకు కొనుగోలు చేసింది. ఇక ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో ఎడమచేతి వాటం ఓపెనర్ ప్రియాంష్ ఆర్య ఒకే ఓవర్‌లో 6 సంచలన సిక్సర్లు కొట్టాడు. 50 బంతుల్లో 120 పరుగులు చేశాడు. 10 ఇన్నింగ్స్‌ల్లో 199 స్ట్రైక్ రేట్‌తో 608 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. తదుపరి ముష్తాక్ అలీ ట్రోఫీలో 9 ఇన్నింగ్స్‌ల్లో 177 స్ట్రైక్ రేట్‌తో 325 పరుగులు చేశాడు. పంజాబ్ కింగ్స్ అతన్ని రూ.3.4 కోట్లకు కొనుగోలు చేసింది. అలాగే వాయువేగానికి ప్రసిద్ధి చెందిన 20 ఏళ్ల లెగ్ స్పిన్నర్ విప్రజ్ నిగమ్ ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఆడబోతున్నాడు. యుపిటి20లో లక్నో ఫాల్కన్స్ తరఫున 11 ఇన్నింగ్స్‌లలో 11.15 స్ట్రైక్ రేట్, 7.45 ఎకానమీతో 20 వికెట్లు పడగొట్టాడు. లోయర్ ఆర్డర్‌లో పెద్ద షాట్లు కొట్టే సామర్థ్యం అతనికి ఉంది. 28 ఏళ్ల ర్యాన్ రికెల్టన్ ముంబై ఇండియన్స్ తరఫున రోహిత్ శర్మతో కలిసి ఓపెనర్‌గా ఆడబోతున్నాడు. ఈ దక్షిణాఫ్రికా వికెట్ కీపర్‌బ్యాట్స్‌మన్ ఎస్ఎ20 ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ ఎంఐ కేప్ టౌన్ తరఫున అద్భుతంగా రాణించాడు. పవర్‌ప్లే సమయంలో, అతను 177.41 అత్యధిక స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేశాడు. అంటే అతను తుఫాన్ బ్యాటింగ్‌లో నిపుణుడు. ముంబై అతన్ని కోటి రూపాయలకు కొనుగోలు చేసింది. గత ఏడాది వేలంలో కార్బిన్ బాష్ పేరు బిడ్డింగ్‌కు కూడా రాలేదు. కానీ టోర్నీ ప్రారంభానికి ముందు, ముంబై ఇండియన్స్ గాయపడిన విలియమ్స్ స్థానంలో అతనిని చేర్చింది. 30 ఏళ్ల ఈ ఆల్ రౌండర్ కొంత కాలంగా అద్భుతంగా ప్రదర్శన ఇచ్చాడు. ఎంఐ కేప్ టౌన్‌లో భాగమై మొత్తం సీజన్‌లో 11 వికెట్లు పడగొట్టి తొలిసారి ఛాంపియన్ చేయడంలో కీలక పాత్ర పోషించాడు. మిడిల్, డెత్ ఓవర్ల బౌలింగ్ ప్రత్యేకతతో పాటు, పెద్ద షాట్లు కొట్టే సామర్థ్యం కలిగిన ఇషాన్ మలింగను సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ.1.2 కోట్లకు కొనుగోలు చేసింది. శ్రీలంక తరఫున వన్డే అరంగేట్రం, పార్ల్ రాయల్స్ తరఫున టీ20 అరంగేట్రం చేశాడు. డెత్ ఓవర్లలో కొత్త బంతిని స్వింగ్ చేయడంలో, ఖచ్చితమైన యార్కర్లను బౌలింగ్ చేయడంలో అతను నిష్ణాతుడు.





# చరిత్ర సృష్టించిన పాకిస్థాన్
### మూడో టి 20లో న్యూజిలాండ్‌పై 16 ఓవర్లలోనే గెలుపు

**న్యూఢిల్లీ:** పాక్ క్రికెట్ జట్టు టీ20ల్లో సరికొత్త రికార్డు నెలకొల్పింది. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 205 పరుగుల భారీ లక్ష్యాన్ని కేవలం 16 ఓవర్లలోనే ఊదేసి పొట్టి క్రికెట్ చరిత్రలో అత్యంత వేగంగా 200 ప్లస్ టార్గెట్‌ను ఛేదించిన జట్టుగా చరిత్ర సృష్టించింది. అంతర్జాతీయ టీ20ల్లో 200 పైబడిన లక్ష్యాలను ఇంత తొందరగా ఏ జట్టూ ఛేదించలేదు. గతంలో ఈ రికార్డు సౌతాఫ్రికా పేరిట ఉండేది. సౌతాఫ్రికా 2007లో వెస్టిండీస్ నిర్దేశించిన 208 పరుగుల లక్ష్యాన్ని 17.2 ఓవర్లలో ఛేదించింది. ఇక ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆక్లాండ్ వేదికగా జరిగిన మూడో టీ20లో పాకిస్తాన్ న్యూజిలాండ్‌పై 9 వికెట్లు తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 19.5 ఓవర్లలో 204 పరుగుల భారీ స్కోర్ చేసి ఆలౌటైంది. మార్క్ చాప్‌మన్ 44 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 94 పరుగులు చేసి న్యూజిలాండ్ భారీస్కోర్ చేయడానికి దోహదపడ్డాడు. న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో బ్రేస్‌వెల్ (18 బంతుల్లో 31), టిమ్ సీఫర్ట్ (19), డారిల్ మిచెల్ (17), ఐష్ సోది (10) రెండంకెల స్కోర్లు చేయగా, ఫిన్ అలెన్ 0, నీషమ్ 3, మిచెల్ హే 9, జేమీసన్ 0, డఫీ 2 పరుగులకు ఔటయ్యారు. పాక్ బౌలర్లలో హారీస్ రౌఫ్ అద్భుతంగా బౌలింగ్ చేసి 3 వికెట్లు తీయగా, షాహీన్ అఫ్రిది, అబ్రార్ అహ్మద్, అబ్బాస్ అఫ్రిదితలో 2, షాదాబ్ ఖాన్ ఓ వికెట్ పడగొట్టారు. అనంతరం 205 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన పాక్ ఓపెనర్ హసన్ నవాజ్ (45 బంతుల్లో 105 నాటౌట్; 10 ఫోర్లు, 7 సిక్సర్లు) విధ్వంసకర శతకంతో విరుచుకుపడటంతో 16 ఓవర్లనే లక్ష్యాన్ని ఊదేసింది. నవాజ్‌కు మరో ఓపెనర్ మహ్మద్ హారీస్ (20 బంతుల్లో 41), కెప్టెన్ సల్మాన్ అఘా (31 బంతుల్లో 51 నాటౌట్) సహకరించడంతో పాక్ మరో 4 ఓవర్లు మిగిలుండగానే వికెట్ మాత్రమే కోల్పోయి విజయతీరాలకు చేరింది. పాక్ కోల్పోయిన ఏకైక వికెట్ డఫీకి దక్కింది. ఈ గెలుపుతో పాక్ 5 మ్యాచ్‌ల సిరీస్‌లో న్యూజిలాండ్ ఆధిక్యాన్ని 1-2కు తగ్గించింది. ఇక తొలి రెండు టీ20ల్లో న్యూజిలాండ్ ఘన విజయం సాధించింది. ఇక నాలుగో టీ20 ఈ నెల 23న మోంట్ మాంగనూయ్ వేదికగా జరుగనుంది.

# ఇన్వెస్టర్ల లాభం రూ.22 లక్షల కోట్లు

**ముంబై, మార్చి 22:** స్టాక్ మార్కెట్‌లు ఇటీవల భారీగా పతనమై చిన్నగా కోలుకుంటున్నాయి. ఈ క్రమంలో గడిచిన వారంలో వచ్చిన మార్కెట్ ర్యాలీ నాలుగేళ్లలో ఎప్పుడూ రాలేదని విశ్లేషకులు చెబుతున్నారు. కేవలం వారం రోజుల్లోనే సెన్సెక్స్ 3000 పాయింట్లు పెరగడంతో భారత స్టాక్ మార్కెట్ గణనీయమైన ర్యాలీని చూసింది. ఈ బుల్లిష్ రన్ ఇన్వెస్టర్ల సంపద అదనంగా రూ.22 లక్షల కోట్లు పెరిగింది. ఇటీవల కాలం వరకు భారీగా పతనమైన మార్కెట్లు వారంలో ఇంతటి ర్యాలీని అందించడంతో లాభాలను నమోదు చేసుకోవడానికి ఇది సరైన సమయమా లేదా మరింత కాలం వేచి చూడాలా అనేఅనుమానం వ్యక్తం అవుతుంది. దీనిపై నిపుణులు ఈ విధంగా సూచిస్తున్నారు. సెన్సెక్స్ ఇటీవల పుంజుకోవడానికి అనేక కారణాలున్నాయి. సానుకూల అంతర్జాతీయ సంకేతాలు, ద్రవ్యోల్బణ ఆందోళనలు తగ్గుముఖం పట్టడం, వచ్చే త్రైమాసిక ఫలితాల్లో బలమైన కార్పొరేట్ రాబడులుంటాయనే అంచ నాలు మార్కెట్ సెంటిమెంట్‌కు ఊతమిచ్చాయి. దీనికి తోడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల తీరు ర్యాలీకి మరింత ఊపునిచ్చాయి. ఇది భారత ఆర్థిక వ్యవస్థపై పెరుగుతున్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది. ఐటి, బ్యాంకింగ్, కన్జ్యూమర్ గూడ్స్ వంటి రంగాలు ఈ పెరుగుదలకు కీలకంగా దోహదపడ్డాయి. మార్కెట్లోని స్టాక్స్‌నుఅమ్మి లాభాలు బుక్ చేయాలా లేదా మరిన్ని లాభాలను ఆశించి పెట్టుబడులను నిలుపుకోవాలా అనేది ప్రతి ఇన్వెస్టర్ మదిలో మెదులు తున్న ప్రశ్న. దీనికి సంబంధించి నిర్ణయం తీసుకోవాలంటే కొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. మార్కెట్ ప్రస్తుత వాల్యుయేషన్ కీలక అంశం. చారిత్రాత్మక కొలమా నాలతో పోలిస్తే కొన్నిస్టాక్స్ ఇప్పటికీ అధికవాల్యూ యేషన్లలోనే ట్రేడ్ అవుతున్నాయి. వీటిలో దిద్దుబాటుఉండవచ్చు. అటువంటి సందర్భాల్లో పాక్షికం గా ప్రాఫిట్ బుకింగ్ చేసుకునే అవకాశంఉంటుంది. ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియోలో కూడా ఇలాంటి స్టాక్స్ ఉంటే వాటిని ట్రాక్ చేయడం చాలాముఖ్యం. ఇన్వె స్టర్లు తమ నిర్ణయాలను దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా మార్చు కోవాలి. భారతదేశం బలమైన ఆర్థిక మూలాలను దృష్టిలో పెట్టుకుని దీర్ఘకాలికంగా పెట్టుబడి పెట్టే వారు మరింత ఇన్వెస్ట్ చేసేందుకు వీలుంటుంది. తాత్కాలికంగా వచ్చే ర్యాలీకి ప్రభావితం చెంది ట్రేడ్‌లో నిర్ణయం తీసుకోకూడదు. ఏ ర్యాలీలోనైనా అన్ని రంగాలకు చెందిన స్టాక్స్ ఒకేలా పెరగవు, తగ్గవు. సెక్టోరల్ వారీగా స్టాక్స్‌ను విశ్లేషించి ప్రస్తు తం మెరుగైన రాబడినిస్తున్నవాటిని కొనసా గించాల్సి ఉంటుంది.




# బిజినెస్ నియమాలు పాటిస్తే లాభాల పంట..


**ముంబై, మార్చి 22:** ఇటీవల కాలంలో వ్యాపారంలో యువ వ్యాపారవేత్తలు అధికమయ్యారు. వ్యాపారంలో విజయం సాధించాలని ప్రతి ఒక్కరికీ ఉంటుంది. అయితే కష్టేఫలి అనే సూత్రం వ్యాపారులకు సరిపోదని కొంత మంది నిపుణులు చెబుతున్నారు. వ్యాపారం కోసం ప్రతిరోజూ 100శాతం ప్రయత్నం చేయడంవల్ల దీర్ఘకాలిక విజయం కంటే రాబడికి తగ్గే ప్రమాదం ఉందని వాదిస్తున్నారు. ఇటీవల ఓ ప్రముఖ వ్యాపారవేత్త 85 శాతం నియమంగా పిలిచే కొత్త నియమం సోషల్ మీడియా ప్లాట్ ఫారమ్ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. వ్యాపారస్తులు అధిక శ్రమను నివారించి, వ్యూహాత్మక, స్థిరమైన ప్రయత్నంపై దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు. సంవత్సరాలుగా నిరంతరం పని చేస్తున్నప్పుడు 100శాతం ఫలితం కోసం ప్రయత్నించడం వాస్తవానికి ఎదురుదెబ్బ తగలవచ్చని గ్రహించానని, బదులుగా ప్రత్యేకదృష్టితో పాటు వ్యూహాత్మక ప్రాధాన్యతను నేర్చుకునేలా 85 శాత నియమం పాటించాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా ఈ నియమం పాటించే సమయంలో అథ్లెట్ల గురించి ఆలోచిస్తే క్లారిటీ వస్తుందని నిపుణులు చెబుతున్నారు. అథ్లెట్లు కఠినంగా శిక్షణ పొందుతారు. కానీ ఎప్పుడు విశ్రాంతి తీసుకోవాలో? తెలుసుకుని విశ్రాంతి తీసుకోవడంతో సంపూర్ణ ఉత్తమ ప్రదర్శన ఇస్తారని చెబుతున్నారు. వ్యాపారాన్ని నడపడం కూడా ఓ గేమ్ లాంటిదని, కానీ ముందుగా విజయాన్ని చేరుకునే కంటే స్థిరత్వంతో విజయాన్ని చేరుకుంటే ఎక్కువ లాభాలను పొందవచ్చని చెబుతున్నారు. స్టార్టప్‌ను నిర్మించడం ఒక సుదీర్ఘ ప్రయాణమని, ఇది త్వరిత స్ప్రింట్ కాదని చెబుతున్నారు. ప్రతిరోజూ పూర్తి శక్తితో పనిచేయడానికి ప్రయత్నించడం స్థిరమైనది కాదని, ప్రతిరోజూ 80 నుంచి 85 శాతం కృషిని లక్ష్యంగా చేసు కోవడం ద్వారా మనం నిజంగా ముఖ్యమైన విషయా లపై దృష్టి పెట్టవచ్చని వివరిస్తున్నారు. నియమం అనేక మంది వ్యాపారస్తులకు నచ్చింది. ఈ మేరకు ఆమె పోస్ట్‌కు రిప్లయ్ ఇస్తున్నారు. అయితే ఈ నియ మం ఎక్కువ గంటలు, నిరంతర కృషిని కీర్తించే ప్రబలంగా ఉన్న 'హస్టిల్ సంస్కృతి'ని సవాలు చేస్తుంది.



## వాణిజ్యం

# ట్విట్టర్ బ్లూ బర్డ్ లోగో వేలం..

**వాషింగ్టన్, మార్చి 22:** సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్విట్టర్ ఎలాన్ మస్క్ స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి కంపెనీలో ఎలాన్ మస్క్ అనేక మార్పులు చేశారు. గతంలో ఉన్న బ్లూబర్డ్ లోగోను 'ఎక్స్'తో రీ బ్రాండ్ చేశారు. తాజాగా ఈ ఐకానిక్ బ్లూబర్డ్ లోగోకు 'ఆర్ఆర్ ఆక్షన్' సంస్థ వేలం నిర్వహించింది. ఈ వేలంలో లోగో 35వేల డాలర్లకు అంటే దాదాపు రూ.30 లక్షలకు అమ్ముడైంది. ఒకప్పుడు శాన్‌ఫ్రాన్సిస్కోలోని హెడ్‌క్వార్టర్ వద్ద దర్శనమిచ్చిన బ్లూ బర్డ్ లోగోను వేలంలో మంచి ధర పలికిందని ఆర్ఆర్ ఆక్షన్ తెలి పింది. 12 అందుగుల పొడుగు, 9 అడుగుల వెడల్పు, 254 కిలోల బ్లూ బర్డ్ గుర్తు దాదాపు రూ.30 లక్షలకు అమ్ముడైందని పేర్కొంది. అయితే వేలంలో దీనిని దక్కించుకున్న వ్యక్తి వివరాలను ఆయన అభ్యర్థన మేరకు 'ఆర్ఆర్ ఆక్షన్' సంస్థ ప్రకటించలేదు. 2022 అక్టోబర్‌లో ట్విట్టర్‌ను ఎలాన్ మస్క్ కొనుగోలు చేసిన విషయం విదితమే. అందుకోసం ఆయన ఒక్కో స్టాక్‌కు 54.20 డాలర్ల చొప్పున 44 బిలియన్ డాలర్లు చెల్లించారు. ఆ తర్వాత ఈ సామాజిక మాధ్యమ సంస్థలో అనేక మార్పులు చేశారు. దాదాపు 75శాతం మంది ఉద్యోగులను తొలగించారు. సంస్థ పేరును ట్విట్టర్ నుంచి 'ఎక్స్'గా మార్చారు. కంటెంట్ మోడరేషన్ లోనూ అనేక మార్పులు తీసుకొ చ్చా రు. ఎక్స్‌లోని పాత విలువైన జ్ఞాపకాలను ఆ సంస్థ అధినేత మస్క్ వేలానికి పెట్టారు. దీనిలో ట్విట్టర్ ప్రధాన కార్యాలయంపై ఉన్న పిట్ట బొమ్మ సైన్‌బోర్డ్ కూడా ఉంది.



# ఎస్‌బిఐ, ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకు క్రెడిట్ కార్డుల్లో మార్పులు!

**న్యూఢిల్లీ, మార్చి 22:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ), ఐడీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డ్ నియమాలలో మార్పులు జరగనున్నాయి. కొత్త ఆర్థిక సంవత్సరం 202526 మరో వారం రోజుల్లో ప్రారంభం కానుంది. అనేక బ్యాంకుల క్రెడిట్ కార్డ్ కస్టమర్లకు చాలా మార్పులు జరగబోతు న్నాయి. ఈ విషయంలో భారతదేశపు అతిపెద్ద బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ), ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ కస్టమర్లు వారి క్రెడిట్ కార్డులకు సంబంధించిన కొన్ని మార్పులను ఎదుర్కోవలసి ఉంటుంది. ఏప్రిల్ 1, 2025 నుండి ఈ మార్పులు జరగనున్నాయి. ఇది వారి వినియోగదారులను నేరుగా ప్రభావితం చేస్తుంది. ఎస్‌బీఐ కార్డులపై కొన్ని రివార్డ్ పాయింట్లు, సౌకర్యాలు మారబోతున్నాయి. ఉదాహరణకు, సింప్లీక్లిక్ స్విగ్గీ క్రెడిట్ కార్డ్‌పై రివార్డ్ పాయింట్లు ఇప్పుడు 10ఎక్స్ నుండి 5ఎక్స్‌కి తగ్గించనుంది. దీని కారణంగా, స్విగ్గీ ద్వారా ఉపయోగించే సేవలకు కస్టమర్లకు తక్కువ రివార్డ్ పాయింట్లు లభిస్తాయి. దీనితో పాటు, ఎయిర్ ఇండియా సిగ్నేచర్ కార్డుపై లభించే రివార్డ్ పాయింట్లు కూడా తగ్గించనుంది బ్యాంకు. ఇది 30 నుండి 10 కి తగ్గుతుంది. దీని అర్థం ఎయిర్ ఇండియాతో ప్రయాణించే కస్టమర్లకు కూడా తక్కువ పాయింట్లు లభిస్తాయి. ఎస్‌బీఐ కార్డ్ అందించే ఉచిత బీమా కవర్ కూడా జూలై 26, 2025 నుండి నిలిపివేయనుంది. ఇందులో రూ.50 లక్షల విమాన ప్రమాద కవరేజీ, రూ.10 లక్షల రైల్వే ప్రమాద కవరేజీ కూడా ఉన్నాయి. ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ క్లబ్ విస్తారా కార్డ్ సభ్యులు మార్చి 31, 2025 తర్వాత వోచర్లు, క్లబ్ విస్తారా సిల్వర్ సభ్యత్వం వంటి ప్రయోజనాలను పొందలేరు. దీనితో పాటు కస్టమర్లు మార్చి 31, 2026 వరకు మహారాజా పాయింట్లను పొందవచ్చు. అయితే దానివిలువ తగ్గుతుంది. అదనంగా ప్రీమియం ఎకానమీ ఛార్జీలతో అధిక ధరల టిక్కెట్లకు మైలురాయి వోచర్లు జారీ చేయదు. ఇప్పటి నుండి తమ కార్డులను పునరుద్ధరించుకునే కస్టమర్‌లు కోల్పోయిన ప్రయోజనాలకు పరిహారంగా ఒక సంవత్సరం వార్షిక రుసుము క్రెడిట్‌ను పొందు తారు. ఈ మార్పులన్నీ ఏప్రిల్ 2025 నుండి అమలులోకి రానున్నాయి.






Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 3rd Mile Stone Renigunta Road, Tirupati-517506 Ph No :2238770, Fax:08772238790, RNI NO.64860/96, Editor: *Damerla Sai Baba, * Responsible for Selection of News under the PRB Act, Regd.:No.H/H.T.P/57, Postal Licence/TRP104/2006/2008 Surcharge:Delhi:40 Ps.